www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

మహిళల్లోనూ పెరుగుతున్న బట్టతల


ఒత్తిళ్లతో కూడిన జీవన శైలితోనే సమస్యలు

పౌష్టికాహార లోపం, జన్యుపరమైన కారణాలూ

తొలి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమే

జడ గట్టిగా వేసుకోవడం వల్ల కూడా ఇబ్బందే

గుంటూరు ఐఏ డీవీఎల్ సదస్సులో వక్తలు 11



సోమవారం | 2-12-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 227 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి మ. 12.44 తదుపరి విదియ; నక్షత్రం: జ్యేష్ఠ మ. 3.45 తదుపరి మూల; వర్జ్యం: రా. 12.04-1.43; దుర్ముహూర్తం: మ. 12.26-1.10, మ. 2.39-3.23; అమృతఘడియలు: ఉ. 6.33-8.08; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.33; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భూమి కోసం, భుక్తి కోసం జరిగిన పోరాటాలు అనేకం చూశాం. కానీ ఇది అందుకు పూర్తి భిన్నంగా...భూమి విముక్తి కోసం జరుగుతున్న పోరాటం. రైతాంగం, సామాన్య ప్రజలు అనునిత్యం అనుభవిస్తున్న నరకయాతన. జగన్ జమానాలో వైసీపీ నేతల భూదాహం, దౌర్జన్యాలు; రీ సర్వే పేరిట కొందరు రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు కలగలిసి చేసిన అరాచకాలు ప్రజలకు ఎనలేని కష్టాలను మిగిల్చాయి. అవి ఇప్పుడు ఆక్రందనల రూపంలో వెల్లువెత్తుతున్నాయి.

జగన్ పాలనలో రీ సర్వే తర్వాత రైతులకు ఇచ్చిన పాసు పుస్తకాల్లో భూమి కొలతలు, సరిహద్దులు, విస్తీర్ణం తదితర అంశాల్లో భారీ తేడాలున్నాయి. జగన్ బొమ్మలున్న పాస్ పుస్తకాలు రైతులు వద్దన్నారు. కూటమి ప్రభుత్వం వాటి పంపిణీని నిలిపివేసింది. కానీ, ఆ పుస్తకాల్లో అచ్చేసిన తప్పుల గురించి మాత్రం ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ భూమికి విముక్తి కల్పించాలని రైతులు కోరుతున్నారు. పాత సమస్యలు పరిష్కరించాలని, కొత్త సమస్యలు సృష్టించవద్దని వేడుకుంటున్నారు.

గ్రామసభల్లో వస్తున్న ఫిర్యాదుల్లో రీసర్వేపై వచ్చేవే అధికంగా ఉన్నాయి. ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి రీ సర్వే సమస్యలతోపాటు వ్యక్తిగతంగా అందుతున్న విన్నపాలకు పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దరఖాస్తుల పరిష్కారంపై థర్డ్‌పార్టీతో తనిఖీ (ఆడిట్)కూడా చేయించాలని ఆదేశించారు. ఆ తర్వాత ప్రతి దరఖాస్తుదారుకూ..'మీ సమస్య పరిష్కారం అయింది....సంతృప్తిగా ఉన్నారా? లేక మీ సమస్య పరిష్కారం అయినా న్యాయం జరగలేదని అనుకుంటున్నారా?' అంటూ బాధితులకు ప్రశ్నలు వేసి..వారి స్పందన కోరాలని భావిస్తున్నారు.



భూమి కోసం.. విముక్తి కోసం!

ప్రభుత్వానికి చేరుతున్న ప్రజా ఆక్రందనలు

- పాత గొడవలు పరిష్కరించండి
- కొత్తవి మాత్రం సృష్టించవద్దు
- రైతులు, బాధితుల విన్నపాలు
- వైసీపీ అరాచకాలపై ఫిర్యాదుల వెల్లువ
- 6 నెలల్లో 1,74,720 వ్యక్తిగత ఫిర్యాదులు
- అందులో రెవెన్యూ శాఖవే 67,928
- గ్రామసభల్లో రీసర్వేపైనే అధిక అభ్యంతరాలు
- జగన్ హయాం భూ కబ్జాలు, దురాక్రమణలు
- పాస్ పుస్తకాల్లో తేడాలపై రైతుల్లో ఆందోళన
- దిద్దుబాటు చర్యలపై సర్కారు కసరత్తు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'జగన్ పాలనలో మా భూములు పోయాయి...కాపాడండి' అంటూ అన్ని వర్గాల ప్రజలూ గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన మదనపల్లె ఉదంతం తర్వాత, ఇప్పటిదాకా దాదాపు ఆరు నెలల కాలంలో ప్రభుత్వానికి వేర్వేరు సమస్యలపై వ్యక్తిగతంగా 1,74,720 విన్నపాలు అందాయి. ఇందులో 1,26,301 విన్నపాలు జిల్లాల అధికారుల పరిశీలనలో ఉన్నాయి. అయితే, మొత్తం విన్నపాల్లో 67,928 కేవలం రెవెన్యూశాఖ పరిష్కరించాల్సినవే ఉన్నాయి. అంటే, భూ కబ్జాలు, భూ దురాక్రమణలు, పాస్ పుస్తకాల్లో తేడాలు, అసైన్డ్ ఇంటిస్థలాలు, రెవెన్యూ సేవలు అందించే అధికారులపై

మిగతా 12వ పేజీలో...

అరకొర వసతులు అద్దె భవనాలు



- పాడేరు కేంద్రంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి కూడా సొంత భవనం లేదు. జిల్లా రిజిస్ట్రేషన్, ఆడిట్, పన్నుల శాఖ, దేవదాయ శాఖ కార్యాలయాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి.
- ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడలో పూర్తి స్థాయి కలెక్టరేట్ భవనం లేదు. ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్న గత జగన్ ప్రభుత్వం పైసా కూడా విడుదల చేయలేదు.
- కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో వివిధ శాఖల్లో డివిజన్ స్థాయి అధికారులే జిల్లా ఇన్‌చార్జిలుగా పనిచేస్తున్నారు. కలెక్టర్, జేసీ, డీఆర్వో మినహా మిగిలిన శాఖల అధికారులు జిల్లా కేంద్రంలో నివాసం ఉండటం లేదు.
- నంద్యాలలోని బీఎస్ఎన్ఎల్ భవనంలో ఏడెనిమిది శాఖలకు కార్యాలయాలను కేటాయించారు. నిర్వహణ సరిగా లేకపోవటంతో చెత్తాచెదారం పేరుకుపోయి విషపురుగులు తిరుగుతున్నాయని ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

కొత్త జిల్లా కేంద్రాల్లో ఇంకా బాలారిష్టాలే

జగన్ పెట్టిన జిల్లాల కష్టాలు

- అడ్డగోలుగా విభజించి వదిలేసిన జగన్
- కనీస సౌకర్యాలూ సమకూర్చని వైనం
- అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- నిర్మాణానికి భూసేకరణా చేయలేదు
- నిధులు ఇస్తామని మొండిచేయి
- చాలా చోట్ల ఫర్నిచర్ కూడా ఇవ్వలేదు
- ఇరుకు గదుల్లోనే విధుల నిర్వహణ
- తగినంత సిబ్బందినీ కేటాయించలేదు
- ఇన్‌చార్జి అధికారులతోనే పాలన

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దుకాణ సముదాయాలు, కళాశాలలు.. చివరకు సెల్లార్లు, అపార్టుమెంట్లలో కూడా ప్రభుత్వ కార్యాలయాలు! కొన్ని చోట్ల అయితే మరీ ఇరుకు గదుల్లో విధుల నిర్వహణ. కనీస వసతుల్లేవు. ఇలా.. ఎన్నెన్నో సమస్యలు. నాడు జగన్ ప్రభుత్వంలో జిల్లాలను అడ్డగోలుగా విభజించి ఏర్పాటు చేసిన కొత్త జిల్లా కేంద్రాలలో ఇదీ దుస్థితి. జగన్ అస్తవ్యస్త పాలనకు సజీవ సాక్ష్యంగా ఉన్నాయి. రెండున్నరేళ్ల క్రితం ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా...

మిగతా 11వ పేజీలో...

తిరుపతి కలెక్టరేట్‌కు శాశ్వత భవనం లేదు. టీటీడీ యాత్రికుల కోసం నిర్మించిన పద్మావతీ నిలయం భవన సముదాయంలో ఇలా సర్దుబాటు



తిరుపతి: ఎస్పీ ఆఫీసుకు మాత్రమే

తిరుపతి జిల్లాలో ఎస్పీ ఆఫీసు మినహా ఇతర శాఖలకు సొంత భవనాల్లేవు. తిరుపతి జిల్లా ఏర్పాటు కాక మునుపే ఇక్కడ అర్బన్ ఎస్పీ కార్యాలయానికి శాశ్వత భవనం అందుబాటులో ఉంది. దీన్నే వాడుకుంటున్నారు. ఇక కలెక్టరేట్ సహా దాదాపు అన్ని శాఖల కార్యాలయాలూ అద్దె భవనాలు లేక డివిజన్ కార్యాలయాల్లో సర్దుబాటు చేసుకుని నడుస్తున్నాయి. ఏ కార్యాలయ భవనానికీ స్థల సేకరణ జరగలేదు. టీటీడీ యాత్రికుల కోసం నిర్మించిన పద్మావతీ నిలయం భవన సముదాయాన్ని అద్దె ప్రాతిపదికన కలెక్టరేట్ కోసం కేటాయించారు. ఏడాదికి రూ.1.25 కోట్ల అద్దె చెల్లించేలా టీటీడీ, ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. కలెక్టరేట్ కోసం ఆ భవనాన్ని శాశ్వతంగా కేటాయించేలా గత ప్రభుత్వం ప్రతిపాదించగా... దీన్ని సవాల్ చేస్తూ బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆ ప్రతిపాదన పెండింగ్‌లో పడింది. ఈ భవనంలోనే చాలా వరకూ కార్యాలయాలు ఏర్పాటయ్యాయి.

హమ్మయ్య.. ముప్పు తప్పింది

రిడ్జ్ ప్రభావంతో తప్పిన పెను తుఫాను ప్రమాదం

- నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు.. లోతట్టు ప్రాంతాలు జలమయం
- 4,463 హెక్టార్లలో పంటల మునక
- పుత్తూరులో 18.7 సెంటీమీటర్ల వర్షపాతం
- తిరుమల ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు
- కొండపై నిండుతున్న జలాశయాలు
- నేడు, రేపు తేలికపాటి వర్షాలు


నెల్లూరు జిల్లా అల్లూరులో నీట మునిగిన వరినాట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఫెంగల్ తుఫాన్ తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. శనివారం రాత్రి పుదుచ్చేరి సమీపంలో తీరంపైకి వచ్చినప్పటి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు(సుమారు 12 గంటలపాటు) అక్కడే స్థిరంగా కొనసాగిన తర్వాత తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ఆదివారం రాత్రి తరువాత మరింత బలహీనపడి పశ్చిమ, వాయువ్యంగా పయనిస్తూ కర్ణాటక మీదుగా అరేబియా సముద్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. తుఫాన్ ప్రభావంతో ఆదివారం ఉదయం వరకు

మిగతా 12వ పేజీలో...

పుదుచ్చేరిలో తుఫాన్ బీభత్సం

- కుండపోత వర్షాలతో అతలాకుతలం
- 24 గంటల్లో 51 సెం.మీ. వాన.. నీట మునిగిన గ్రామాలు
- జనావాసాల్లో రెండడుగుల మేర నీటి ప్రవాహం
- తేరుకుంటున్న చెన్నై.. 350 ప్రాంతాల్లో కడగండ్లు



డాలర్‌తో పెట్టుకుంటే.. 2

టాటా చెప్పాల్సిందే!

- 100 శాతం సుంకాలు విధిస్తాం
- అమెరికా మార్కెట్లోకి అనుమతివ్వం
- ప్రత్యేక కరెన్సీ సృష్టించబోమని హామీ ఇస్తేనే కఠిన చర్యలు ఉండవు
- బ్రిక్స్ కూటమికి ట్రంప్ హెచ్చరిక



ఎఫ్‌బీఐ చీఫ్‌గా 2

కశ్యప్ పటేల్

- అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ అధిపతిగా ప్రవాస భారతీయుడు

నెత్తురోడిన అడవి 10

ఏటూరునాగారంలో ఏడుగురు మావోయిస్టుల కాల్చివేత

- ఎన్‌కౌంటర్‌లో నర్సంపేట ఏరియా, ఏటూరు నాగారం డివిజన్ కార్యదర్శులు మృతి
- నిద్రిస్తున్న దళంపై పోలీసుల దాడి!?.. ప్రతిఘటించలేక చెల్లాచెదురైన వైనం


ప్రజలు చెప్పిందే ఫైనల్..! 10

- పథకాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రజలిచ్చే రేటింగ్‌తో మార్పులు, చేర్పులు
- ఐవీఆర్ఎస్ వాడాలని ప్రభుత్వ నిర్ణయం

ఇంటర్ ఉత్తీర్ణత పెంచేందుకు

'సంకల్ప్' 11


- 3 కేటగిరీలుగా విద్యార్థుల వర్గీకరణ
- గ్రూపుల వారీగా కేర్‌టేకర్ల నియామకం
- ప్రత్యేకంగా స్టడీ సమయం నిర్వహణ



కనీసం ముగ్గురిని కనండి

- జనాభా క్షీణిస్తే సమాజమే అంతరిస్తుంది! 2
- భాషలు, సంస్కృతి కూడా కనుమరుగవుతాయి
- ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలు

కనీసం ముగ్గురిని కనండి



» జనాభా క్షీణిస్తే సమాజమే అంతరిస్తుంది!

» సంఘ్ చీఫ్ భాగవత్ స్పష్టీకరణ

నాగపూర్, డిసెంబరు 1: ప్రతి భారతీయ కుటుంబం కనీసం ముగ్గురేసి పిల్లలను కనాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భాగవత్ పిలుపిచ్చారు. జనసంఖ్య క్షీణిస్తే సమాజమే అంతరిస్తుందని హెచ్చరించారు. ఆయన ఆదివారమిక్కడ నాగపూర్‌లో నిర్వహించిన 'కథాలే కుల్ సమ్మేళన్'లో ఆయన ప్రసంగించారు. ప్రస్తుత జనాభా విధానం పాతికేళ్లనాటిదని.. 1998లో లేదా 2002లో ఖరారు చేశారని.. జన సంఖ్య వృద్ధి రేటు 2.1కి తగ్గకూడదని అందులో స్పష్టం చేశారని గుర్తుచేశారు. 'కుటుంబం సమాజంలో భాగం. ప్రతి కుటుంబం ఓ యూనిట్. జనాభా తగ్గుదల ఆందోళన కలిగించే అంశం. వృద్ధి రేటు 2.1కి తక్కువగా ఉంటే. సమాజం అంతరించిపోతుంది. ఆ పరిస్థితుల్లో దానినెవరూ నాశనం చేయనక్కర్లేదు. తనంత తానే నాశనమవుతుంది. భాషలూ కనుమరుగవుతాయి. సంస్కృతీ నశిస్తుంది. ప్రతి జంటా ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలను.. కనీసం ముగ్గురిని కనాలి. ఈ విషయాన్ని జన సంఖ్య శాస్త్రమే చెబుతోంది. సమాజం మనుగడ సాగించాలంటే పిల్లల సంఖ్య ముఖ్యం' అని భాగవత్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణ, మతపరమైన జనాభా.. ఈ రెండు అంశాలూ విస్మరించడానికి వీల్లేనివని చెప్పారు. గతంలో నాగపూర్‌లోనే జరిగిన దసరా ర్యాలీలో కూడా ఆయన జనాభా పెరుగుదల అవసరాన్ని నొక్కిచెప్పారు. ప్రతి కోణంలో ఆలోచించి అన్ని వర్గాలకు వర్తించేలా నూతన జనాభా విధానాన్ని రూపొందించాలని ఆ సందర్భంగా అన్నారు. వివిధ వర్గాల జనాభాలో అసమతుల్యం.. భౌగోళిక సరిహద్దులనూ ప్రభావితం చేస్తుందని తెలిపారు. 'జనాభా అత్యధికంగా ఉంటే భారం ఎక్కువగా ఉంటుందన్నది నిజమే. కానీ జనాభాను సక్రమంగా వినియోగించుకుంటే అదో వనరుగా మారుతుంది. 50 ఏళ్ల తర్వాత మన దేశం ఎంత మందికి ఆహారం అందించగలుగుతుందనేది కూడా పరిగణనలోకి తీసుకోవాలి' అని భాగవత్ అభిప్రాయపడ్డారు. మహిళను తల్లిగా పరిగణించడం మంచిదేనని.. అయితే వారిని ఇళ్లలో నాలుగు గోడలకే పరిమితం చేయడం మంచిది కాదని చెప్పారు.


మోదీపై ఒవైసీ ఫైర్

భాగవత్ వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. 'ముస్లిం మహిళలు ఎక్కువ మంది పిల్లలను కంటున్నారని ఆయన గతంలో అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తల్లులు, కుమార్తెల నుంచి బంగారం, మంగళసూత్రాలు లాక్కుని ముస్లింలకు పంచుతారని ప్రచారం చేశారు. ఇప్పుడు భాగవత్ ఎక్కువ మంది పిల్లల్ని కనాలంటున్నారు. ఇక ఆర్ఎస్ఎస్‌వాళ్లు పెళ్లిళ్లు చేసుకోవడం మొదలుపెట్టండి' అని అన్నారు.

ప్రపంచ జనాభా తగ్గుముఖం..

1960-2000 మధ్య ప్రపంచ జనాభా రెట్టింపైంది. ఆ తర్వాత నుంచి తగ్గుముఖం పడుతూ వస్తోందని పలు అధ్యయన నివేదికలు చెబుతున్నాయి. జనాభా భర్తీ రేటు 2.1కి సమీపంలో ఉన్న దేశాల్లో భారత్, అర్జెంటీనా, ట్యునీసియా.. 2.1 కంటే తక్కువ రేటు ఉన్న దేశాల్లో అమెరికా, మెక్సికో, బ్రెజిల్ ఉన్నాయి. చైనా, జపాన్, దక్షిణ కొరియాల్లో ఇంకా బాగా తక్కువగా ఉండడమే గాక వృద్ధుల జనాభా పెరిగిపోతోంది. భారత్‌లోని పలు రాష్ట్రాలకు కూడా ఆ ముప్పు పొంచి ఉండడంతో.. పిల్లలను ఎక్కువగా కనాలని ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల పదే పదే చెబుతున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో జనాభా నియంత్రణకు గట్టి పట్టు పట్టిన ఆయన.. ఇప్పుడు సమీప భవిష్యత్‌లో యువజనుల సంఖ్య తగ్గే ప్రమాదం కనబడుతుండడంతో ఆంధ్ర ప్రజలు ఎక్కువ సంతానాన్ని కనాలని కోరుతున్నారు.

లోకం తీరు



18 ఏళ్లకే పైలట్.. కర్ణాటక యువతి రికార్డు



బెంగళూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని విజయపురకు చెందిన సమైరా హుల్లూరు అనే యువతి 18 ఏళ్ల వయసుకే పైలట్ అయ్యారు. ఈ ఘనత సాధించిన దేశంలోనే అత్యంత పిన్న వయస్కురాలిగా ఆమె రికార్డు సృష్టించారు. విజయపురలోనే శిక్షణ పూర్తి చేసిన సమైరా.. ఆరు నెలలపాటు ఢిల్లీలో పైలట్‌గా తర్ఫీదు పొందారు. 18 ఏళ్లకే కమర్షియల్ పైలట్ లైసెన్స్ సాధించారు. ఈ సందర్భంగా సమైరా మాట్లాడుతూ.. 25 ఏళ్ల వయసులో పైలట్ అయిన కెప్టెన్ తపేశ్ కుమార్ తనకు ప్రేరణ అని అన్నారు. సమైరా విజయంపై దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఐన్‌స్టీన్, హాకింగ్‌ను మించిన ఐక్యూ

» భారత సంతతి బ్రిటిష్ కుర్రాడి ఘనత



లండన్, డిసెంబరు 1: ఆ భారత సంతతి బ్రిటిష్ కుర్రాడి వయసు 10 ఏళ్లు..! పేరు కశ్యప్ అరోరా. పిట్టకొంచెం కూత ఘనం అన్నట్లుగా.. ఇంటెలిజెన్స్ కోషెంట్(ఐక్యూ)లో ఏకంగా అల్బర్ట్ ఐన్‌స్టీన్, కృష్ణబిలాలపై ఎన్నో పరిశోధనలు చేసిన స్టీఫెన్ హాకింగ్‌ను మించిపోయాడు. పదేళ్ల ప్రాయంలోనే 162 ఐక్యూ స్కోర్‌ను సాధించాడు. అంతేకాదు.. ఐక్యూ అధికంగా ఉన్న వారికి మాత్రమే పరిమితమైన 'మేన్సా' సొసైటీలో సభ్యుడైపోయాడు. త్వరలో క్వీన్ ఎలిజబెత్ స్కూల్‌లో చేరనున్నాడు. తనకు స్కూలుకు వెళ్లాలని ఉండదని.. అక్కడ కేవలం వాక్యాలను రాయడం.. చిన్నచిన్న లెక్కలపై సమస్యలను సాధించడంతోనే రోజంతా గడిచిపోతుందని.. తనకు ఆల్జీబ్రా అంటే ఇష్టమని క్రిష్ చెబుతున్నాడు. "క్రిష్‌కు లెక్కలంటే ఇష్టం. అయితే.. అతని నాలుగో ఏట మొత్తం లెక్కల పుస్తకాన్ని మూడు గంటల్లో పూర్తిచేశాడు. ఎనిమిదో ఏట.. తన క్లాస్ సబ్జెక్టులన్నింటినీ ఒక్కరోజులో చుట్టేశాడు" అని క్రిష్ తల్లిదండ్రులు వివరించారు. పియానో వాయించడంలో కూడా క్రిష్ దిట్ట.

బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈవోగా రాఘవేంద్ర జోషి బాధ్యతల స్వీకరణ



అల్వాల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈవోగా ప్రముఖ శాస్త్రవేత్త జైతీర్థ్ రాఘవేంద్ర జోషి ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన హైదరాబాద్‌లోని 'రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల(డీఆర్‌డీఎల్)'లో ప్రోగ్రామ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రస్తుత సీఈవో అతుల్ దినకర్ పదవీకాలం ముగియడంతో రక్షణ శాఖ ఈ నెల 26న జోషిని బ్రహ్మోస్ ఏరోస్పేస్ సీఈవోగా నియమించింది. ఆదివారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. జోషి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో బీటెక్ చేశారు. నిట్ వరంగల్‌లో పీహెచ్‌డీ చేశారు. క్షిపణి సాంకేతికతలో జోషికి 30ఏళ్లకు పైగా అనుభవం ఉంది. పృథ్వి, అగ్ని క్షిపణుల తయారీలో ఆయన పాత్ర ఉంది. ఉపరితలం నుంచి గాల్లోని లక్ష్యాలను ఛేదించగల దీర్ఘశ్రేణి క్షిపణుల(ఎల్ఆర్‌సామ్) తయారీ ప్రాజెక్టుకు డైరెక్టర్‌గా జోషి ఆ క్షిపణుల తయారీలో అత్యంత కీలక పాత్ర పోషించారు.

కువైట్ ఎయిర్‌పోర్టులో భారతీయుల పడిగాపులు

న్యూఢిల్లీ, డిసెంబరు 1: కువైట్ విమానాశ్రయంలో భారతీయులు సుమారు 23 గంటలపాటు పడిగాపులు పడాల్సి వచ్చింది. బహ్రెయిన్ నుంచి మాంచెస్టర్ వెళ్లాల్సిన గల్ఫ్ ఎయిర్ విమానంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆదివారం వేకువజామున దాన్ని కువైట్ మళ్లించారు. అప్పటి నుంచి భారతీయ ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. కువైట్‌లో భారతీయులకు వీసా ఆన్ అరైవల్ (వీఓఏ) సౌకర్యం లేదు. ఆ సదుపాయం ఉంటే నగరంలోని హోటళ్లకు వెళ్లే సదుపాయం ఉండేది. బ్రిటన్, గల్ఫ్ దేశాల వారికి వీఓఏ ఉండడంతో వారు హోటళ్లకు వెళ్లారు. విమానాశ్రయంలోని హోటళ్లలో ఉందామంటే గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ సమావేశాల కారణంగా అవన్నీ నిండిపోయాయి. చివరకు భారతీయ రాయబార కార్యాలయం జోక్యం చేసుకొని వారిని విమానాశ్రయం లాంజ్‌లో విశ్రమించే ఏర్పాటు చేసింది. దీనిపై హైదరాబాద్‌కు చెందిన ఆనందపు సాయి స్వామ్రాట్ అనే ప్రయాణికుడు ట్వీట్ ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

రష్యా రక్షణ బడ్జెట్ రూ.10.66 లక్షల కోట్లు!

మాస్కో, డిసెంబరు 1 : ఉక్రెయిన్‌తో జరుగుతున్న పోరులో పైచేయి సాధించడమే లక్ష్యంగా రష్యా తన రక్షణ రంగానికి బడ్జెట్‌లో రికార్డు స్థాయిలో నిధులు కేటాయించింది. రష్యా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం 2025 బడ్జెట్‌లో రక్షణ రంగానికి 13.5 ట్రిలియన్ రుబెల్స్. భారత కరెన్సీలో రూ.10.66 లక్షల కోట్లకు పైగా మొత్తాన్ని కేటాయించారు. మొత్తం బడ్జెట్‌లో రక్షణ రంగానికే దాదాపు 32.5 శాతం నిధులు కేటాయించడం విశేషం. 2024 రక్షణ బడ్జెట్‌తో పోలిస్తే ఇది 28.3 శాతం అధికం. ఈ రూ.10.66 లక్షల కోట్ల బడ్జెట్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆమోదం కూడా తెలిపారు. కాగా, రష్యా.. ఉక్రెయిన్‌పై శనివారం జరిపిన క్షిపణి దాడిలో క్షతగాత్రుల సంఖ్య 24కు చేరింది. రష్యా సైన్యం ఆదివారం 78 డ్రోన్లతో దాడి చేయగా వాటిలో 32 డ్రోన్లను కూల్చివేశామని ఉక్రెయిన్ వాయుసేన ప్రకటించింది. ఉక్రెయిన్‌లోని కెర్సన్ నగరంలో ఓ మినీ బస్సుపై ఆదివారం ఉదయం జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు మరణించగా, ఏడుగురు గాయపడ్డారు.

సిరియాలో 300 మంది రెబల్స్ హతం

అలెప్పో, డిసెంబరు 1: సిరియాలో మళ్లీ అంతర్యుద్ధ భయాందోళనలు నెలకొంటున్న వేళ ఆ దేశానికి రష్యా మద్దతుగా నిలిచింది. సిరియా అధ్యక్షుడు బషర్ అల్- అస్సద్‌కు వ్యతిరేకంగా ఒకప్పటి అల్‌ఖైదా అనుబంధ సంస్థ హయాత్ తహ్రీర్ అల్- షమ్ తిరుగుబాటు జెండా ఎగురవేసి ఒక్కో పట్టణాన్ని ఆక్రమిస్తూ వెళుతున్న క్రమంలో ఆదివారం తాము సిరియాలో తిరుగుబాటుదారులపై వైమానిక దాడులు జరిపినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ దాడుల్లో హయాత్ తహ్రీర్ అల్-షమ్ సంస్థ ముఖ్య నాయకులు అహ్మద్ హుస్సేన్ అల్ షరా, అకా అబూ మహమ్మద్ అల్ జురానీ సహా 300 మంది తిరుగుబాటుదారులు మృతి చెందినట్లు వెల్లడించింది. కాగా, ఆదివారం తిరుగుబాటుదారులు సిరియాలో రెండో అతిపెద్ద నగరమైన అలెప్పోను ఆక్రమించారు.

4న పీఎస్ఎల్వీ-సీ59 ప్రయోగం

సూళ్లూరుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇస్రో విజయాశ్వం పీఎస్ఎల్వీ రాకెట్ మరో ప్రయోగానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్‌లోని ప్రథమ ప్రయోగవేదిక నుంచి ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4:08 గంటలకు పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించి రాకెట్ నాలుగు దశల అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తిచేసి ప్రయోగానికి సిద్ధం చేశారు. ఈ రాకెట్ ద్వారా 550 కిలోల బరువు గల యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ)కి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు.

ఎఫ్‌బీఐ చీఫ్‌గా కశ్యప్

అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థకు అధిపతిగా భారతీయ మూలాలున్న కాష్ పటేల్ నియామకం!

» ఆయనో తెలివైన న్యాయవాది: ట్రంప్

» ఎఫ్‌బీఐ చీఫ్ నియామకానికి సెనెట్ ఆమోదం తప్పనిసరి



న్యూయార్క్, డిసెంబరు 1: అమెరికాలో 'ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ)'.. అంటే మన దేశంలో సీబీఐ లెక్క! అంతటి కీలకమైన విభాగానికి అధిపతిగా భారత సంతతికి చెందిన కశ్యప్ పటేల్ (44)ను నియమించనున్నట్లు ప్రెసిడెంట్ ఎలెక్ట్ డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. కశ్యప్ పటేల్ అమెరికాలో కాష్ పటేల్‌గా సుప్రసిద్ధుడు. ఈ నేపథ్యంలో.. "ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు తదుపరి డైరెక్టర్‌గా కశ్యప్.. కాష్ పటేల్.. సేవలందిస్తారని ప్రకటించడానికి నేను గర్విస్తున్నాను" అని ట్రంప్ తన సోషల్ మీడియా ఖాతా 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. "కాష్ సూక్ష్మబుద్ధిగల న్యాయవాది, పరిశోధకుడు. అవినీతి గుట్టు రట్టు చేయడానికి, న్యాయాన్ని కాపాడడానికి, అమెరికా ప్రజల పరిరక్షణకే ఆయన కెరీర్ అంతా పాటుపడ్డారు" అని ట్రంప్ కొనియాడారు. "నా తొలి దఫా పాలనలో కాష్ రక్షణ శాఖలో చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా, నేషనల్ ఇంటెలిజెన్స్ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా, జాతీయ భద్రత మండలిలోని ఉగ్రవాద నిరోధక విభాగంలో సీనియర్ డైరెక్టర్‌గా అద్భుతంగా పనిచేశారు. ఎఫ్‌బీఐకి గతంలో ఉన్న విశ్వసనీయతను, ధైర్యాన్ని, నైతిక నిష్ఠను కాష్ పటేల్ తిరిగి తీసుకొస్తారు" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అమెరికా పాలనా యంత్రాంగంలోనూ, నిఘా, దర్యాప్తు సంస్థల్లోనూ విప్లవాత్మక మార్పులు అవసరమనే భావనలో ఉన్న ట్రంప్.. తనకు వీరవిధేయుడిగా పేరున్న కశ్యప్ పటేల్‌ను ఈ పదవికి ఎంచుకోవడం విశేషం. ఈ ప్రకటన నేపథ్యంలో.. ట్రంప్ జనవరి 20న అమెరికా అధ్యక్ష పదవి చేపట్టగానే, ఎఫ్‌బీఐ ప్రస్తుత డైరెక్టర్ క్రిస్టఫర్ రే తన పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. నిజానికి 2017లో ఆయన్ను నియమించింది ట్రంపే. కానీ, ఎన్నికల్లో ఓడిపోయాక ఎఫ్‌బీఐ అధికారులు తన కార్యాలయాలపై దాడులు చేయడంతో.. ట్రంప్ ఆ సంస్థపై ద్వేషం పెంచుకున్నారు. కాగా.. కాష్ పటేల్ నియామకానికి సెనెట్ ఆమోదం పొందాల్సి ఉంది.

గుజరాతీ మూలాలు

కాష్ పటేల్ తల్లిదండ్రులు తొలుత ఉగాండాలో ఉండేవారు. అక్కడ ఈడీ అమీన్ పాలనలో ప్రబలిన అరాచకాలను భరించలేక వారు 1970ల్లో అక్కణ్నుంచీ పారిపోయి అమెరికాలోని లాంగ్ ఐలండ్‌లో స్థిరపడ్డారు. కాష్ పటేల్ 1980లో న్యూయార్క్‌లోని గార్డెన్ సిటీలో కశ్యప్ జన్మించారు. 2005లో పేస్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా నుంచి 'జ్యూరిస్ డాక్టర్ (టీచర్ ఆఫ్ లా)' పట్టా పొందారు. అనంతరం ఫ్లోరిడాలో ఎనిమిదేళ్లపాటు పబ్లిక్ డిఫెండర్‌గా.. ఆ తర్వాత ఫెడరల్ పబ్లిక్ డిఫెండర్‌గా విధులు నిర్వర్తించారు. పబ్లిక్ డిఫెండర్‌గా ఆయన అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా, హత్య, మారణాయుధాలకు సంబంధించిన నేరాలు, ఆర్థిక నేరాలకు సంబంధించిన కేసులు వాదించారు. 2014లో.. అమెరికా న్యాయశాఖ జాతీయ భద్రత విభాగంలో ట్రయల్ అటార్నీగా చేరారు. ఆ సమయంలోనే.. జాయింట్ స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్‌కు సేవలందించారు. 2017లో హౌస్ ఇంటెలిజెన్స్ కమిటీలో ఉగ్రవాద నిరోధక విభాగంలో సీనియర్ కౌన్సెల్‌గా నియమితులయ్యారు. హౌస్ పర్మనెంట్ సెలెక్ట్ కమిటీలో స్టాఫర్‌గా పనిచేస్తున్నప్పుడు ట్రంప్ దృష్టిలో పడి ఆయన బృందంలో చేరారు. 2016 ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు వీలుగా రష్యా జోక్యం చేసుకుందన్న ఆరోపణలపై జరిపిన దర్యాప్తును రిపబ్లికన్ల తరఫున వ్యతిరేకించడంలో కీలక పాత్ర పోషించారు. ట్రంప్‌పై బైడెన్ సర్కారు తీరును నిరసిస్తూ 'గవర్న్‌మెంట్ గ్యాంగ్‌స్టర్స్' అనే పుస్తకాన్ని, ట్రంప్‌ను సింహంగా చిత్రీకరిస్తూ 'ద ప్లాట్ ఎగైనెస్ట్ ద కింగ్' అనే పుస్తకాన్ని రాశారు. ట్రంప్ గత ఎన్నికల్లో ఓడిపోయినా ఆయనతోనే ఉన్నారు.

చివరాఖరు: అయోధ్య రామాలయంలో బాల రాముడి ప్రతిష్ఠ కార్యక్రమ సమయంలో అమెరికన్ మీడియా అంతా భారతదేశంలో హిందూ జాతీయవాదం పెరిగిపోతోందంటూ వార్తాకథనాలు రాస్తే కాష్ వాటిని తీవ్రంగా ఖండించారు. గుజరాతీ మూలాలున్న కాష్.. మోదీ అభిమాని. అమెరికా అధ్యక్ష హోదాలో ట్రంప్ మనదేశానికి వచ్చినప్పుడు.. అహ్మదాబాద్‌లో ఆయన ప్రసంగంలో సచిన్, వివేకానందుడు వంటి పేర్లు వచ్చేలా చేయడంలో కీలక పాత్ర పోషించింది కాష్ పటేలే.

ప్రభుత్వాల ఆధీనంలో వక్ఫ్‌ఆస్తుల వివరాలు ఇవ్వండి

» రాష్ట్రాలను కోరిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ, డిసెంబరు 1: వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ... అనధికారికంగా రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోని వక్ఫ్ ఆస్తులపై దృష్టి సారించింది. వాటిపై వివరాలను అందించాల్సిందిగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కమిటీ కోరింది. ఈ ఆస్తులకు సంబంధించిన వాస్తవ, తాజా వివరాలు సమర్పించాలని కోరింది. పలు రాష్ట్ర ప్రభుత్వాలు అనధికారిక పద్ధతుల్లో వక్ఫ్ ఆస్తులు, భూములను తమ స్వాధీనంలో ఉంచుకున్నాయని సచార్ కమిటీ తన నివేదికలో పేర్కొన్న విషయాన్ని కమిటీ ప్రస్తావించింది. అలాగే, వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం.. వక్ఫ్‌బోర్డు తనవిగా (క్లెయిమ్) చెబుతున్న భూముల వివరాలూ సమర్పించాలని కోరింది. రాష్ట్రాలకు చెందిన వేర్వేరు వక్ఫ్‌బోర్డులతో కలిపి 2005-06లో సచార్ కమిటీ ఏర్పాటైంది. వక్ఫ్ ఆస్తులు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆక్రమణలకు గురైనట్టు, కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ పనికి పాల్పడినట్టు వచ్చిన ఆరోపణలను పరిశీలించడానికి ఈ కమిటీ ఏర్పాటైంది. తమ దృష్టికి వచ్చిన ఆరోపణలను పరిశీలించి తన నివేదికను కమిటీ సమర్పించింది. ఢిల్లీలో అత్యధికంగా 316 వక్ఫ్ ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని నాడు గుర్తించింది. ఇక.. రాజస్థాన్‌లో 60, కర్ణాటకలో 42, మధ్యప్రదేశ్‌లో 53, యూపీలో 60, ఒడిశాలో 53 ఆస్తులు పరాధీనమయ్యాయని తేల్చింది. అప్పటి సచార్ కమిటీ నివేదికను తాజాపరచాలని పార్లమెంటరీ కమిటీ నిర్ణయించినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తనకు కావాల్సిన సమాచారాన్ని కమిటీ తెప్పించుకొంటోంది. అలాగే, ఆస్తులపై యాజమాన్యం వంటి విషయాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు, వక్ఫ్‌బోర్డుకు మధ్య ఏమైనా న్యాయసంబంధ వివాదాలుంటే వాటి వివరాలూ అందించాలని సూచించారు.

డాలర్‌తో పెట్టుకుంటే.. టాటా చెప్పాల్సిందే!

100% సుంకాలు విధిస్తాం.. అమెరికా మార్కెట్లోకి అనుమతి ఉండదు

» బ్రిక్స్ కూటమికి ట్రంప్ హెచ్చరిక



ఫ్లోరిడా, డిసెంబరు 1: అమెరికా డాలర్ ప్రాభవాన్ని తగ్గించే ప్రయత్నాలు కొనసాగిస్తే బ్రిక్స్ కూటమి దేశాలపైన 100 శాతం సుంకాలు విధిస్తానని ఆ దేశ అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అంతేగాక, ఆయా దేశాలకు అమెరికా మార్కెట్లోకి ప్రవేశం లేకుండా తలుపులు మూస్తానన్నారు. ఈ మేరకు శనివారం 'ట్రూత్ సోషల్' అనే సోషల్ మీడియా వేదికలో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'కొత్తగా ఎటువంటి బ్రిక్స్ కరెన్సీని సృష్టించబోమని, బలమైన అమెరికా డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరే ఇతర కరెన్సీకి మద్దతు ఇవ్వబోమని బ్రిక్స్ దేశాలు మాకు హామీ ఇవ్వాలి. లేకపోతే వారు 100 శాతం సుంకాలు చెల్లించటానికి సిద్ధపడాలి. అంతేకాదు, అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి అమ్మకాలు జరపకూడదు' అని పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికా డాలర్ స్థానాన్ని బ్రిక్స్ భర్తీ చేయటం సాధ్యం కాదన్నారు. ఏ దేశం ఈ దిశగా ప్రయత్నించినా.. అమెరికాకు టాటా చెప్పాల్సిందేనని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం ట్రంప్ సుంకాల మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. అమెరికాలోకి పెద్ద ఎత్తున అక్రమ వలసలకు, డ్రగ్స్ సరఫరాకు మెక్సికో, కెనడా కారణమవుతున్నాయని.. ధోరణి మార్చుకోకపోతే వాటి ఎగుమతులపైన 25 శాతం సుంకం విధిస్తానని, ఇదే కారణాలతో చైనా మీద 10 శాతం సుంకం విధిస్తానని ట్రంప్ ఇటీవలే ప్రకటించారు. ఈ ఏడాది అక్టోబరులో రష్యాలో జరిగిన బ్రిక్స్ కూటమి సమావేశంలో.. సభ్యదేశాల మధ్య జరిగే వాణిజ్య లావాదేవీల్లో డాలర్లకు బదులు స్థానిక కరెన్సీలను ఉపయోగించాలన్న ప్రతిపాదన వచ్చింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ తాజా ప్రకటన చేశారు. ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ సభ్యదేశాలుగా ఉన్నాయి. ప్రస్తుత ప్రపంచ వాణిజ్యంలో డాలర్ ప్రాభవం బలంగా ఉంది. చమురు వంటి కీలకమైన సరుకుల అమ్మకాలు, కొనుగోళ్లు డాలర్లలోనే జరుగుతున్నాయి. ప్రపంచ విదేశీ మారక నిల్వల్లో డాలర్ల వాటా దాదాపు 58 శాతం ఉంది.

అక్రమ వలసదారుల కోసం పాక్ హోటల్‌కు 1860కోట్లా!

జో బైడెన్ ప్రభుత్వంపై రిపబ్లికన్ పార్టీ నేత వివేక్ రామస్వామి తీవ్ర విమర్శలు చేశారు. అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించేందుకు న్యూయార్క్‌లోని ఓ పాకిస్థాన్ హోటల్‌కు రూ.1,860 కోట్లు చెల్లించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. న్యూయార్క్‌లోని మాన్‌హట్టన్‌లో రూజ్‌వెల్ట్ హోటల్ ప్రస్తుతం పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్(పీఐఏ) యాజమాన్యంలో ఉంది. అమెరికాకు చెందిన రచయిత జాన్ లెఫెవ్రె ఇటీవల సోషల్ మీడియా వేదికగా "రూజ్‌వెల్ట్ హోటల్‌లో అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించేందుకు న్యూయార్క్ నగరం పాకిస్థాన్‌కు రూ.1,860 కోట్లు చెల్లిస్తోంది. సరైన పత్రాలు లేని వలసదారులంతా ప్రస్తుతం దీనిలో తక్కువ ధరకే ఉంటున్నారు. ఈ స్వీట్ డీల్ ద్వారా పాకిస్థాన్‌కు మంచి ఆదాయం సమకూరుతోంది" అన్నారు. దీనిపై వివేక్ స్పందిస్తూ.. "అమెరికాలోని పన్ను చెల్లింపుదారుల డబ్బుతో అక్రమ వలసదారులకు హోటల్‌లో విడిది ఏర్పాటు చేశారు. ఇది చాలా విడ్డూరంగా ఉంది" అని అన్నారు.

దేశం కోసమే మా పోరాటం

హక్కులను కేంద్రం కాలరాస్తోంది

» విమర్శలు గుప్పించిన ప్రియాంక



వయనాడ్, బెంగళూరు డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దేశం కోసమే తాము పోరాడుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ అన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను కాలరాస్తోందని, కొద్దిమంది తమ వ్యాపార మిత్రులకు సంపదను దోచిపెడుతోందని విమర్శలు గుప్పించారు. వయనాడ్‌లో ఈ ఏడాది జూలై 30న సంభవించిన వరదలకు ఇక్కడి ప్రజలు సర్వస్వం కోల్పోయారని, వారిని ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. వయనాడు పార్లమెంటు పరిధిలోని మనంతవాడీలో నిర్వహించిన సమావేశంలో ఆదివారం ప్రియాంకాగాంధీ ప్రసంగించారు. "ఏ వ్యవస్థలపై ఈ దేశ నిర్మాణం జరిగిందో ఆ వ్యవస్థలను అధికారంలో ఉన్నవారు నాశనం చేస్తున్నారు. అందుకే దేశం కోసం మేం పోరాటం చేస్తున్నాం" అని అన్నారు. వయనాడ్ విపత్తు బాధితులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిచేయి చూపాయని దుయ్యబట్టారు. మరోవైపు, కొద్ది మంది కుబేరులే లబ్ధి పొందున్నంత కాలం దేశం ప్రగతి సాధించలేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఒకవైపు అభివృద్ధి ఫలాలు కొద్ది మంది కోటీశ్వరులే అందుకుంటూ మరోవైపు ఆర్థిక విపత్తుల కారణంగా రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు జీవనం కోసం పోరాడుతుంటే అది ప్రగతి అనిపించుకోదని తెలిపారు. జీడీపీ వృద్ధి బాగా తగ్గినట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆదివారం ఆయన ఈ మేరకు ట్వీట్ చేశారు.

ఢిల్లీలో కాంగ్రెస్‌తో పొత్తు లేదు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, డిసెంబరు 1: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులపై ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తూ ఉండబోదని ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్ చెప్పారు. ఫిబ్రవరిలో జరగనున్న ఈ ఎన్నికల్లో కూటమి కట్టడం లేదన్నారు. ఆదివారమిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. తాము ఒంటరిగానే పోటీ చేస్తామని చెప్పారు. ఆప్, కాంగ్రెస్ పార్టీలు ఇండి కూటమిలో భాగస్వామ్యపక్షాలుగా ఉన్న సంగతి తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో ఈ పార్టీలు కలిసే పోటీ చేశాయి. కానీ, ఢిల్లీలో ఈ కూటమికి తీవ్ర నిరాశే మిగిలింది. మొత్తం 7 లోక్‌సభ స్థానాలూ బీజేపీ గెలుచుకుంది. ఇటీవల హరియాణా ఎన్నికల్లో కూడా ఆప్, కాంగ్రెస్ మధ్య పొత్తు కుదరలేదు. ఢిల్లీ ఎన్నికల్లో పొత్తులు లేకుండా పోటీ చేస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది.

మహా సీఎం ఫడణవీస్?

బీజేపీ సీనియర్ నేత వెల్లడి.. మోదీ, షాలదే తుది నిర్ణయమన్న శిందే

» ముంబైలో నేడు మహాయుతి భేటీ



ముంబై, డిసెంబరు1: మహారాష్ట్రకు కాబోయే ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీసేనని, ఒకటి రెండు రోజుల్లో లాంఛనంగా ఎన్నికవుతారని బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. మరోవైపు నేడు జరిగే మహాయుతి సమావేశంలో ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ సమావేశానికి బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్, శివసేన అధ్యక్షుడు, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ హాజరవుతారు. మంత్రిత్వ శాఖల కేటాయింపులపై ముగ్గురు నేతలు చర్చిస్తారు. హోం, పట్టణాభివృద్ధి, పీడబ్ల్యూడీ, ఆర్థిక శాఖలతో పాటు అసెంబ్లీ స్పీకర్ పదవిపై మూడు పార్టీల మధ్య గట్టి పోటీ ఉండటంతో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఆదిరింది. హోం, స్పీకర్ పదవి విషయంలో బీజేపీ పట్టు వదలడం లేదు. ఈ కారణం వల్లే కొత్త సీఎం ప్రకటన ఆలస్యం అవుతోందని సమాచారం. డిసెంబరు రెండులోగా దీనిపై తేల్చుకోవాలని, లేదంటే తామే నిర్ణయిస్తామని అమిత్ షా మహాయుతి కూటమి నేతలకు స్పష్టం చేసినట్లు తెలిసింది. దీంతో శాసనసభాపక్షను ఎన్నుకునేందుకు బీజేపీ ఎమ్మెల్యేలు నేడు లేదా రేపు సమావేశం కానున్నారు. దేవేంద్ర ఫడ్నవీస్‌ను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంటారని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

మౌనం వీడిన ఏక్‌నాథ్ శిందే

సొంతూరుకు వెళ్లిన శిందే తన మౌనాన్ని వీడారు. మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలదే తుది నిర్ణయమన్నారు. మహాయుతి కూటమిలో ఎలాంటి విభేదాలు లేవని శిందే స్పష్టం చేశారు. తన ఆరోగ్యం మెరుగుపడిందని చెప్పారు.

డిప్యూటీ సీఎం రేసులో శిందే తనయుడు

మహారాష్ట్రలో కొత్తగా ఏర్పడే మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ శిందే తనయుడు శ్రీకాంత్ శిందే డిప్యూటీ సీఎం రేసులో ఉన్నారని తెలుస్తోంది. మీడియాలో దీనిపై చర్చ జరుగుతోందన్న ఏక్‌నాథ్ శిందే ఈ ప్రతిపాదనను మాత్రం తోసిపుచ్చలేదు. దీంతో శ్రీకాంత్ శిందే డిప్యూటీ సీఎం అవుతారనే చర్చ ఊపందుకుంది. శ్రీకాంత్ శిందే ప్రస్తుతం లోక్‌సభ ఎంపీగా ఉన్నారు. శ్రీకాంత్ శిందేను డిప్యూటీ ముఖ్యమంత్రిని చేస్తే ఏక్‌నాథ్ శిందే ఏ బాధ్యత తీసుకుంటారనేది ఉత్కంఠ రేపుతోంది.

ఈవీఎంల ట్యాంపరింగ్ అసాధ్యం: ఈసీ

న్యూఢిల్లీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) మరోసారి స్పష్టం చేసింది. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదని పేర్కొంది. ఈవీఎంను హ్యాక్.. ట్యాంపరింగ్ చేయగలనంటూ ఓ వ్యక్తి చెబుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని, దీనిపై కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించింది. ఇటీవల మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈవీఎంలను హ్యాక్ చేయడం గురించి చెప్పినట్లు తెలుస్తోందని స్పష్టంచేసింది. నిందితుడిని సయ్యద్ షుజాగా గుర్తించామని, ఇతడిపై మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈవో) ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముంబై సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించింది. 2019లోనూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు షుజాపై ఢిల్లీలోనూ కేసు నమోదైనట్లు ఈసీ గుర్తుచేసింది.

పోలవరం గడువుపై గడబిడ!

- 2027 డిసెంబరుకే పూర్తి చేయాలని జల వనరుల శాఖ పట్టు
- 2028 మే నాటికి అవుతుందంటున్న మేఘా
- ప్రాజెక్టులపై రేపు సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంపై రాష్ట్ర జల వనరుల శాఖ పెట్టిన గడువుకు, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ చెబుతున్న టైమ్‌లైన్‌కు భారీ తేడా కనిపిస్తోంది. వచ్చే నెలలో డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభించి.. 700 మీటర్ల మేర పనులు పూర్తి చేస్తూనే.. 2025 నవంబరు నుంచి ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం పనులను సమాంతరంగా మొదలుపెట్టాలని.. 2027 డిసెంబరు నాటికి దాని పనులు పూర్తి చేయాలని.. అంతటితో ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని జల వనరుల శాఖ నిర్దేశించింది. అయితే మేఘా వాదన వేరే విధంగా ఉంది. వచ్చే నెలలో డయాఫ్రం వాల్ పనులు, 2025 నవంబరు నుంచి ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనులు ప్రారంభించినా.. గ్యాప్-2 పనులను చేపట్టేందుకు సమయం తీసుకుంటుందని కాంట్రాక్టు సంస్థ లిఖితపూర్వకంగా ఆ శాఖకు అందజేసింది. ఈసీఆర్‌ఎఫ్ డ్యాం పనుల పూర్తికి 2028 మే దాకా గడువు కావాలని స్పష్టంచేసింది. ఈ వాదనతో జలవనరుల శాఖ ఏకీభవించడం లేదు. ఇందుకోసం ప్రత్యేకంగా మెథడాలజీని కూడా సిద్ధం చేసింది. ఈ మెథడాలజీతో మేఘా సమ్మతించడం లేదు. గ్యాప్-2 పనులు పూర్తి చేశాక.. వాటి నాణ్యతను కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), అంతర్జాతీయ నిపుణులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయాల్సి ఉందని అంటోంది. ఇందుకోసం టెస్టులు నిర్వహించి.. వాటి రిపోర్టులను జల సంఘానికి, నిపుణుల బృందానికి సమర్పించాల్సి ఉందని.. ఈ పనులపై కేంద్రం సంతృప్తి వ్యక్తం చేశాకే గ్యాప్-2 వద్ద ఈసీఆర్‌ఎఫ్ పనులు కొనసాగించాల్సి ఉంటుందని చెబుతోంది. అందువల్ల 2028 మే నెలలోనే ఈసీఆర్‌ఎఫ్ పనులు పూర్తవుతాయని స్పష్టం చేస్తోంది. ఈ పరిణామం నేపథ్యంలో సీఎం చంద్రబాబు మంగళవారం ఈ ప్రాజెక్టుపై సమీక్షించనున్నారు. ఇంకోవైపు.. పోలవరం ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా తెరచిన ఖాతాలో.. కేంద్రం ఇచ్చిన రూ.2,300 కోట్లలో రూ.300 కోట్లను మాత్రమే రాష్ట్ర ఆర్థిక శాఖ జమ చేసింది. మిగతా రూ.2 వేల కోట్లను కూడా జమ చేస్తేనే.. భూసేకరణ కోసం వ్యయం చేసేందుకు వీలుంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

సీమలో రెండో రాజధాని పెట్టాలి

- మాజీ మంత్రి శైలజానాథ్ డిమాండ్

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఏర్పాటు చేస్తున్న హైకోర్టును అమరావతికి తీసుకెళ్లి, ఇక్కడ బెంచ్ ఏర్పాటు చేస్తామని చెప్పడం సరికాదని, రాయలసీమలో రెండో రాజధాని ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. అనంతపురంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కర్నూలు నుంచి హైకోర్టును అమరావతికి తరలించి, బెంచ్ ఏర్పాటుకు తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. కడప కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించారన్నారు. కడపలో ఉంటే ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు.

మిర్చి మేత రూ.347 కోట్లు!

- జీరో, కట్ బిజినెస్‌తో యార్డు ఆదాయానికి గండి
- ఈ-నామ్‌లో నమోదు చేయకుండానే అమ్మకాలు
- లైసెన్సుల రెన్యువల్‌లోనూ భారీగా అవినీతి
- అక్రమార్కులకు వత్తాసు పలికిన అధికారులు
- విజిలెన్స్ నుంచి ప్రభుత్వానికి అందిన నివేదిక
- అందులో గుంటూరు మిర్చి యార్డు మాజీ చైర్మన్ పేరు
- 20 మంది సిబ్బందిపైనా అభియోగాలు నమోదు


గుంటూరు మిర్చి యార్డు

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

గుంటూరు మిర్చి యార్డు అక్రమాలు, కుంభకోణాలకు కేంద్రంగా మారింది. రైతుల సేవలో తరించాల్సిన యార్డు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు నేతలకు కాసులు కురిపించే కల్పవృక్షంగా మారింది. పాలకవర్గం, అధికారులు, సిబ్బంది కుమ్మక్కై రూ.కోట్లు స్వాహా చేశారు. మిర్చి ఎగుమతుల్లో ఆసియాలోనే మొదటి స్థానంలో నిలిచిన ఈ మిర్చి యార్డు.. అక్రమాల్లోనూ టాప్‌లో ఉందని విచారణలో తేలింది. ఇక్కడ గత ఐదేళ్లలో రూ.347 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు నిర్ధారిస్తూ విజిలెన్స్ విభాగం ఇటీవల ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. మిర్చి యార్డుకు తీసుకువచ్చే పంట వివరాలను ఈ-నామ్‌లో నమోదు చేసిన తర్వాత అమ్మకాలు జరపాలి. అయితే గత ఐదేళ్లలో ఈ-నామ్, ఈ-పోర్టల్‌తో పనిలేకుండానే అమ్మకాలు సాగించారు. రైతులు తీసుకొచ్చిన మిర్చిని రికార్డుల్లో ఎక్కించకుండా జీరో వ్యాపారం చేశారు. ఈ విధంగా కొన్ని లక్షల క్వింటాళ్ల మిర్చి అమ్మకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకుండా అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ పెద్దఎత్తున ఆదాయానికి గండి కొట్టారు. కొన్ని సందర్భాల్లో ఈ-నామ్‌లో మిర్చి ధరను తక్కువగా నమోదు చేసి ఆదాయాన్ని పక్కదారి పట్టించారు. కట్ బిజినెస్ పేరుతో సాగిన ఈ వ్యవహారంతో యార్డుకు రావాల్సిన ఫీజుకు నష్టం వాటిల్లింది.

లైసెన్స్ ఒకరిది.. వ్యాపారం మరొకరిది

సాధారణంగా లైసెన్స్ ఉన్న వ్యక్తి రైతుల నుంచి 2శాతం కమీషన్ వసూలు చేయాలి. ఒకరి పేరుతో లైసెన్స్ ఉండి, మరొకరు వ్యాపారం చేసి 4 శాతం నుంచి 5 శాతం కమీషన్ వసూలు చేశారు. ఒకే ఇంట్లో ఐదారుగురికి లైసెన్స్‌లు మంజూరు చేశారు. దానివల్ల ప్రభుత్వానికి వ్యాపారులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నుకు గండి పడింది. ఉదాహరణకు ఒక రైతు రూ.కోటి వరకు వ్యాపారం చేస్తే ఆదాయపు పన్ను చెల్లించాలి. అంతే మొత్తం వ్యాపారాన్ని ఐదుగురు చేసినట్లు చూపితే పన్ను మినహాయింపు ఉంటుంది. ఈ వెసులుబాటును ఉపయోగించుకొని ఒకే ఇంట్లో పలువురికి లైసెన్స్‌లు మంజూరు చేయడంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. రాజకీయంగా పెద్ద కుటుంబాలకు చెందిన వ్యక్తులకు ఈ పద్ధతిలో లైసెన్స్‌లు ఇచ్చినట్లు విజిలెన్స్ గుర్తించింది. లైసెన్స్ రెన్యువల్‌కు ముగ్గురు సభ్యుల కమిటీ సిఫారసును పరిగణనలోకి తీసుకోవాలి. మార్కెటింగ్ శాఖ అనుమతి కూడా ఉండాలి. గత ఐదేళ్లలో అవేమీ లేకుండానే రెన్యువల్ ప్రక్రియ జరిగింది. అందుకోసం భారీగా లంచాలు పుచ్చుకున్నట్లు విజిలెన్స్ నిర్ధారించింది. వైసీపీ నేతల ఆదేశాలతో మార్కెటింగ్ ఉన్నతాధికారి, యార్డు కార్యదర్శులుగా పనిచేసిన ప్రభుత్వ సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. యార్డు చైర్మన్‌గా కొద్ది నెలల పాటు మాత్రమే ఉన్న ఒక నాయకుడు అక్రమాలకు గేట్లు ఎత్తినట్లు గుర్తించారు. లైసెన్స్ రెన్యువల్ అక్రమాలు కూడా అప్పుడే జరిగాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఆ మాజీ చైర్మన్ పేరును నేరుగా ప్రస్తావించారు.

అధికారులకూ పాత్ర

మిర్చి యార్డులో జరిగిన కుంభకోణంలో అధికారులు కూడా కీలక పాత్ర పోషించినట్లు విజిలెన్స్ నివేదిక పేర్కొంది. మార్కెటింగ్‌లో కీలక స్థానాల్లో ఉన్న అధికారులతో పాటు, యార్డు సెక్రటరీలుగా పనిచేసిన వారిపైనా అభియోగాలు మోపారు. సుమారు 20మంది సిబ్బంది పేర్లు నివేదికలో ప్రస్తావించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ల హాజరుతో పనిలేకుండా, కనీసం సంతకాలు కూడా లేకుండా వారు పనిచేస్తున్నట్లు చూపించి జీతాలు విత్‌డ్రా చేశారు. యార్డు నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా జీతం తీసుకుంటున్న ఒక వ్యక్తి ఎన్నికల సమయంలో టీడీపీ నేతలపై విషప్రచారం చేసినట్లు తేలింది. ఈ విషయం అప్పట్లోనే జాయింట్ కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన్ను ఉద్యోగం నుంచి తొలగించారు.

స్టాండింగ్ కౌన్సిల్ విఫలం

ఆసియాలోనే అతి పెద్దదిగా పేరొందిన గుంటూరు మిర్చి యార్డుకు సంబంధించిన లీగల్ విషయాల్లో అడుగడుగునా నిర్లక్ష్యం ఉన్నట్లు విజిలెన్స్ గుర్తించింది. యార్డు కార్యకలాపాలు, నిర్ణయాలకు వ్యతిరేకంగా కోర్టుకు వెళ్లిన వారిని న్యాయపరంగా నిలువరించే విషయంలో స్టాండింగ్ కౌన్సిల్ విఫలమైనట్లు గుర్తించారు. ఈ విషయంలో కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చూపించారని నివేదికలో పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం నుంచి ముంబయికి విమాన సేవలు


మధురపూడి ఎయిర్‌పోర్ట్ నుంచి ఇండిగో ఎయిర్‌బస్ సర్వీసును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యేలు బుచ్చయ్యచౌదరి, వాసు, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ వెంకటరమణ

రాజమహేంద్రవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి ముంబయికి ఆదివారం నుంచి ఇండిగో ఎయిర్ బస్ సేవలు ప్రారంభమైనట్టు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కోరుకొండ మండలం మధురపూడి ఎయిర్‌పోర్ట్‌లో ఇండిగో ఎయిర్ బస్ సర్వీసును ఆయన ఆదివారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికుల సౌకర్యార్థం సర్వీసును ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

తిరుపతి నుంచి కూడా..

రేణిగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం నుంచి ముంబయి నగరానికి నేరుగా విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ముంబయి నుంచి ఆదివారం ఉదయం 5.20 గంటలకు బయలుదేరిన ఇండిగో విమానం 7.20 గంటలకు చేరుకోవాల్సి ఉండగా, రెండు గంటలు ఆలస్యంగా 9.55 గంటలకు చేరుకుంది. తర్వాత 10.30 గంటలకు తిరుగు ప్రయాణమైంది.


శ్రీశైలంలో స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుదీరిన భక్తులు

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో కార్తీకమాసోత్సవాలు ఘనంగా ముగిశాయి. కార్తీక అమావాస్య కావడంతో ఆదివారం క్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో క్షేత్ర పురవీధులన్నీ భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తులు వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి అలంకరణ దర్శనం కల్పించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర వీధి ప్రాంగణం, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు జరిపారు. సాయంత్రం స్వామివారికి పల్లకీ ఉత్సవం, ఆకాశదీపం కార్యక్రమాలను నిర్వహించారు.

శ్రీవారి దర్శనానికి నేడు 'స్థానిక' టోకెన్ల జారీ

తిరుమల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి)స్థానికులకు శ్రీవారి దర్శనానికి సంబంధించి టీటీడీ సోమవారం టోకెన్లు జారీ చేయనుంది. గతంలో ప్రతినెలా మొదటి మంగళవారం ఉన్న స్థానికుల దర్శనాన్ని తిరిగి ప్రారంభించాలని ఇటీవల టీటీడీ ధర్మకర్తల మండలి తీర్మానం చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో డిసెంబరు 3వ తేదీన స్థానికులకు ఉచిత దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే తిరుమలలో 500, తిరుపతిలో 2,500 టోకెన్లు జారీ చేయాలని టీటీడీ ప్రణాళికలు సిద్ధం చేసింది. తిరుపతి అర్బన్, రూరల్ మండలాలతో పాటు చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన వారికి, తిరుమల వాసులకు మాత్రమే ఈ టోకెన్లు జారీ చేస్తారు.

అన్నదానంతో అన్నపూర్ణేశ్వరుడి సేవ: జస్టిస్ ఉమాదేవి


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ ఉమాదేవి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అన్నదానం చేయడం ద్వారా అన్నపూర్ణేశ్వరుడి సేవ చేసినట్లేనని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉమాదేవి పేర్కొన్నారు. కార్తీక అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద సాయిట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు, వారి బంధువులకు అన్నదానం చేశారు. జస్టిస్ ఉమాదేవి మాట్లాడుతూ... నిరుపేదల ఆకలి తీర్చడమే నిజమైన సేవ అని పేర్కొన్నారు. అన్నదానం ద్వారా ఎంతో ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. అనేక సంవత్సరాలుగా సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఎంతోమంది పేదల ఆకలి తీరుస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం శిశుగృహలో నవజాత శిశువుల కోసం జస్టిస్ ఉమాదేవి చేతులమీదుగా లాక్టోజిన్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, బాలసదన్ మేనేజర్ దీప్తి, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ పాల్గొన్నారు.

రాజకీయ ప్రసంగాల నిషేధాన్ని స్వాగతిస్తున్నాం: లక్ష్మణ్

తిరుమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రాజకీయ ప్రసంగాలను నిషేధిస్తూ టీటీడీ బోర్డు తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలంగాణ బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. తిరుమల శ్రీవారిని అయన ఆదివారం ఉదయం బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మణ్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల చాలా పవిత్రమైన పుణ్యక్షేత్రమని, ఇక్కడ రాజకీయాలకు తావు లేదన్నారు. ఇటీవల ఏర్పడిన టీటీడీ బోర్డు సనాతన ధర్మానికి లోబడి తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నామన్నారు. భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇకపై తిరుమలలో రీల్స్ ఫొటోషూట్ చేస్తే వారి కెమెరాలు, ఇతర సామగ్రిని సీజ్ చేయడంతో పాటు వారు తిరిగి దర్శనానికి రాకుండా చేసేలా వచ్చే బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణపై పార్లమెంటులో గళమెత్తుతా

- బీఎస్పీ జాతీయ కో-ఆర్డినేటర్, ఎంపీ రాంజీ గౌతమ్
- కూర్మన్నపాలెంలో పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా


మహాధర్నాలో మాట్లాడుతున్న బీఎస్పీ ఎంపీ రాంజీ గౌతమ్

కూర్మన్నపాలెం (విశాఖపట్నం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్రం నిర్ణయం తీసుకోవడం దారుణమని, ఈ అంశాన్ని బీఎస్పీ ఇంటింటి ఉద్యమంగా మారుస్తుందని ఆ పార్టీ జాతీయ కో ఆర్డినేటర్, ఎంపీ రాంజీ గౌతమ్ అన్నారు. విశాఖ నగరంలోని కూర్మన్నపాలెంలో ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆదివారం నిర్వహించిన మహాధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కూడలిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై పార్లమెంటులో గళం విప్పుతానని హామీ ఇచ్చారు. విభజనవాదాన్ని పెంచి పోషిస్తూ, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి 23 ప్రభుత్వ సంస్థలను, విశాఖ ఉక్కు పరిశ్రమను నిస్సిగ్గుగా అమ్మకానికి పెట్టిన బీజేపీకి నూకలు చెల్లే సమయం ఆసన్నమయిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అదానీలకు వెళ్లిపోతే పేద, బడుగు, బహుజనులకు కొలువులు, జీవనాధారం ఉండవన్నారు. సొంత గనులను కేటాయిస్తే విశాఖ ఉక్కు లాభాల్లోకి వస్తుందని అభిప్రాయపడ్డారు.

దక్షిణాదిన పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలి

- ప్రధాని, మంత్రికి వైసీపీ ఎంపీ గురుమూర్తి లేఖ

న్యూఢిల్లీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో తీవ్రమైన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో దక్షిణాదిలోనూ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఈమేరకు ప్రధాని నరేంద్ర మోదీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజులకు ఆయన లేఖ రాశారు. ఢిల్లీలోని వాతారవణం వల్ల ఎంపీల పనితీరుపై ప్రభావం పడుతుందన్నారు. దక్షిణాదిన పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం వల్ల జాతీయ సమగ్రత మరింత పెరుగుతుందన్నారు. ఈ విషయమై 1968లో స్వతంత్ర ఎంపీ ప్రకాశ్‌వీర్ శాస్త్రి ప్రైవేట్ మెంబర్ బిల్లు కూడా పెట్టారని ఆ లేఖలో గుర్తు చేశారు.

ఐ మిస్ యూ తమ్ముడూ!

- టీడీపీ కార్యకర్త శ్రీను ఆత్మహత్యపై లోకేశ్ ట్వీట్

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్త శ్రీను ఆత్మహత్యపై మంత్రి నారా లోకేశ్ బాధాతప్త హృదయంతో స్పందించారు. 'నీకు కష్టం వస్తే ఈ అన్నకు ఒక్క మాటైనా చెప్పాలనిపించలేదా? చాలా పెద్ద తప్పు చేశావు తమ్ముడు.. ఐ మిస్ యూ తమ్ముడూ' అంటూ ఆదివారం ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని, శ్రీను స్థానంలో కొడుకు బాధ్యతలు తీసుకుంటానని పేర్కొన్నారు. అప్పులైనా, అనారోగ్యమైనా, ఇతర కుటుంబ సమస్యలైనా.. దేనికైనా ఒక పరిష్కారం అనేది ఉంటుందని, ఎవరూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. 'అన్నా.. అన్నా అంటూ పిలిచేవాడివి. ఎవరికి కష్టం వచ్చినా సాయం చేయాలని మెసేజ్ చేసేవాడివి. నా పుట్టిన రోజు, పెళ్లి రోజును పండుగలా జరిపేవాడివి. నీకు కష్టం వస్తే ఈ అన్నకు ఒక్క మెసేజ్ చేయాలనిపించలేదా? దిద్దలేని చాలా పెద్ద తప్పు చేశావు తమ్ముడు.. ఐ మిస్ యూ' అని లోకేశ్ ట్వీట్ చేశారు. 'ఆత్మాభిమానం ఉండొచ్చు! ఆత్మహత్య చేసుకునేంతగా కాదు. నిన్ను బతికించుకునేందుకు చేయని ప్రయత్నం లేదు. సారీ శ్రీను.. నీకున్న కష్టమేంటో నాకు ఎప్పుడూ చెప్పలేదు. నీకు కలిగిన నష్టమేంటో ఏ రోజూ నాకు తెలియలేదు. నువ్వు లేవు కానీ, నీ కుటుంబానికి నేనున్నాను. మీ అన్నగా ఆ కుటుంబానికి అండగా ఉంటూ నీ బాధ్యతల్ని నెరవేరుస్తాను. టీడీపీ కార్యకర్తలు, నా అభిమానులు, సోషల్ మీడియా యాక్టివిస్టులకు నా విన్నపం.. అప్పులో, అనారోగ్యమో, ఆత్మాభిమానమో, కుటుంబ సమస్యలో ఏదైనా కానివ్వండి.. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులు, పార్టీలో హితులు ఎవరితోనైనా పంచుకోండి. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుంది. బతికి ఉందాం.. మరి కొందరిని బతికించుకుందాం.. దయచేసి ఇలాంటి తప్పుడు నిర్ణయాలు ఎవరూ తీసుకోవద్దు' అని పేర్కొన్నారు.

జగన్‌పై ఏసీబీ విచారణ చేపట్టాలి: యనమల

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు ఒప్పందాలు వంటి ఇతర అంశాలను టచ్ చేయకుండా ప్రజా డిమాండ్ మేరకు జగన్ చేసిన రూ.1,750 కోట్ల అవినీతిపై ఏసీబీ విచారణకు ఆదేశించడం సముచితమని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో ఏసీబీ విచారణ చట్టపరంగా సాధ్యమవుతుందన్నారు. విద్యుత్తు కొనుగోళ్ల కుంభకోణంలో జగన్‌కు రూ.1,750 కోట్లు ముట్టాయని ఎఫ్‌బీఐ నివేదిక స్పష్టం చేస్తుంటే.. ఆయన ఈనాడు, ఆంధ్రజ్యోతిలను నిందించడం అర్థరహితమన్నారు. జగన్ పాల్పడిన ఆర్థిక నేరం ప్రపంచవ్యాప్తంగా ప్రచురితమైందన్నారు. ఎఫ్‌బీఐతో పాటు అంతర్జాతీయ పత్రికలపై ఆయన ఎందుకు దావా వేయలేకపోయారని ప్రశ్నించారు. జగన్ కుంభకోణాన్ని ఒక్క సాక్షి మీడియా తప్ప జాతీయ, అంతర్జాతీయ మీడియాతో పాటు లండన్ ఎకనమిస్ట్ వంటి ఆంగ్ల పత్రికలు కూడా ప్రచురించాయని యనమల తెలిపారు. ప్రపంచం గుర్తించిన అవినీతి నేరాన్ని జగన్ మాత్రమే ఖండిస్తున్నారని యనమల ఎద్దేవా చేశారు.

కేసులకు భయపడి ఆర్జీవీ పారిపోయాడు: బుద్దా



విజయవాడ వన్‌టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ప్రభుత్వ సహకారంతో ఆర్జీవీ ఇష్టం వచ్చినట్టు వాగాడు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ను కించపరిచేలా సినిమాలు తీశాడు. తన ట్విట్టర్‌లో మార్ఫింగ్ ఫొటోలు పెట్టి పైశాచిక ఆనందం పొందాడు. ఇప్పుడు కేసులకు భయపడి ఎక్కడో దాక్కున్నాడు. దమ్ముంటే బయటికొచ్చి నిలబడాలి. తాను చేసింది కరెక్టేనని చెప్పుకోవాలి' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. విజయవాడ వన్‌టౌన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాటి వర్మ తీసిన సినిమాలకు సెన్సార్ సర్టిఫికెట్ ఇస్తే ఇప్పుడు కేసులేమిటని జ్ఞానం లేకుండా జగన్ మాట్లాడుతున్నాడని, సినిమాల గురించి అతడు మాట్లాడటం ఏమిటని విమర్శించారు. తల్లీకూతుళ్లను వదిలేసిన వర్మ, తల్లి, చెల్లిని బయటకు పంపిన జగన్ వెనకేసుకురావటం సిగ్గుచేటన్నారు. వ్యూహం సినిమా తీసిన నిర్మాతను టీటీడీ బోర్డు సభ్యుడిగా జగన్ నియమించాడని, చంద్రబాబును కించపరిచేందుకే చెత్త సినిమాలను వర్మతో తీయించాడని విమర్శించారు. జగన్ వ్యవహారం తెలిసి ఆ పార్టీని వీడేందుకు చాలామంది కీలక నేతలు సిద్ధంగా ఉన్నారన్నారు. వారంతా కూటమి పార్టీల వైపు చూస్తున్నారని, వైసీపీ పూర్తిగా ఖాళీ అవుతుందన్నారు. అమెరికాలోనూ ఏపీ పరువును జగన్ తీసేశాడన్నారు. ఆర్జీవీ పెట్టిన పోస్టులు తాడేపల్లి ప్యాలెస్ నుంచే వచ్చాయన్నారు. వర్మకు దమ్ముంటే తానే స్వయంగా పోస్టులు పెట్టానని చెప్పాలని సవాల్ విసిరారు. వైసీపీ నేతల్లా కేసులకు భయపడి పారిపోయే వ్యక్తులు టీడీపీలో లేరని, ఐదేళ్లపాటు అరాచకాలను ఎదుర్కొని ధైర్యంగా ఎన్నో పోరాటాలు చేశామన్నారు. చంద్రబాబు కోసం తాము ప్రాణాలిచ్చేందుకయినా సిద్ధంగా ఉంటామని వెంకన్న అన్నారు.

అక్కపైనే కన్నేశాడు.. ఒప్పుకోలేదని ఆమె కొడుకును చంపేశాడు

- బాలుడి హత్యకేసులో మేనమామ అరెస్టు
- స్కూల్ నుంచి కిడ్నాప్ చేసి హత్య
- చేతులు వెనక్కి కట్టి.. కత్తితో గొంతు కోసి పైశాచికం
- కేసును ఛేదించిన 'శ్రీసత్యసాయి' పోలీసులు



బాలుడి హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం మరవపల్లికి చెందిన 8వ తరగతి చదువుతున్న చేతన్(13) హత్య కేసును పోలీసులు ఛేదించారు. బాలుడికి వరుసకు మేనమామ అయ్యే అశోక్ హత్య చేసినట్లు తేల్చారు. అశోక్‌తోపాటు అతడి ప్రియురాలు నాగలక్ష్మమ్మను అరెస్టు చేశారు. జిల్లా కేంద్రం పుట్టపర్తి డీపీలో ఆదివారం ఎస్పీ రత్న ఈ కేసు వివరాలను వెల్లడించారు. మరవపల్లికి చెందిన పుష్పవతి కుమారుడు చేతన్ మడకశిర మండలం ఆమిదాలగొంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఆమెకు వరుసకు సోదరుడైన అశోక్ పుష్పవతిపై కన్నేశాడు. ఆమె తిరస్కరించడంతో పగ పెంచుకున్నాడు. చేతన్‌ను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. చేతన్ హత్యకు సహకరిస్తే రూ.2 లక్షలు ఇస్తానని తన ప్రియురాలు నాగలక్ష్మికి చెప్పాడు. గతనెల 28న అశోక్ తన ద్విచక్ర వాహనంపై మడకశిరకు వెళ్లి సంతలో కత్తి, టైన్‌పురి కొన్నాడు. తర్వాత చేతన్ చదువుతున్న స్కూల్‌కు వెళ్లి జీపు బొమ్మ కొనిస్తానని నమ్మబలికి చేతన్‌ను బైక్‌పై ఎక్కించుకున్నాడు. ఆమిదాలగొందిలో ఉన్న నాగలక్ష్మమ్మతో కలిసి హులిబెట్ట తండా కొండదగ్గర్లోని బీడు భూముల్లోకి వెళ్లారు. అక్కడ చేతన్ రెండు చేతులు కట్టేసి, కత్తితో గొంతుకోసి, చంపేశారు. నిందితుల కోసం పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటుచేశారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో మడకశిర పట్టణ పరిధిలోని వడ్డపాల్యం బైపాస్ వద్ద అశోక్, నాగలక్ష్మమ్మను అరెస్టు చేసినట్లు ఎస్పీ వివరించారు.

ఆధిపత్య పోరుతోనే హాసిని హత్య

- చంపేందుకు రూ.20 లక్షల సుపారీ
- ట్రాన్స్‌జెండర్ల మధ్య పాత కక్షలు
- 12 మంది నిందితుల అరెస్టు.. పరారీలో ముగ్గురు
- వివరాలు వెల్లడించిన నెల్లూరు ఎస్పీ కృష్ణకాంత్


మీడియాకు కేసు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆధిపత్య పోరు, పాత కక్షల నేపథ్యంలోనే హిజ్రాల సంఘం నాయకురాలు మానికల హాసిని హత్య జరిగిందని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పేర్కొన్నారు. ఈ కేసులో 15మంది నిందితులను గుర్తించామని, వారిలో 12మందిని అరెస్టు చేశామని తెలిపారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్ల నాయకురాలు అలేఖ్య, మరికొందరు ఆధిపత్య పోరులో భాగంగా హాసినిపై పగ పెంచుకున్నారని పేర్కొన్నారు. వారి మధ్య గతంలోనూ విభేదాలు, గొడవలు ఉన్నాయని, ఈ క్రమంలో చింతల భూపతి, సురేంద్ర అనే రౌడీషీటర్లకు రూ.20 లక్షల సుపారీ ఇచ్చి హత్య చేయించారని తెలిపారు. నవంబరు 26 రాత్రి విడవలూరు మండలం పార్లపల్లిలో మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న హాసినిని.. టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిందితులు అడ్డుకొని, విచక్షణారహితంగా కత్తులతో పొడిచి హత్య చేశారని చెప్పారు. పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, సాంకేతికత సాయంతో నిందితులను గుర్తించారని తెలిపారు. కోవూరు అండర్ బ్రిడ్జి వద్ద రెండు కార్లలో వెళ్తున్న 12 మందిని అరెస్ట్ చేశామని తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించి, నిందితులను అరెస్ట్ చేసిన సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ అభినందించారు.

ముగ్గురు వైద్యుల దుర్మరణం

- అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు
- అనంత జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- అందరూ బళ్లారికి చెందినవారే


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

విడపనకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ముగ్గురు వైద్యులు దుర్మరణం చెందారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండల కేంద్రం సమీపాన జరిగిందీ ప్రమాదం. కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి చెందిన కంటి వైద్య నిపుణుడు గోవిందరాజు(52), క్యాన్సర్ వైద్య నిపుణుడు యోగేశ్(54), ఆయుర్వేద వైద్యుడు అమర గౌడ్, రాయల్ సిటీ ఆస్పత్రి మేనేజర్, వైద్యుడు వెంకటనాయుడు(53) థాయిలాండ్ పర్యటన ముగించుకుని శనివారం రాత్రి బెంగళూరు విమానాశ్రయంలో దిగారు. అక్కడి నుంచి కారులో బళ్లారికి బయల్దేరారు. విడపనకల్లు సమీపంలో సిద్ధార్థ పెట్రోల్ బంకు వద్ద కారు అదుపు తప్పి చెట్టును బలంగా ఢీకొట్టి నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదం జరిగిన వెంటనే ఐ-ఫోన్ జీపీఎస్ ద్వారా యోగేశ్ కుటుంబ సభ్యులకు తెల్లవారుజామున 3.25 గంటలకు సమాచారం వెళ్లింది. దీంతో వారు విడపనకల్లుకు చేరుకుని ప్రమాద స్థలాన్ని గుర్తించే ప్రయత్నం చేశారు. చెట్టును ఢీకొన్న అనంతరం కారు ఎగిరి పక్కనే ఉన్న జొన్న చేనులోకి ఒరిగిపోగా, దానిపై చెట్టు కొమ్మ విరిగిపడింది. దీంతో కుటుంబసభ్యులకు తొలుత కారు జాడ కనిపించలేదు. అనంతరం గ్రామస్థుల సాయంతో కాసేపటికి కారును గుర్తించారు. కారులో ఇరుక్కుపోయిన గోవిందరాజు, యోగేశ్, వెంకటనాయుడు మృతదేహాలను పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన అమరగౌడ్‌ను బళ్లారిలోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించారు. విడపనకల్లు పోలీసులు విచారణ చేపట్టారు.

"ప్రక్రియ కంటే కవిత్వగుణం ముఖ్యం!"

– సన్నిధానం నరసింహశర్మ

కవిగా, రచయితగా, విమర్శకునిగా, పరిశోధక సేవకునిగా, రాజమండ్రి గౌతమీ గ్రంథాలయం గ్రంథభాండారిగా, ఆత్మీయ స్నేహపరిమళాల్ని పంచిన గంధహృదయునిగా వైవిధ్య పాత్రల సమ్మేళనంతో సన్నిధానం నరసింహశర్మ గారి జీవనప్రస్థానం సాగుతోంది.

పశ్చిమ గోదావరి జిల్లా కుమారదేవంలో 1945 డిసెంబర్ 7న ఆయన జన్మించారు. గౌతమీ గ్రంథాలయంలో నాలుగు దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారు. లెక్కకుమిక్కిలి పరిశోధకులకు గ్రంథాలయ సేవలు అందించారు. 'అతడె గౌతమి, గౌతమి అతడు' అని అద్దేపల్లి రామ్మోహనరావు గారు ప్రస్తుతించేంతగా ఆయన ఆ లైబ్రరీతో మమేకమయ్యారు.

సన్నిధానం 'ప్రాణహిత', 'బ్రౌను ఉదాహరణం' కావ్యాల కర్త. 'పాతూరి నాగభూషణం జీవిత చరిత్ర', మధునాపంతుల సత్య నారాయణ శాస్త్రిపై 'మధుస్మృతి', కేంద్ర సాహిత్య అకాడమీ భార తీయ సాహిత్య నిర్మాతలు పరంపరలో 'నేదునూరి గంగాధరం' మోనోగ్రాఫ్ రాశారు. 'ప్రమేయ ఝురి' ఆయన సాహిత్య వ్యాస సంపుటి. ఆరుద్ర, చలసాని ప్రసాద్ తనకి రాసిన లేఖల్ని పుస్తకాలుగా ప్రచురించారు. తెలుగు భాషలో అచ్చు అయిన మొదటి గ్రంథం 'నూరు జ్ఞానవచనాలు' (1747) పునర్ముద్రిం చారు. 'కాశ్మీర్ కీ లోక్ కథాయే', 'పంజాబ్ కీ లోక్ కథాయే', 'నల దమయంతి' హిందీ గ్రంథాలను తెలుగులోకి అనువదించారు.

వాడ్రేవు చినవీరభద్రుడు గారు ఒకచోట రాసినట్టుగా ఆయన 'ఎందరో మహాకవుల పద్యాలకు పల్లకిగా జీవిస్తున్న మనిషి.' పండిత శ్రేణికి ఆధునిక కవులకి వారధి వంటి సన్నిధానం ఈ ఏడాది డిసెంబర్ ఏడున ఎనభయ్యో సంవత్సరంలో అడుగిడ నున్నారు. ఆ సందర్భంగా ఆయనతో సంభాషణ.


ఇంటర్వ్యూ ■ నామాడి శ్రీధర్, ఒమ్మి రమేష్ బాబు

సాహిత్యంతో మీకు ఏ వయస్సులో స్నేహం కుదిరింది? అది ఎలా వర్ధిల్లుతోంది?

నా 17వ ఏట అంటే 1962లో దేశభక్తి కవిత్వంగా కొన్ని కంద పద్యాల్ని రాశాను. కేవల పద్యనిర్మాణ సౌందర్యం నుండి నూతన భావభవనంలో ప్రవేశించడానికి కొంత కాలం పట్టింది. పద్యాలు కాక పద్య కవిత్వాలు రాయాలని తెలిసింది. క్రమంగా ఓ వైపు పత్రికల్లో వ్యాసాలు, మరో వైపు పుస్తక రచన సాగాయి. తొలి నాళ్ళలో శ్రీశ్రీ, సి.నా.రె ప్రభావం పడింది. నేదునూరి గంగాధరం, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి, మల్లంపల్లి శరభయ్య ప్రోత్స హించారు. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, జయధీర్ తిరుమలరావు, సతీష్ చందర్‌ల స్నేహ పరిమళాలు ఆఘ్రాణించాను. పరిశోధక వ్యాసాలు రాయడంతోపాటు పరిశోధక సమాచార సేవలు చేయడం, గౌతమీ జ్ఞాన ప్రవాహవేగంలో నిత్యం పునీత మయ్యాను.

రాజమండ్రి సాహిత్య వాతావరణం ప్రత్యేకతలు ఏమిటి?

విభిన్న సాహిత్యాభిప్రాయాలు, భావవైవిధ్యాలూ ఉన్నప్పటికీ ఒక సహజీవన వాతావరణం కొనసాగడం గొప్ప స్థాయి గల అంశం. వైయక్తిక శత్రుత్వం లేకుండా భాషా సాహి త్యాల భావతీవ్రతలు, చర్చలూ ఉండడం రాజమండ్రి ప్రత్యేకత. సాహిత్య విషయాల గురించి సీరియస్‌గా పట్టించుకుని కోర్టులకి వెళ్ళడం మామూలు సంగతి కాదు. సాహిత్య ఆలోచనా వైవిధ్యాలు మానవ విరోధాలు కాకపోవడం ఎంతో ఆహ్వానించదగ్గ విషయం!



ప్రాచీన సాహిత్యం, ఆధునిక సాహిత్యం ఈ విభాగాలపై మీ ప్రాధాన్యాలు, అభిప్రాయాలు ఎటువంటివి?

ప్రాచీన సాహిత్యం అది ఉద్భవించిన నాటికి ఆధునిక సాహిత్యం; ఆధునిక సాహిత్యం అది వచ్చిన తర్వాత కాలానికి ప్రాచీన సాహిత్యం. ఇవి కాల సంబంధి తాలైనప్పుడు రెండిటికీ సమ ప్రాధాన్యం ఇవ్వాలి. కిటికీలు తెరచుకునే ఉండాలి. అన్నిటినీ అధ్యయనం చేసి మన సంపద ఇంతటిదా అని గర్వించగలగాలి.

పద్య కవిత్వం, వచన కవిత్వం – ఈ ప్రక్రియలపై మీకు నిర్దిష్టమైన అభిప్రా యాలు ఏమైనా ఉన్నాయా?

ఫలానా ప్రక్రియ నాదే అని కానీ మాదే అని కానీ అనుకోవడం సరైనది కాదు. ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క ప్రక్రియా ప్రావీణ్యం ఉంటుంది. కాలాన్ని బట్టి, చదువుల్ని బట్టి కొన్ని ప్రక్రియలు సన్నిహితం అవుతాయి. అయితే నేడున్నది వచన కవితాయుగం అనడానికి సందేహం లేదు. సాహిత్య ప్రక్రియా స్వాతంత్ర్యం రచయితల జన్మహక్కుల్లాంటివి.

పండిత శ్రేణికి ఆధునిక కవులకి పొసగని కాలంలో మీరు ఇరుపక్షాలు మెచ్చే వారధి ఎలా అయ్యారు?

పద్యమంటే ఆధునిక కవులకి గిట్టదు. వచన కవిత్వమంటే పండిత శ్రేణికి పొసగదు. పద్యానికి వేయి ఏళ్ళ చరిత్ర ఉంది. వచన కవిత్వం కొన్ని ఏళ్ళ లోనే చరిత్ర సృష్టించుకుంది. ఆధునిక కవులు కాలానుగుణంగా, భావానుగుణంగా ప్రక్రియల్ని ఉప యోగించుకున్నారు. నిజానికి ప్రక్రియల మధ్య వైరం లేదు. పద్యం చచ్చిపోవాలని కోరుకోకూడదు. ఈ కాలానికి, ఈ చదువులకి, ఈ వర్తమాన భావజాలాలకూ పద్యం ప్రక్రియ సరిపోదని భావించేవారిని తప్పుపట్టకూడదు. ప్రక్రియను ఎన్నుకోవడం కవి స్వాతంత్ర్యానికి సంబంధించిన అంశం. అనుభూతి, నూతన భావన, వర్ణన, వ్యక్తీకరణలో కొత్తదనం తదితర కవిత్వగుణాల వల్ల కవిత్వాలు బతికి బట్టకడతాయి కాని ప్రక్రియల వల్లనే బతకవు. నా నవ్య భావావిష్కరణ ప్రయత్నాల వల్లనే ఇరుపక్షాలకీ వారధి అయ్యాను.

గౌతమీ గ్రంథాలయానికి వచ్చిన పరిశోధకుల్లో ప్రసిద్ధులు ఎవరు, వారి పరిశోధనా వైశిష్ట్యాల గురించి చెప్పండి?

సి.నా.రె మాకందాలు రాసే ముందు కొక్కొండ వారి బిల్వేశ్వరీయం జిరాక్స్ ప్రతిని నా ద్వారా తెప్పించుకుని చదివారు. కె.వి.ఆర్ పత్రికారంగంలో వివిధ కులాల పత్రికల్ని

> "ఫలానా ప్రక్రియ నాదే అని కానీ మాదే అని కానీ అనుకోవడం సరైనది కాదు. ఒక్కొక్కళ్ళకీ ఒక్కొక్క ప్రక్రియా ప్రావీణ్యం ఉంటుంది. కాలాన్ని బట్టి, చదువుల్ని బట్టి కొన్ని ప్రక్రియలు సన్నిహితం అవుతాయి. అయితే నేడున్నది వచన కవితాయుగం అనడానికి సందేహం లేదు. సాహిత్య ప్రక్రియా స్వాతంత్ర్యం రచయితల జన్మహక్కుల్లాంటివి."

అధ్యయనం చేశారు. ఆరుద్ర గౌతమీ గ్రంథాలయంలోని పాత పత్రికల్లో మరెక్కడా లేనివేమిటో చెప్పారు. బంగోరె ప్రాచీన గ్రంథాల ముఖపత్రాల పరిణామాల్ని తెలిపారు. దుమ్ము పట్టిన ఇరుకు గదిలో ఫ్యాన్ లేక ఊపిరి సలపని వాతావరణంలో చలసాని ప్రసాద్ చొక్కా తీసి ఒక బీరువా కొక్కెంకి పెట్టి శరీరంపై చెమటలు కమ్మిన అసౌకర్యంలో నేలమీద కూర్చుని పాత పత్రికల్లో శ్రీశ్రీని, కొడవటిగంటిని శోధించుకునే దృశ్యం మరచిపోలేనిది. జయధీర్ తిరుమలరావు తెలుగులో నిషేధ సాహిత్యంపై గొప్ప పరిశోధన చేశారు. జర్మనీ కొలోన్ విశ్వవిద్యాలయం నుండి మరియా మీస్ అనే పరిశోధకురాలు వచ్చారు. భారతీయ గ్రామీణ మహిళల మీద, పాలకొల్లు లేసు పరిశ్రమ మీద ఆమె పరిశోధన చేశారు.

గ్రంథాలయోద్యమం అనేది నిరంతరం సాగే ఉద్యమం కదా! ఇప్పటి పరిస్థితులు ఎలా ఉన్నాయి?

ప్రభుత్వ గ్రంథాలయాలు; గ్రంథాలయ సంస్థల శాఖా గ్రంథాలయాలు; కళాశాల, విశ్వవిద్యాలయ గ్రంథాలయాలు; ప్రయివేటు గ్రంథాలయాలు ఉన్నాయి. అయితే వీటి మధ్య సమన్వయం, ఇచ్చిపుచ్చుకోవడాలు, ధన సహాయాలు, గ్రాంట్లు విషయంలో చురుకైన పాత్ర వహించవలసిన పౌర గ్రంథాలయాల శాఖ ఆర్థికంగా సంపన్నం కానిదే నిరాశా అంశాలు మిగులుతూనే ఉంటాయి.

జానపద సాహిత్య వికాసంలో నేదునూరి గంగాధరం కృషి ఎటువంటిది?

నేదునూరి జానపద సాహిత్య సేవలు అనుపమానాలు. నేను ఆయన శిష్యుణ్ణి. అయిదారు సంవత్సరాలు ఆయనతో గడిపే మహాభాగ్యం నాకు లభించింది. కేంద్ర సాహిత్య అకాడమీ కోసం ఆయన మోనోగ్రాఫ్ రాశాను. గంగాధరం కాలంలో అంతా పద్య వాతావరణం. జానపద గేయాలను లొల్లాయి పదాలుగా తక్కువ పరచిన వారి ధోరణులతో విభేదించకుండానే తన జానపద సాహిత్య ఉద్ధరణ కార్యక్రమం కొనసాగించారు. వందల జానపద గేయాలను బాణీలతో పాడేవారు. ప్రాచీన కవుల పద్యాలనేకం కంఠస్థం చేశారు. అరసంలో గంగాధరం సభ్యులన్నది చాలామందికి తెలియదు. ఆయన జానపదాలను తొలిసారిగా ప్రకటించినది తెలంగాణా వారే.

'వెలుతురు పిట్టలు' కవి కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, మీరూ జంట కవుల్లా ఉండేవారు. ఆయన జ్ఞాపకాల్ని పంచుకోండి!

నిజానికి ఆయన పరిచయం నాకు ఏర్పడడం నా జీవితంలో కొత్త అధ్యాయమే. ఇద్దరం 'వాగర్థ సమాఖ్య' అనే సంస్థ పెట్టాం. సి.నా.రె, వేల్చేరు నారాయణరావు, బూదరాజు రాధాకృష్ణ ఇలా కొంతమంది ప్రముఖ కవి, పండిత, విమర్శకులతో సాహిత్య సభలు నిర్వహించాం. మైకులో సాహిత్య సభా ప్రచారం చేసేవాళ్ళం, వాల్ పోస్టర్లు వేసేవాళ్ళం కూడా. నేను నా 'ప్రాణహిత' కవితా సంపుటిని సత్యశ్రీమన్నారాయణకి అంకితం ఇచ్చాను. ఆయనతో నా అనుభవాలు రాస్తే ఓ పుస్తకమే అవుతుంది.

కొత్త తరం విద్యార్థులకి పూర్వ గ్రంథాల పట్ల మక్కువ కలిగించడానికి ఏదైనా ఉపాయం చెప్పండి!

పాఠ్య పుస్తకాల్లో పూర్వగ్రంథాల అవగాహనా పాఠాలు చేర్చాలి. ప్రాకృతిక వర్ణనలు, ప్రాచీన సంస్కృతిని వెల్లడించే పూర్వ కవిత్వాలు చిన్న చిన్న భాగాలుగా ఉండేటట్లు చూడాలి. ■

బొమ్మలు: అక్బర్

'అసిపె' పరిచయ సభ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో వనపట్ల సుబ్బయ్య దీర్ఘకావ్యం 'అసిపె' పరిచయ సభ డిసెంబర్ 3 మధ్యాహ్నం 2గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షత పి. వహీద్ ఖాన్, అతిథులు గోరటి వెంకన్న, జూలూరు గౌరిశంకర్, గుంటూరు లక్ష్మీ నరసయ్య, ఎస్. రఘు, యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, సీతారాం, కోట్ల వెంకటేశ్వర రెడ్డి తదితరులు. వివరాలకు: 94927 65358.

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక

దళిత కథ 2023 'కొమ్ము'

జంబూ సాహితి ప్రతి ఏటా వెలువరించే కథా వార్షిక సిరీస్‌లో భాగంగా కొమ్ము దళిత కథ 2023 ఆవిష్కరణ సభ డిసెంబర్ 5న పీజీ సెమినార్ హాల్, కోఠి ఉమెన్స్ కాలేజ్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త సూర్యా ధనంజయ, ముఖ్య అతిథి తిప్పర్తి యాదయ్య, గౌరవ అతిథి సతీష్ చందర్, వక్త కాశీం, అధ్యక్షత సిద్దెంకి యాదగిరి. సభలో జూలూరి గౌరీ శంకర్, కోయి కోటేశ్వర రావు, గడ్డం మోహన్ రావులు పాల్గొంటారు.

జంబూ సాహితీ

కథా ఉత్సవం

నాలుగు కథా సంకలనాల ఆవిష్కరణ ఒకేసారి జరుగుతున్నది. 'దీపావళి ప్రత్యేక కథలు 2024', 'ఈ కాలపు తెలుగు కథ', 'ఆధునిక తెలుగు కథ', 'అపురూప చింతన కథలు' – ఈ కథా సంకలనాల ఆవిష్కరణ సభ 'కథా ఉత్సవం' పేరుతో డిసెంబర్ 7 సాయంత్రం 6 గంటల నుంచి హైదరాబాద్ నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో జరుగుతుంది. వీటి సంపాదకులైన మహమ్మద్ ఖదీర్ బాబు, కుమార్ కూనపరాజు, వెంకట్ సిద్ధారెడ్డి, మహి బెజవాడ, అరిపిరాల సత్యప్రసాద్, అజయ్ ప్రసాద్ ఈ సంకలనాల లోని రచయితల కృషిని వివరిస్తారు.


కుమార్ కూనపరాజు

తెరసం పదేళ్ళ సాహిత్య సభలు

తెలంగాణ రచయితల సంఘం పదేళ్ళ సాహిత్య సభలు డిసెంబర్ 8 ఉ.10.30 నుంచి సా.7.30వరకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతాయి. ప్రారంభ సమావేశంలో నాళేశ్వరం శంకర్, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 'తెలంగాణ అస్తిత్వ సాహిత్యం – వర్తమాన సందర్భం' అంశంపై సాహిత్య సదస్సు ఉంటుంది. పొట్లపల్లి శ్రీనివాస రావు, సి. కాశీం తదితరులు పాల్గొంటారు. సాయంత్రం పలు పుస్తకావిష్కరణలు, కవి సమ్మేళనం ఉంటాయి.

తెలంగాణ రచయితల సంఘం

హరిశ్చంద్రుడి కథాకమామిషు



పురాణాల ప్రకారం హరిశ్చంద్రుడు షట్చక్రవర్తులలో మొదటివాడు. ఈ చక్రవర్తి అస్తిత్వం లోని నిజానిజాలు ఏమైనా అన్ని భారతీయ భాషల్లోనూ హరిశ్చంద్రుని గురించి అనేక కావ్యాలు వచ్చాయి. తెలుగుకు సంబంధించినంత వరకు 15వ శతాబ్దిలో గౌరన రాసిన 'హరిశ్చంద్రోపాఖ్యానము' మొదటిది కాగా, 17వ శతాబ్దిలో రామరాజు భూషణుడు రాసిన 'హరిశ్చంద్ర నలోపాఖ్యానం' అనే కావ్యం రెండవది. ఆధునిక కాలంలో కందుకూరి వీరేశలింగం రాసిన నాటకం 1899లో వచ్చింది. ఒక నాటక కంపెనీ వాళ్లు శంకర కవి రాసిన హరిశ్చంద్రోపాఖ్యానాన్ని నాటకీకరించమని కోరగా కందుకూరి రెండు వారాల్లో నాలుగు అంకాలు పూర్తి చేశారు. కానీ ఎందు చేతనో నాటక కంపెనీవాళ్లు ఆ నాటకాన్ని ప్రదర్శించలేదు. అసమగ్రంగా ఉన్న నాటకాన్ని కాకినాడ లోని మరో నాటక కంపెనీ వారి కోరిక మేరకు వీరేశలింగం పూర్తిచేయగా ఆ ఐదు అంకాల ఆ నాటకాన్ని ప్రదర్శించారు. బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటకం వచ్చే వరకు కందుకూరి రాసిన నాటకమే తెలుగు ప్రాంతాల్లో ప్రదర్శింపబడేది. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర ప్రకారం తెలుగులో వచ్చిన హరిశ్చంద్ర నాటకాలు 26గా గతంలో రికార్డు కాగా, ఈ విషయంలో పరిశోధన చేసిన డా. జ్యోతుల కృష్ణబాబు 50 నాటకాల్ని సేకరించాడు. హరిశ్చంద్ర నాటకంపై ఇంకా వాసా ప్రభావతి, పి.యస్.ఆర్. అప్పారావు కూడా పరిశోధన చేశారు.

"హరిశ్చంద్రుని కథ దాన్ని కల్పించిన నాటి జాతి హృదయానికి ప్రతిబింబం" అని గురజాడ అన్నారు. ఇది కేవలం కల్పిత కథగా గురజాడ భావించారని దీని అర్థం. అలాగే నార్ల వెంకటేశ్వరరావు కూడా 'నరకంలో హరిశ్చంద్రుడు' అనే తన 26 పేజీల నాటకానికి 36 పేజీల పీఠిక రాసి దీన్ని కల్పితగాథగా సశాస్త్రీయంగా నిరూపించే ప్రయత్నం చేశారు.

ఐతరేయ బ్రాహ్మణం, రామాయణం, భారతం, భాగవతం, మార్కండేయ పురాణం, వాయుపురాణం, పద్మపురాణం, శివ పురాణం, దేవీ భాగవతం తదితర పురాణాల్లో హరిశ్చంద్రుని ప్రసక్తి వస్తుంది. ఈ పురాణాల ప్రకారం సత్యహరిశ్చంద్రుడు, అసత్య హరిశ్చంద్రుడు, రాజర్షి హరిశ్చంద్రుడు ముగ్గురు వేర్వేరు హరిశ్చంద్రులు కన్పిస్తారు. ఐతరేయ బ్రాహ్మణంలో ప్రస్తావనకు వచ్చిన హరిశ్చంద్రుడు సత్యవంతుడు కాదు. ఇతనికి వందమంది భార్యలున్నా సంతానం లేదు. నారదుని సలహాపై వరుణ దేవుణ్ణి ప్రార్థించి "నాకొక పుత్రుణ్ణి ప్రసాదిస్తే వాడిని యజ్ఞపశువుగా నీకు సమర్పిస్తానని" సంతానాన్ని పొందుతాడు. కాని వాగ్దానాన్ని నెరవేర్చకుండా వాయిదాలు వేస్తుండటంతో వరుణుడు కోపగించి ఇతనికి 'జలోదర' వ్యాధిని సంక్రమింప చేస్తాడు. చివరకు హరిశ్చంద్రుడి కొడుకు రోహితుడు ఒక బ్రాహ్మణ కుమారుణ్ణి నూరు ఆవులిచ్చి కొనుక్కొని తనకు బదులుగా అతణ్ణి బలి ఇవ్వటానికి పూనుకోగా దేవతలు ప్రత్యక్షమై ఆ బాలుణ్ణి రక్షించి హరిశ్చంద్రుడికి వ్యాధి నుంచి విముక్తి కలిగిస్తారు. హరిశ్చంద్రుని భార్య, కుమారుడి పేర్లలోనూ వివిధ పురాణాల్లో వ్యత్యాసాలున్నాయి. 'శివపురాణం' హరిశ్చంద్రుని భార్య సత్యవతి అని పేర్కొనగా, 'మార్కండేయ పురాణం' శైబ్య అని, గౌరన కావ్యం చంద్రమతి అని పేర్కొన్నాయి. మహాభారతంలో 'ఔసీనరి' అని చెప్పబడింది. వంద మంది భార్యల్లో ఒక్కరి పేరు కూడా ఐతరేయ బ్రాహ్మణం చెప్పలేదు.

> "హరిశ్చంద్రుని కథ దాన్ని కల్పించిన నాటి జాతి హృదయానికి ప్రతిబింబం" అని గురజాడ అన్నారు. ఇది కేవలం కల్పిత కథగా గురజాడ భావించారని దీని అర్థం. అలాగే నార్ల వెంకటేశ్వరరావు కూడా 'నరకంలో హరిశ్చంద్రుడు' అనే తన 26 పేజీల నాటకానికి 36 పేజీల పీఠిక రాసి దీన్ని కల్పిత గాథగా సశాస్త్రీయంగా నిరూపించే ప్రయత్నం చేశారు. ఐతరేయ బ్రాహ్మణం, రామాయణం, భారతం, భాగవతం, మార్కండేయ పురాణం, వాయుపురాణం, పద్మపురాణం, శివ పురాణం, దేవీభాగవతం తదితర పురాణాల్లో హరిశ్చంద్రుని ప్రసక్తి వస్తుంది.

తెలుగులో యక్షగానాలుగా, హరికథలుగా, వచన కావ్యాలుగా కూడా హరిశ్చంద్రుడి కథలు వచ్చాయి. విశ్వనాథ సత్యనారాయణ కూడా 'కావ్య – వేద హరిశ్చంద్ర నాటకములు' అని ఒక పుస్తకం వెలువరించారు.



ఎన్ని నాటకాలున్నా తెలుగునాట బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటకమే ప్రాచుర్యంలో ఉన్నది. అందులోని పద్యాలు ప్రజల నాలికలపై నాట్యమాడాయి. హరిశ్చంద్ర పాత్రధారులుగా బందా కనకలింగేశ్వరరావు, పూవుల సూర్యనారాయణ, చీమకుర్తి నాగేశ్వరరావు లాంటివారు విస్తృతంగా నటించినా అబ్బూరి వరప్రసాద్ అనే నటుడు హరిశ్చంద్రుని పాత్రలోకి వచ్చిన 50వ దశకంలో బలిజేపల్లి వారి పద్యాలతో పాటు గుర్రం జాషువా స్మశాన వాటిక కావ్యం లోని 6 పద్యాల్ని కాటిసీనులో జొప్పించి పాడటం ప్రారంభించాడు. ఆ తర్వాత బందారు రామారావు అనే నటుడు వాటికి అద్భుతమైన బాణీలు సమకూర్చుకుని తెలుగు నాటక రంగంలో హరిశ్చంద్ర నాటకానికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చాడు. "ఇచ్చోటనే సత్కవీంద్రుల కమ్మని కలము..."; "ఆకాశంబున కారుమబ్బులు ఆవరించె"; "ముదురు తమస్సులో మునిగిపోయిన..."; "ఇచట అస్పృశ్యత సంచరించుటకు తావే లేదు"; "ఎన్నో యేళ్లు గతించిపోయినవి గాని ఈ స్మశాన స్థలిన్"; "మొన్న మొన్ననే దేహంబొర్చి" –ఈ ఆరు జాషువా పద్యాలతో బలిజేపల్లివారి హరిశ్చంద్ర నాటకం మరింత సంపద్వంతమైంది.

తన అనుమతి లేకుండా తన కావ్యంలోని పద్యాలు వాడుకుంటున్నాడని కొంత ఆగ్రహం చెందిన జాషువా వినుకొండలో జరిగిన నాటక ప్రదర్శనకు ప్రేక్షకునిగా వెళ్లి బందారు రామారావు పాడిన పద్యాలు విని పరమానందం చెంది వేదికపైకి వెళ్లి "నా పద్యాలకు సార్థకత కల్పించావు. వాటిని నీ ఇష్టం వచ్చినట్లు వాడుకో" అని చెప్పాడట. బందారు రామారావు తర్వాతి కాలంలో హరిశ్చంద్ర పాత్రధారిగా వచ్చిన డి.వి. సుబ్బారావు ఈ పద్యాల బాణీని మరింత మెరుగు పరచటమేగాక ఆనాటికి ఉచ్ఛస్థితిలో ఉన్న తిరుపతి వెంకటకవుల పాండవోద్యోగ విజయాన్ని సైతం వెనక్కునెట్టి హరిశ్చంద్ర నాటకాన్ని ప్రథమ స్థానంలోకి తెచ్చాడు. డి.వి. సుబ్బారావు తర్వాత అతని మనుమడు జూనియర్ డి.వి. సుబ్బారావు కూడా ప్రస్తుతం ఆ పాత్రలో రాణిస్తున్నాడు. ఇంకా మారంరెడ్డి సుబ్బారెడ్డి, బందారు రవి కుమార్, సైదులు, చల్లా వెంకటేశ్వర్లు తదితర నటులు హరిశ్చంద్ర పాత్రలు ధరిస్తున్నారు. హరిశ్చంద్ర పాత్రధారి శ్రీకాకుళానికి చెందిన మంగాదేవిని ప్రత్యేకంగా పేర్కొనాలి. స్త్రీ పాత్రల్ని పురుషులు ధరించటం చాలాసార్లు జరిగినా ఒక స్త్రీ హరిశ్చంద్ర పాత్ర ధరించటంతోపాటు ఖ్యాతినొందిన పురుష పాత్రధారుల కన్నా మిన్నగా పేరుపొందుతున్నది.

■ చెరుకూరి సత్యనారాయణ

సారవంతం

ముత్తైమంత సేపైనా
కరిగిపోతున్న ఆ దృశ్యాలని అల్లుకోని
ఒలికిపోని భయాన్ని
దిగులాట్లో ఆరిపోయిన దీపం కింద దాచిపెట్టి
కొంచమైనా సారవంతమవుతాను

నక్షత్రాల వెలుతురు పదను అంటని దోసిళ్ళు
కన్నీటి శబ్దం వినని శ్రవణాలు
నిరంతరం జీవధారను వెక్కిరిస్తూనే ఉంటాయి
ఐనా చూపులను ఒడిసిపట్టుకుని
మరో రూపంలోకి నడిచిపోవాలి
ఈ మట్టి రోజొక కొత్త నిర్వచనం ఇస్తూనే ఉంటుంది

గతాలు చూర చూరైన ఆకుల శబ్దమై
పలుకరిస్తాయి
మెత్తటి పూలలాంటి సన్నివేశాలు
కేవలం నిద్రలోనే మెలుకువతో కదులుతాయి

దుఃఖంతో ఒంటికాలి నడక ఎత్తుగడ్డ కొసకే
నీడలు మనిషి ఆలోచనలను
అపసవ్య దిశలోకి మలపనంతవరకే

ఒక్కొక్క దేహపు వాసనలు కరిగిపోతూ
నడిచే తొవ్వల మీది ముళ్లను సవరిస్తాయి
సంకేతాలను అర్థం చేసుకోవడమే జీవితం

■ వేముగంటి మురళి
93922 56475


మెచ్చుకున్నాడో, తిట్టాడో అర్థం కాలేదు!

నా మొదటి పుస్తకం

■ కొండేపూడి నిర్మల



నా మొదటి కవితా సంకలనం సందిగ్ధ సంధ్య 1988లో వచ్చింది. అందులో 15 కవితలున్నాయి. 'ఒక్క నేనే ఇన్ని ముక్కలు', 'హలోలు', 'ముల్లు' లాంటి కవితలు జనం లోకి బాగా వెళ్ళాయి. 'ఈ సంప్రదాయం మాకొద్దు' అనే కవితకి తాపీ ధర్మారావు అవార్డు వచ్చింది. అయినా కానీ సంకలనం వేసే ఆలోచన, చొరవా నాకు రాలేదు. "పుస్తకం వెయ్యాల్సిందే" అన్న ప్రతిపాదన తెచ్చింది పోసుగోటి కృష్ణారెడ్డి. ప్రచురణ బాధ్యత కూడా అతనే తీసుకున్నాడు. ఆరోజు అతను పట్టుబట్టి వుండకపోతే నాకున్న సంశయాలకి, బద్ధకానికి మొదటి పుస్తకం ఎన్నాళ్ళకి వచ్చేదో తెలియదు. సరే, పుస్తకం పేరు మొదట 'అల' అని అనుకున్నాం. "బాలేదు మరీ ఫ్లాట్‌గా వుంది" అన్నాడు అఫ్సర్. ముందుమాట ఎవరు రాయాలి అని ఆలోచన వచ్చేసరికి వేగుంట మోహన ప్రసాద్ గుర్తొచ్చారు. ఒక మిట్ట మధ్యాహ్నం ఎండలో వాళ్ళింటికి వెళ్ళి, పుస్తకం చేతిలో పెట్టి వచ్చేస్తుంటే, "ఆగమ్మా, ఆ ఫేన్ కింద కూచో? కవిత్వానికి అంత చెమట పడితే ఎలా" అని మందలించి కూచో పెట్టారు.



మొహమాటంగా కూచున్నాను. పుస్తకంలో కొన్ని పేజీలు తిరగేసి, "ఓహో, బాగా రాస్తున్నావు కంటిన్యూ చెయ్యి" అనగానే అంత పెద్ద కవి మెచ్చుకున్నాడన్న సంతోషమో కంగారో ఏమిటో గాని చేతిలో నీళ్ళ గ్లాసు ఒలికిపోయింది. "సారీ సారీ సారీ" అంటూ తల వెనక్కి తిప్పకుండా వచ్చేశాను. వారం రోజుల కల్లా 'మో' ఒక పెద్ద వ్యాసం అధివాస్తవిక ధోరణిలో రాశారు. "ఈయన తిడుతున్నారో, మెచ్చుకున్నారో చెప్పవా?" అని కొంత మందిని అడిగాను. "దటీజ్ మో" అన్నారు అందరూ. తిరువూరులో ఉన్న నేను పుస్తకం పని కోసం హైదరాబాద్ వచ్చినప్పుడల్లా ఆంధ్ర జ్యోతిలో కలిసే వాళ్ళం. కృష్ణారెడ్డి, అఫ్సర్, నేను, ఘంటసాల నిర్మల కలిసి ప్రూఫ్ రీడింగ్ చేశాం.

కవర్ పేజీ కోసం చేతికి దొరికిన ఒక సముద్రం బొమ్మ సెలక్ట్ చేశాం. సముద్రం మీద వున్న సంధ్య ఉదయం అయితే బావుంటుందా సాయంత్రం అయితే బావుంటుందా అని మళ్ళీ సందేహం. చివరికి 'సందిగ్ధ సంధ్య' అని పెట్టేసాను. విజయవాడ బస్టాండ్ దగ్గర మమతా హోటల్‌లో ఆవిష్కరణ. సభకి పిలవడానికి పురాణం సుబ్రహ్మణ్య శర్మ దగ్గరికి వెడితే ఆయన ఎడాపెడా మెచ్చుకుని తను మాట్లాడతానని ప్రకటించారు. సభలో నండూరి సుబ్బారావు, పురాణం, పన్నాల సుబ్రహ్మణ్యం, తుర్లపాటి కుటుంబరావు గార్లు మాట్లాడారు.

తర్వాత ఒకసారి ఏదో సభలో మో గారు కనిపించి "ఆ పుస్తకం పేరు భలే పెట్టావే, కవిత్వం కంటే నీకే బాగా మ్యాచవుతుంది" అన్నారు. అది కూడా పొగడ్తా తెగడ్తా అనేది అర్థం కాలేదు. మొత్తానికి ఆ చిన్న పుస్తకం చాలా గుర్తింపు తెచ్చిపెట్టింది. దాని స్ఫూర్తితో రెండేళ్లలోనే 'నడిచే గాయాలు' వేశాను.



ఆంధ్రజ్యోతి పరిశీలన

- విజయవాడను ఆనుకుని ఉన్న పెనమలూరు, గన్నవరం మండలాలను 70 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం కేంద్రంగా కృష్ణాజిల్లాలో కలిపారు.
- గన్నవరంలో ఉన్న విజయవాడ విమానాశ్రయాన్ని కృష్ణాజిల్లాలోకి తీసుకెళ్లడంతో విజయవాడ దగ్గరగా ఉన్నప్పటికీ.. 80 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం నుంచి అధికారులే ఇక్కడికి వచ్చి ప్రొటోకాల్ విధులు నిర్వర్తిస్తున్నారు.
- విజయవాడ, మచిలీపట్నానికి దగ్గరగా ఉన్న నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో ఏకం చేశారు. ఇప్పటికీ వారి పరిధి ఎక్కడో తెలియక ఈ రెండు ప్రాంతాల ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

ఈ ఉదాహరణలన్నీ మచ్చుకు కొన్నే. ఉమ్మడి కృష్ణాజిల్లా స్వరూపాన్ని మార్చేసేలా గత వైసీపీ ప్రభుత్వం జరిపిన పునర్విభజన అటు అధికార యంత్రాంగం, ఇటు ప్రజానీకాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. దగ్గరలో ఉన్న ప్రాంతాలను దూరంగా, గజిబిజిగా మార్చి విభజనను ఓ విధ్వంసంగా మార్చారు. ప్రజలు, రాజకీయ పక్షాల అభ్యంతరాలు, భౌగోళిక పరిస్థితులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండానే కృష్ణాజిల్లాను ముక్కలు చేశారు. నాటి సీఎం జగన్ నిర్వాకం వల్ల ఏ ప్రాంతం ఎటువైపో తెలియని అనిశ్చితి ఇప్పటికీ కొనసాగుతోంది.



అటో.. ఇటో.. ఎటో..!

కృష్ణాకు ప్రభుత్వ ఆఫీసులే లేని దీనావస్థ

- సబ్ కలెక్టరేట్‌లోనే ఎన్టీఆర్ కలెక్టరేట్ సర్దుబాటు
- గన్నవరం ఎయిర్‌పోర్టుపై అంతా గందరగోళం
- విజయవాడకు దగ్గర, మచిలీపట్నం నుంచి విధులు
- 'ఎన్టీఆర్'కు దగ్గరలోని పెనమలూరు, గన్నవరం 'కృష్ణా'లోకి..
- నూజివీడు, కైకలూరు కూడా ఏలూరు జిల్లాలోకి..
- విజయవాడ రూరల్ మండలం గ్రామాలు ఎటువైపో..

జిల్లాల విభజన గజిబిజి గందరగోళం

- వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో తొలగని అవస్థలు
- రెండున్నరేళ్లయినా పరిష్కారం కాని సమస్యలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం/విజయవాడ : గతంలో 16 అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉమ్మడిగా ఉన్న కృష్ణాజిల్లాను.. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలుగా విభజించారు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో విలీనం చేసి.. కృష్ణాకు 7, ఎన్టీఆర్‌కు 7 అసెంబ్లీ నియోజకవర్గాలు చేశారు. మచిలీపట్నం, విజయవాడను పార్లమెంట్ స్థానాలుగా యథావిధిగా ఉంచారు.

తక్కువ కేడర్ అధికారులే..

ఈ రెండున్నర జిల్లాల్లో ఉద్యోగుల బదిలీలు, ఇతరత్రా అంశాలకు సంబంధించి కృష్ణా కలెక్టరే పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఉద్యోగుల బదిలీలు, ఇతరత్రా పరిపాలనా పరమైన అంశాలకు సంబంధించి ఎన్టీఆర్, ఏలూరు మిగతా 6లో..

సబ్‌కలెక్టర్ ఆఫీసులోనే ఇరుక్కుని...



- నాలుగైదు శాఖలకే ఈ భవనం
- మిగిలినవన్నీ సింగ్‌నగర్‌లో అద్దె గృహాల్లో
- సబ్‌కలెక్టరేట్ వెనుక ఖాళీ స్థలంలో
- జీ ప్లస్ 7 నిర్మిస్తేనే సమస్యకు పరిష్కారం

ఎన్టీఆర్ జిల్లాగా అవతరించినా ఇప్పటి వరకు పూర్తి స్థాయి కలెక్టరేట్ భవనం లేదు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ పనుల కోసం నిధులు మంజూరు చేస్తామని చెప్పిన కిందటి వైసీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేశాక .. పైసా కూడా విడుదల చేయలేదు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌కు నున్న, గొల్లపూడిలలో అప్పటి జిల్లా యంత్రాంగం స్థలాన్వేషణ చేసింది. కలెక్టరేట్ కార్యాలయం తాత్కాలికంగా విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులో నాలుగైదు శాఖలకు మించి కార్యాలయాలు ఏర్పాటు చేయలేని పరిస్థితి నెలకొంది. నున్న, గొల్లపూడిలలో కలెక్టరేట్ కార్యాలయాలను చూసే బదులు.. సబ్ కలెక్టర్ కార్యాలయం వెనుకన ఉన్న ఖాళీ స్థలంలో జీ ప్లస్ 7 భవనం నిర్మిస్తే అన్ని శాఖలకు సరిపోతుందని అప్పట్లో ప్రతిపాదనలు వచ్చినా నగరానికి దూరంగా ఉన్న ప్రాంతాలలో కలెక్టరేట్ కార్యాలయం ఏర్పాటుకు స్థలాన్వేషణ చేయటం విమర్శలకు తావిచ్చింది. ప్రస్తుతం ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో సర్వే అండ్ సెటిల్‌మెంట్, డీఆర్‌ఓ, జేసీ క్యాంపు కార్యాలయం, ప్లానింగ్ విభాగంతో పాటు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్లు మాత్రమే నడుస్తున్నాయి. మిగిలిన జిల్లా స్థాయి కార్యాలయాలన్నీ సింగ్ నగర్‌లో ఎక్కువగా అద్దె భవనాలలో ఏర్పాటు చేశారు. వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, హౌసింగ్, గనులు భూగర్భవనరుల శాఖ వంటి కీలక శాఖలకు సొంత భవనాలు లేవు.

గన్నవరం ఎయిర్‌పోర్టు గందరగోళం

గన్నవరం ప్రాంతాన్ని కృష్ణాజిల్లాలో విలీనం చేయటం వల్ల విజయవాడ విమానాశ్రయం కృష్ణాజిల్లా పరిధిలోకి వెళ్లిపోయింది. వాస్తవానికి ఇది విజయవాడ విమానాశ్రయం. విజయవాడ అంటే ఎన్టీఆర్ జిల్లా. కానీ, విమానాశ్రయం పరిధి కృష్ణాజిల్లాలోకి వస్తుంది. ఇక్కడ ప్రొటోకాల్ విధులు నిర్వహించటానికి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగానికి తేలిగ్గా ఉంటుంది. కానీ, 80 కిలోమీటర్ల దూరంలోని మచిలీపట్నం నుంచి ఉన్నతాధికారులు రావాల్సి వస్తోంది. ఇది దూరాభారం.





యనమలకుదురులో జనసేన నేత కబ్జా చేసేందుకు ప్రయత్నించిన స్థలం

భూమాఫియాపై ఉక్కుపాదం మోపుతామని ఓవైపు ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేస్తుంటే.. మరోవైపు కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. యనమలకుదురులో సుమారు రూ.20 కోట్ల విలువైన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన నాయకుడి ప్రయత్నాలను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అనుచరులు అడ్డుకున్నారు.

కబ్జాకోరలు

యనమలకుదురులో రూ.20 కోట్ల భూమి కబ్జాయత్నం

- సూత్రధారి తూర్పు నియోజకవర్గ జనసేన నేత
- అడ్డుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అనుచరులు
- జనసేన నేతపై గతంలోనూ భూకబ్జా ఆరోపణలు
- విజయవాడలో 4.. గుంటూరులో 3 కేసులు నమోదు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : కానూరుకు చెందిన ముప్పవరపు గణేశ్‌కు యనమలకుదురులోని రీసర్వే నెంబరు 47/5లో సుమారు 71 సెంట్ల భూమి ఉంది. ఈ భూమిని విజయవాడలో ప్రముఖ వస్త్ర దుకాణదారుడైన వేమూలూరి నాగభూషణం (చంటి) 2019లో కొన్నారు. వ్యాపార లావాదేవీల్లో భాగంగా ఇది జరిగింది. సుమారు ఆరేళ్ల తర్వాత ముప్పవరపు గణేశ్ తిరిగి ఆ భూమి తమదేనంటూ స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంతో వివాదం మొదలైంది. భూ వ్యవహారాల్లో తలదూర్చి సెటిల్‌మెంట్లు చేయడంలో ఆరితేరిన జనసేన నాయకుడు ఈ వివాదాన్ని తనకు అనుకూలమైన విధంగా మార్చుకునేందుకు రంగంలోకి దిగాడు. నవంబరు 20వ తేదీ అర్ధరాత్రి యనమలకుదురులోని వివాదాస్పద స్థలంలోకి ప్రవేశించి కంటైనర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు స్తంభాలు పాతారు. సమాచారం తెలిసిన వెంటనే చంటికి చెందిన మనుషులు స్తంభాలను తొలగించడంతో పాటు కంటైనర్‌ను స్థలం నుంచి బయటకు తరలించేశారు. దీంతో జనసేన నేత తన అనుచరులు 20 మందితో అక్కడికి చేరుకుని తిరిగి స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంతో పాటు చంటికి ఫోన్‌చేసి బెదిరించారు. చంటి.. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు సమీప బంధువు కావడంతో ఆయన ద్వారా స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. ఇరువర్గాలు వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లతో వస్తే పరిశీలించి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. చంటి తన వద్ద ఉన్న అన్ని పత్రాలను ఎమ్మెల్యేకు చూపించగా, జనసేన నేత మాత్రం ఎలాంటి పత్రాలను తీసుకురాలేదు. పైగా చంటికి ఫోన్‌చేసి టీడీపీ ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్తే భయపడతామా.. అంటూ బెదిరింపులకు దిగాడు. ఎమ్మెల్యే అనుచరులు రంగప్రవేశం చేసి జనసేన నేత అనుచరులను స్థలం నుంచి పంపేసి, ఏమైనా వివాదాలు ఉంటే కోర్టులో తేల్చుకోవాలని, ఇలా బలవంతంగా భూమిలోకి ప్రవేశించి ఆక్రమించుకోవడం సరికాదని స్పష్టం చేశారు.

భూబాగోతాలు ఎన్నెన్నో..


గతంలోనూ నకిలీ పత్రాలతో భూమిని కబ్జా చేయబోయారంటూ జనసేన నేతపై పలు కేసులు నమోదయ్యాయి. 2021, ఆగస్టులో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అగతవరప్పాడులో సుమారు రూ.10 కోట్ల విలువైన 1.42 ఎకరాల భూమిని నకిలీ దస్తావేజులతో కబ్జా చేసేందుకు ఈయన ప్రయత్నించాడు. ఈ కేసులో అమ్మిశెట్టి వాసుతో పాటు మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కానూరుకు చెందిన లారీ ట్రాన్స్‌పోర్టు యజమానిని మోసం చేసిన ఘటనలోనూ ఈయనపై కేసు నమోదైంది. గవర్నర్‌పేట, సూర్యారావుపేట, భవానీపురం పోలీసుస్టేషన్లలోనూ ఈయనపై నాలుగు కేసులు నమోదు కాగా, రెండు కేసులు ఇంకా కోర్టులో నడుస్తున్నాయి. గుంటూరు జిల్లాలో మూడు కేసులు నమోదు కాగా, ఒక కేసులో శిక్ష పడింది. జనసేన నేత తీరుపై సొంత పార్టీలోనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌తో ఈయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.

పీఎంఏవై 2.0కు లైన్‌క్లియర్

గ్రామీణ గృహాలకు మార్గదర్శకాలు విడుదల

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సొంతస్థలం ఉన్నవారికి గృహయోగం కల్పించేందుకు పీఎంఏవై 2.0 అందుబాటులోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రాష్ట్రానికి కూడా లక్ష్యాన్ని విధించటంతో జిల్లాలస్థాయిలో దరఖాస్తులు స్వీకరించేందుకు హౌసింగ్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం పీఎంఏవై గ్రామీణ కేటగిరీ ఇళ్లకు సంబంధించి మాత్రమే మార్గదర్శకాలు వచ్చాయి. అర్బన్‌కు కూడా త్వర లోనే వచ్చే అవకాశముంది. దరఖాస్తులను ఆహ్వానించేందుకు త్వరలో ప్రకటన విడుదల చేయనున్నారు. ఇంటింటి ప్రచారం కూడా నిర్వహిస్తారు. సొంతస్థలం ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. రేషన్ కార్డు కలిగి ఉండాలి. రేషన్ కార్డు లేనివారు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్టుగా ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఆధార్ కార్డు కాపీ, భార్యాభర్తల బ్యాంకు కాపీలు, ఇంటి పట్టా కాపీ, కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి.

వణికిస్తున్న వాన



ప్రకాశం బ్యారేజ్ వద్ద కమ్ముకున్న నల్లటి మేఘాలు

కృష్ణాజిల్లాలో ఫెంగల్ తుఫాను ప్రభావం

- ఎక్కడికక్కడే నిలిచిపోయిన ధాన్యం నిల్వలు
- మిల్లులకు ధాన్యపు వాహనాల క్యూ
- జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీవర్షం

ముసురుపట్టిన విజయవాడ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఫెంగల్ తుఫాను ప్రభావానికి జిల్లావ్యాప్తంగా వర్షం కురుస్తూనే ఉంది. తుఫాను తీరం దాటడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వరకు తేలికపాటి వర్షాలు కురిశాయి. రైతులు వరికోతలను నిలిపేసి, ధాన్యాన్ని కాపాడుకునే పనిలో పడ్డారు. మచిలీపట్నం, గుడివాడ, కంకిపాడు, తదితర ప్రాంతాల్లో ధాన్యం లోడుతో మిల్లుల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో వ్యాపారులు బస్తా రూ.1,420, రూ.1,400 తగ్గించి కొంటున్నారు.

ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఆదివారం కూడా కృష్ణాజిల్లాను వదల్లేదు. ఉదయం నుంచి కురుస్తున్న మోస్తరు వర్షం రైతులను పరుగులు పెట్టించింది. ఫలితంగా మిల్లుల ముందు ధాన్యపు వాహనాలు బారులు తీరి కనిపించాయి. తుఫాను ప్రభావంతో విజయవాడ ముసురుపట్టగా, ఎన్టీఆర్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది.

పశ్చిమగోదావరి జిల్లాలోని మిల్లులకు ట్యాగింగ్ నిలిపివేత

వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో ఇతర జిల్లాల్లోని మిల్లులకు ధాన్యం విక్రయించుకునేందుకు అధికారులు రైతుసేవా కేంద్రాల ద్వారా ట్యాగింగ్ చేశారు. ఉయ్యూరు డివిజన్‌లోని మండలాల నుంచి పశ్చిమగోదావరి జిల్లాలో మిల్లులకు సంబంధించిన ట్యాగింగ్ ఆదివారం మధ్యాహ్నం నుంచి నిలిచిపోయింది. దీంతో జిల్లాలోని మిల్లుల వద్ద ధాన్యం లోడుతో వాహనాలు నిలిచిపోతున్నాయి. కాగా, మిల్లర్లు చాలావరకు ధాన్యం మిగతా 6లో..



కపిలేశ్వరపురంలో నేలవాలిన వరి

పనిచేయలేను

- కలెక్టర్ ముందు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అసహనం
- ఏఈలు లేకుండా అసాధ్యమని వెల్లడి
- డీఆర్‌సీ సమావేశంలో గోడు వెళ్లబోసుక్కున్నవైనం

ఇతరశాఖల నుంచి భర్తీ చేయిస్తానని కలెక్టర్ హామీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగాన్ని ఏఈల కొరత వేధిస్తోంది. ఉమ్మడి జిల్లా ఎస్ఈ కార్యాలయంలో ఒక్క ఏఈ కూడా లేరు. ఇక సబ్ డివిజన్ల కార్యాలయాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒక్క ఏఈ కూడా లేకపోవటంతో పనులను ఎలా ముందుకు తీసుకెళ్లాలో తెలియక ఉమ్మడి జిల్లా ఎస్ఈ (సూపరింటెండెంట్ ఇంజనీర్) విద్యాసాగర్ తల పట్టుకుంటున్నారు. శనివారం జరిగిన డీఆర్‌సీ సమావేశంలో ఆయన తన ఆవేదనను కలెక్టర్‌కు చెప్పుకొన్నారు. ఒక్క ఏఈ కూడా లేకపోవటం వల్ల తాను పనిచేయలేకపోతున్నానన్నారు. డీఈఈ నుంచి ఈఈ పదోన్నతి పొందిన విద్యాసాగర్ ఎస్ఈ పోస్టుకు కూడా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. భారం ఎక్కువ కావడంతో ఈయన ఏ పనీ చేయలేకపోతున్నారు.


విచ్చలవిడి డిప్యుటేషన్ల వల్లే..

జల్ జీవన్ మిషన్ (జేజేఎం) వంటి కీలకమైన పనులను ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం సిబ్బంది లేకుండా చేయడం కష్టమైన పని. పంచాయతీల్లో కీలకమైన ఈ పనులు.. తగిన సంఖ్యలో ఏఈలు, డీఈఈలు లేకపోతే ముందుకు కదలవు. ఇష్టారాజ్యంగా జరిగే అవకాశం ఉంటుంది. కాగా, ఎస్ఈ గోడు విన్న కలెక్టర్ లక్ష్మీశ.. ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి ఏఈలను రప్పిస్తానని హామీ ఇచ్చారు. అయితే, గొల్లపూడిలోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయంలో అవినీతి కారణంగానే ఈ సమస్య తలెత్తింది. ఇక్కడ ఉద్యోగుల బదిలీలు, డిప్యుటేషన్ల పేరిట భారీగా వసూళ్లు చేస్తున్నారు. సంస్థలో సిబ్బంది తగిన సంఖ్యలో లేరని తెలిసినా.. డిప్యుటేషన్లపై సిబ్బందిని మరో శాఖకు పంపిస్తున్నారు. డిప్యుటేషన్లకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో ఏఈలు, డీఈఈల కొరత పీడిస్తోంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 50 ఏఈ పోస్టులు ఉండగా, జూలై వరకు 30 మంది పనిచేసేవారు. మిగిలిన 20 ఖాళీగా ఉండేవి. ప్రస్తుతం ఖాళీల సంఖ్య 30కు చేరింది.

కొత్త రేషన్‌కార్డులకు నేటి నుంచి లాగిన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సోమవారం నుంచి ఈ ప్రక్రియ మొదలుకానుంది. ఇప్పటి వరకు రేషన్‌కార్డులు లేని అర్హులైన వారితో పాటు ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయిన వారు కూడా అక్కడి కార్డు నుంచి పేర్లు తొలగించుకుని స్ప్లిట్ కార్డులు పొందొచ్చు. వివాహానికి ముందు తల్లిదండ్రుల కార్డులో పేర్లు ఉన్నవారు కూడా ఈ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్ కార్డులో పేర్లు యాడ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నారు. ఆధార్ నెంబర్లు తప్పుగా అనుసంధానమైనా సరిచేసుకోవచ్చు.

• రయ్యిరయ్యిన..



కార్తీకమాసం చివరి ఆదివారం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు కళకళలాడాయి. భవానీద్వీపం వద్ద కృష్ణానదిలో బోటింగ్‌కు సందర్శకులు క్యూ కట్టారు.



దుర్గగుడి 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఆలయ ఈవో రామారావు

కేంద్ర నిధులతో దుర్గగుడి అభివృద్ధి పనులు

» మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి

వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రిజువినేషన్ స్పిర్చ్యువల్ ఆగుమెంటేషన్ డ్రైవ్, తీర్థయాత్ర పునర్జీవనం ఆధ్యాత్మిక వృద్ధి డ్రైవ్) టెంపుల్ స్కీమ్ ఆధ్వర్యంలో దుర్గగుడి అభివృద్ధికి నిధులు విడుదల చేయనున్నట్టు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం మహామండపంలో మాస్టర్ ప్లాన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో గతంలో కొంతపని జరిగినా.. కొన్ని కారణాల వల్ల మధ్యలో ఆగిపోయిందని, మరలా ఇప్పుడు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. టెంపుల్ టూరిజం స్కీమ్‌లో దుర్గామల్లేశ్వర దేవస్థానం కూడా ఉందన్నారు. వీలైనంత ఎక్కువ నిధులు రాబట్టేందుకు ఎంపీ చొరవ తీసుకోవాలన్నారు. క్యూలు, వెయిటింగ్ రూమ్‌లు, కాటేజీలు, తదితరాల గురించి సమావేశంలో చర్చించినట్టు తెలిపారు. భక్తులకు అమ్మవారి దర్శనం సులభతరంపైనా చర్చించామన్నారు. జనవరి చివరినాటికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసి ముఖ్యమంత్రితో సమీక్షించి పూర్తిస్థాయిలో అమలు చేయటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ, దుర్గగుడిలో రద్దీ దృష్ట్యా దీర్ఘకాలం పాటు అమలులో ఉండేవిధంగా భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవదాయ కమిషనర్ సత్యనారాయణ, ఈవో కె.ఎస్.రామారావు, దేవదాయ శాఖ చీఫ్ ఇంజనీర్ జి.వి.ఆర్. శేఖర్, ఈఈలు కె.ఎస్. కోటేశ్వరరావు, పి.వైకుంఠరావు, టూరిజం శాఖ ఈఈ, సాంకేతిక కమిటీ సభ్యుడు పాండురంగారావు, డిఈఈలు, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రి పరిశీలించారు.



ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి కార్తీకమాసం, అమావాస్య ఆదివారం కావటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పలువురు పాల్గొని పూజలు చేశారు. క్యూలలో పరిస్థితిని ఈవో రామారావు, ఇతర అధికారులు పర్యవేక్షించారు. ఆదివారం దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ తదితర సేవలను నిర్వహించారు. పాయకాపురానికి చెందిన జి.రామిరెడ్డి పండ్ల వ్యాపారి జి.రామిరెడ్డి, కుటుంబ సభ్యులతో ఆదివారం అమ్మవారిని దర్శించుకుని, అనంతరం అన్నవితరణ నిమిత్తం రూ.1,00,000ల చెక్కును ఆలయ అధికారులకు అందజేశారు.



నార్ల వెంకటేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, గోళ్ల నారాయణరావు తదితరులు

పాత్రికేయులకు సేవా పురస్కారాలు

విజయవాడ కల్చరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లోక్‌నాయక్ జయప్రకాష్ ఫౌండేషన్ అధ్వర్యంలో ప్రతిభ కలిగిన పాత్రికేయులకు నగదు పురస్కారాలు అందచేయనున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తెలిపారు. సీనియర్ సంపాదకుడు నార్ల వెంకటేశ్వరరావు 118వ జయంతి సందర్భంగా తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్ర ఆవరణలో ఆదివారం నార్ల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 21 సంవత్సరాల క్రితం లోక్‌నాయక్ ఫౌండేషన్ స్థాపించి వివిధ రంగాల్లో లబ్దప్రతిష్టులైన వారికి పురస్కారాలను అందచేస్తున్నామన్నారు. మేధావుల సూచన మేరకు ఇకపై ప్రతిభ కలిగిన పాత్రికేయులను పట్టణ, నగర, గ్రామీణ స్థాయిలో గుర్తించి కమిటీ నిర్ణయం మేరకు రూ.50 వేల చొప్పున నగదు పురస్కారం అందచేయడం జరుగుతుందని నార్ల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపారు. కామ్రేడ్ జీజర్ పోలవరపు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ, పాత్రికేయ పురస్కారాల కమిటీ ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. నార్ల వెంకటేశ్వరరావు గురించి మాట్లాడుతూ, నార్ల స్ఫూర్తివంతమైన జీవితం గడిపారన్నారు. ఆయన పాత్రికేయ సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు, బండ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వినూత్నంగా నాకూ సాధ్యమే

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 'నాకూ సాధ్యమే' కార్యక్రమం చేపడుతున్నట్టు డీఈవో పీవీజే రామారావు తెలిపారు. కలెక్టరు డీకే బాలాజీ ఆధ్వర్యంలో 65 మంది ప్రముఖుల విజయగాధలను పాఠశాలలకు పీడీఎఫ్‌లో పంపుతున్నామన్నారు. ఆంగ్లభాషలోని విజయగాధలను ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్లు జె.నాగేశ్వరరావు, పి.రామసీతాకుమారి, టి.శ్రీనివాస్, బి.వి.పి. శ్రీలలిత, బి.సరళకుమారి, బి.సురేష్‌కుమార్, జిల్లా సైన్స్ ఆఫీసర్ మహమ్మద్ జాకీర్‌హుస్సేన్‌లు అనువదించారన్నారు. ఈ విజయగాధలను సంక్షిప్తంగా ప్రతి పాఠశాలకు అందించామన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఉదయం పూట జరిగే ప్రార్థనా సమావేశంలో సంక్షిప్తంగా ఈ విజయగాధలను ఉపాధ్యాయులు చెప్పాలన్నారు. 'నాకూ సాధ్యమే' పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని డీఈవో సూచించారు.

ఐజీఎంసీలో రాష్ట్ర చౌకీబాల్ సెలక్షన్స్ రేపు

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా చౌకీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 3వ తేదీ సాయంత్రం 3గంటలకు ఏపీ స్టేట్ చౌకీబాల్ జూనియర్ బాలబాలికల ఎంపికలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సుధాకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని ఈనెల 23 నుంచి 25 వరకు హైదరాబాద్‌లో జగరనున్న 15వ జాతీయ జూనియర్స్ చౌకీబాల్ పోటీలకు పంపుతామన్నారు. వివరాలకు 9395530285 నెంబరులో సంప్రదించాలన్నారు.

దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్ రెడ్డి దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో కేఎస్ రామారావు, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అధికారులు అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనానంతరం వారికి వేదపండితులు ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

దేవస్థానం ఆస్థాన సిద్ధాంతిగా చల్లా శ్రీనివాస శర్మ

దుర్గామల్లేశ్వర దేవస్థానానికి ఆస్థాన సిద్ధాంతిగా బాధ్యతలు స్వీకరించిన చల్లా శ్రీనివాస శర్మను ఆదివారం కళావేదికపై ఈవో పరిచయం చేశారు. ఆలయ స్థానాచార్యుడు, ముఖ్య అర్చకులు, అర్చకులు, వేద పండితులు, తదితరులు శ్రీనివాస శర్మను పరిచయం చేసుకున్నారు. 1965లో పల్నాడు జిల్లా, రాజుపాలెం మండలం, నెమలిపురి గ్రామంలో శ్రీనివాస శర్మ జన్మించారు. ఆయన తండ్రి సూర్యనారాయణరావు, తల్లి రాజ్యలక్ష్మి. ఆయనకు ప్రథమ గురువు తండ్రి. స్మార్త విద్యను మార్తి వెంకటరామ శర్మ వద్ద అభ్యసించారు. ఈయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శర్మకు జ్యోతిష్య మార్తాండ, జ్యోతిష్య విశారద, జ్యోతిష్య వాచస్పతి, అంతర్జాతీయ జ్యోతిష్య మహర్షి, దైవజ్ఞరత్న వంటి పలు బిరుదులు ఉన్నాయి. అఖిల భారత బ్రాహ్మణ సంఘం ఆయనకు జ్యోతిష్య విద్వత్‌మణి బిరుదు ఇచ్చింది.



చల్లా శ్రీనివాస శర్మకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ముగిసిన నాణెం!

» చివరి రోజున భారీగా యువత » ప్రదర్శనను తిలకించిన కలెక్టర్ లక్ష్మీశ దంపతులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్)

అమెరికా డాలర్.. అర్జంటైనా పెసో.. ఆస్ట్రియా యూరో.. బ్రెజిల్ రియల్.. చైనా రెన్‌మిన్బీ.. ఇవన్నీ ఆయా దేశాల కరెన్సీ నోట్లు. దేశంలో శాతకర్ణులు పాలన సాగినప్పుడు చలామణి అయిన కరెన్సీ మాసా. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసి చరిత్రలో నిలిచిపోయిన నాణేలు ఐదు పైసలు, పది పైసలు, పావలా, అర్ధరూపాయి. ఇలా ఆసక్తి ఉన్న నాణేన్ని, కరెన్సీ నోటును యువత కొనుగోలు చేశారు. విజయవాడలో మూడురోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ కాయిన్స్ ఎక్స్‌పో ఆదివారం ముగిసింది. ఈ ప్రదర్శనను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ దంపతులు, గుంటూరు మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులు, సీఐడీ ఎస్పీ కడియం చక్రవర్తి, తానా మాజీ అధ్యక్షుడు నిరంజన్ సందర్శించారు. యువత, విద్యార్థులు భారీగా తరలివచ్చారు. కరెన్సీ నోట్లను ఆసక్తిగా కొనుగోలు చేశారు.






పైథాన్‌లకు ప్రత్యేకం

జీవ వైవిధ్యం, జలవనరుల సంరక్షణ కోసం వివిధ దేశాలు అనేక రూపాల్లో నాణేలను ముద్రించాయి. ద్వీపాల సమూహంతో ఉండే నియూ దేశం మాత్రం దట్టమైన అడవుల్లో ఉండే కోబ్రాలు, విషపు పైథాన్‌లతో ప్రత్యేక నాణేలను ముద్రించింది. లోన్‌సమ్ జార్జి అనే పాము ముఖ చిత్రంతో 2015లో త్రీడీ ప్రింటింగ్ కాయిన్‌ను తీసుకొచ్చింది. ఆ తర్వాత సంవత్సరం 2016లో గ్రీన్ ట్రీ పైథాన్ పేరుతో వెండి త్రీడీ నాణేన్ని ముద్రించింది. 700 చొప్పున ఒక్కో నాణేన్ని ముద్రించింది. ఈ రెండు నాణేలను రెండు డాలర్ల విలువతో ముద్రించింది.

'ఈగ' నాణెం

ఈగ.. నిత్యం ఇళ్లలో కనిపించే కీటకం. ఈ పేరు ఏకంగా తెలుగు చిత్రం తెరకెక్కింది. ఇప్పుడు ఈగకు ఒక ప్రత్యేక నాణెం వచ్చింది. నియూ దేశం ఈగ చిత్రంతో వెండి నాణేన్ని 2014లో ముద్రించింది. రెండు డాలర్ల విలువతో 700 నాణేలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇది పూర్తిగా డిజిటల్ ప్రింటింగ్ కాయిన్.



Green Tree Python

కోస్ట్ గార్డు స్టాంప్స్

1977 ఫిబ్రవరి ఒకటో తేదీన నడి సముద్రంలో గూఢచార్య చర్యలను అడ్డుకోవడానికి, సముద్ర స్మగ్లర్లకు చెక్ పెట్టడానికి ఇండియన్ కోస్ట్‌గార్డు పురుడు పోసుకుంది. భారతదేశంలో సముద్ర జలభాగానికి ఇది లా ఎన్‌ఫోర్స్‌మెంట్. మొదట్లో చిన్నగా ఉన్న ఈ సీజీ (కోస్ట్‌గార్డు) ఇప్పుడు దేశంలోని సముద్ర ప్రాంతమంతా విస్తరించింది. దీని గౌరవార్థం కేంద్ర ప్రభుత్వం 2008 ఆగస్టు 12వ తేదీన రూ.5ల స్టాంపును విడుదల చేసింది. ఈవిధంగా రెండు తపాల స్టాంపులను ముద్రించింది. ఒక దానిపై హెలికాప్టర్, మరో స్టాంపుపై కోస్ట్‌గార్డు ఓడ చిత్రాలను ముద్రించింది.



Housefly

లైట్‌హౌస్‌లకు ఒక స్టాంప్

ఒక దేశం తీరం నుంచి మరో దేశానికి సరుకులతో బయలు దేరిన ఓడ గమ్యస్థానానికి చేరుకుందని తెలిపే సంకేతం లైట్‌హౌస్. నౌకాశ్రయాలకు సమీపంలో ఈ లైట్‌హౌస్‌లను నిర్మిస్తారు. రాత్రి సమయాల్లో ప్రయాణించే నౌకలకు తీరం సమీపంలో ఉందని అందులో ఉన్న కెప్టెన్‌కు తెలియజేయడానికి లైట్‌హౌస్ నుంచి ఒక లైట్ చుట్టూ తిరుగుతుంది. ఈ లైట్‌హౌస్‌లకు అమెరికా ఒక స్టాంప్‌ను కేటాయించింది. లైట్‌హౌస్ చిత్రాలతో ఒక్కో స్టాంపును ఇంగ్లండ్ ముద్రించింది.

అంతరిక్ష ఆనవాళ్లు

అంతరిక్ష ప్రయోగాలను ఆదిలోనే అందిపుచ్చుకున్న దేశం అమెరికా. అంతరిక్షంలో వ్యోమగాములు పంపిన దేశం. ప్రపంచంలో అంతరిక్ష ప్రయోగాల్లో అమెరికాది పైచేయి ఉంటుంది. అంతరిక్షంపై చేసిన పరిశోధనలకు సంబంధించి అమెరికా ప్రత్యేక పోస్టల్ స్టాంపును తీసుకొచ్చింది. స్పేస్ డిస్కవరీ పేరుతో ఈ స్టాంపులన ముద్రించింది.



Lonesome George



కలెక్టర్ లక్ష్మీశను సన్మానిస్తున్న పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు

వ్యాయామంతో మంచి క్రమశిక్షణ

» పోలీస్ స్పోర్ట్స్ ముగింపు సభలో కలెక్టర్ లక్ష్మీశ

గుణదల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రతి మనిషి దైనందిన జీవితంలో ఏదైనా వ్యాయామం చేస్తే మంచి క్రమశిక్షణ అలవడుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. నవంబరు 28వ తేదీ నుంచి 30 వరకు మూడు రోజులు నిర్వహించిన పోలీస్ స్పోర్ట్స్ మీట్-2024 ముగింపు కార్యక్రమం సిటి ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ విచ్చేసి విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషి దైనందిన జీవితంలో ఏదైనా వ్యాయామం అలవర్చుకోవాలని చెప్పారు. తద్వారా శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, సిబ్బందిలో ఉత్సాహం పోటీతత్వం పెంపొందించడానికి యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ దోహదపడుతుందని చెప్పారు. రానున్నకాలంలో పోలీస్ వెల్ఫేర్‌పై దృష్టి సారించి సిబ్బందికి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఆర్. ఏసీపీ డి.ప్రసాదరావు, డీసీపీలు గౌతమి షాలి, తిరుమలేశ్వర రెడ్డి, కృష్ణమూర్తి, ఎస్.వి.డి ప్రసాద్, జి.ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు వరద అర్జీలపై బాధ్యతా రాహిత్యం

» తహసీల్దార్‌పై చర్యలకు కలెక్టర్ ఆదేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బుడమేరు వరద సహాయపు అర్జీల విచారణలో బాధ్యతా రాహిత్యం ప్రదర్శించినందుకు విజయవాడ నార్త్ తహసీల్దార్ ఎం.సూర్యారావుపై శాఖపరమైన చర్యలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఆదివారం ఆదేశించారు. బుడమేరు వరదల కారణంగా తాము ముంపునకు గురయ్యామని, ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని విజయవాడ నార్త్ మండలానికి చెందిన 500 మంది ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలను సమర్పించారు. దరఖాస్తు చేసుకున్న అర్జీదారులంతా పరిహారానికి ప్రాథమికంగా అర్హులేనని వారికి తహసీల్దార్ ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. వీటికి సంబంధించి విజయవాడ ఆర్డీవో విచారణలో కొందరు మాత్రమే అర్హులని నిర్ధారణ జరిగింది. అర్హుల నిర్ధారణ విషయంలో సందిగ్ధ పరిస్థితులకు కారణమైన తహసీల్దార్ సూర్యారావుపై శాఖాపరమైనచర్యలకు కలెక్టర్ ఆదేశించారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రణాళికలు

» మంత్రి కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న మంత్రి సారథి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్-2047లో బలహీనవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారని మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. మచిలీపట్నం యాదవ సంఘాల ఆధ్వర్యంలో లలిత కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన సమావేశంలో సారథి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతికుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విజన్-2047 డ్యాకుమెంట్‌ను రూపొందిస్తున్నట్టు సీఎం చెప్పారన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. మంత్రి రవీంద్ర సహకారంతో యాదవ కుటుంబాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. యాదవులు దళితులకు అండగా నిలవాలని, అప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొండి కృష్ణయాదవ్ మాట్లాడుతూ, సబ్సిడీపై పశువులకు బీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. వీర్ల శ్రీరామ్ మాట్లాడుతూ, మచిలీపట్నంలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాన్ని యాదవులకు కేటాయించాలన్నారు. పల్లపాటి వెంకట్రావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, బచ్చుల అనిల్, గొరిపర్తి రాము, నాంచారయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సారథికి భగవద్గీత గ్రంథాన్ని ఇచ్చి సత్కరించారు.



మృతులు చీలి ఏసుబాబు, తల్లి సుధారాణి, భానుప్రకాష్, చింతా రవి, నివాళులర్పిస్తున్న జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

స్నేహితుల మృతితో ఊరంతా విషాదం..

» తరలివచ్చిన బందరు ప్రజలు

» నివాళులర్పించిన నేతలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు రోడ్డు ప్రమాదంలో మృతులకు ఆదివారం ఉయ్యూరు ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మచిలీపట్నం తరలించారు. దీంతో బలరామునిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానిక ప్రజలతో పాటు స్నేహితులు, కలిసిపనిచేసే కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యువకుల మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొడుకు మృతితో ఆగిన తల్లి గుండె..

చీలి ఏసుబాబు (ప్రభు) మృతదేహం పక్కనే అతని తల్లి సుధారాణి మృతదేహాన్ని ఉంచారు. కుమారుడు మృతి వార్త విన్న ఆ తల్లి గుండె ఆగి చనిపోయిన సంగతి తెలిసిందే. తల్లీకొడుకుల మృతితో బంధువుల రోదన ఇంతా అంతా కాదు. ఏసుబాబుకు ఇటీవలే పెళ్లి సంబంధాలు చూస్తున్నారు.

భర్తను కోల్పోయి.. దుఃఖంలో గర్భిణి

మృతుడు చీలి భాను ప్రకాష్ (చింటు)కు భార్య అమల, ఒక కుమార్తె. కాగా ఆమె గర్భవతి. భర్త మృతితో ఆమెను ఓదార్చడం ఎవరి వల్ల కాలేదు.

మందులకోసం వెళ్లిన కొడుకు మృతితో విలవిల్లాడిన తండ్రి హృదయం..

తండ్రికి మందులు తెచ్చేందుకు చింతా రవి(బాబి) స్నేహితులతో కలిసి విజయవాడ వెళ్లాడు. మందులు తేవడానికి వెళ్లిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తండ్రి హృదయం విలవిల్లాడింది. నడవలేని స్థితిలోనూ కుమారుడి అంత్యక్రియలను నిర్వహించాల్సిన పరిస్థితి.



మృతులకు జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎండీ ఇలియాస్ బాషా, చిట్టూరి యువరాజ్, బండారు నాని, ఊకంటి రాంబాబు, రాజులపాటి నాగబాబు, కోళ్ళపల్లి గణేష్, పేర్ని కిట్టు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

అటో.. ఇటో.. ఎటో!

(5వ పేజీ తరువాయి)

జిల్లాల కలెక్టర్లు జాబితాలు లేదా నివేదికలు తయారుచేసి కౌంటర్ సంతకంపెట్టి కృష్ణా కలెక్టర్‌కు పంపాల్సి ఉంది. వీటిని పరిశీలించి కృష్ణా కలెక్టర్ సంతకాలు చేస్తేనే పరిపాలనా ఆమోదం లభిస్తుంది. అలాగే, గతంలో ప్రతి శాఖకూ జిల్లాస్థాయి అధికారులు ఉండేవారు. అనుభవం ఉన్నవారు, వారి పనితీరు, సత్వర నిర్ణయాలు వేగంగా జరిగేవి. ప్రస్తుతం వివిధ శాఖల్లో డివిజన్‌స్థాయి అధికారులే జిల్లాస్థాయి ఇన్‌చార్జులుగా పనిచేస్తున్నారు. ఉదాహరణకు ఆర్‌డబ్ల్యూఎస్ విభాగంలో గతంలో ఎస్‌ఈ స్థాయిలో అధికారి ఉండేవారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ల డీఈలు, ఈఈలు ఆయన పరిధిలో పనిచేసేవారు. గతంలో గుడివాడలో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయాన్ని ఇటీవలే మచిలీపట్నానికి మార్చారు. డీఈస్థాయి అధికారిని ఈఈగా నియమించారు. ఎన్టీఆర్ జిల్లాకు వేరే ఎస్‌ఈ ఉండటంతో మచిలీపట్నంలోని డీఈస్థాయి అధికారి ఈఈగానూ, ఎస్‌ఈగానూ పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీఈ స్థాయిలో ఉన్న అధికారి ఇతర డివిజన్లలో ఉన్న డీఈలకు పరిపాలనాపరమైన ఆదేశాలు జారీచేస్తుంటే, వారు పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. కృష్ణా పంచాయతీ అధికారి (డీపీవో) పోస్టు కృష్ణాజిల్లాలో అధికారికంగా ఉండగా, ఎన్టీఆర్ జిల్లా డీపీవో పోస్టును మార్చేశారు. దీంతో ప్రజలు తికమకకు గురవుతున్నారు. డ్వామాపీడీ, సంక్షేమ శాఖ అధికారుల పోస్టులదీ ఇదే తీరు.

ఈ రెండు నియోజకవర్గాల్లో అయోమయం

నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో కలిపారు. జిల్లా పరిషత్ ఉమ్మడిగానే కొనసాగుతుండటంతో ఈ రెండు నియోజకవర్గాల్లోని శాసనసభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీ సమావేశాలు జరిగే సమయంలో మచిలీపట్నానికి వస్తున్నారు. తమ నియోజకవర్గాల్లోని సమస్యలను చెబితే 'చూద్దాం.. చేద్దాం..' అనే ధోరణితో అధికారులు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన జెడ్పీ సమావేశానికి ఎన్టీఆర్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ఎంపీ హాజరుకాలేదు. నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలకు చెందిన శాసనసభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు గత జెడ్పీ సమావేశాలకు హాజరై, ఇక నుంచి తాము పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ సమావేశాలకు వెళ్తామని చెప్పడం గమనార్హం. కాగా, నూజివీడు నియోజకవర్గాన్ని కృష్ణాజిల్లాలో కలుపుతామని ఎన్నికల ముందు టీడీపీ అధినేత ఇక్కడి ప్రజలకు హామీ కూడా ఇచ్చారు.

పెనమలూరు, గన్నవరానికి దూరాభారం

జిల్లాల పునర్విభజనకు సంబంధించి మొత్తం 2,885 అభ్యంతరాలు వచ్చాయి. జిల్లాల భౌగోళిక మార్పులు, చేర్పులకు సంబంధించి పెనమలూరు, గన్నవరం, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల ప్రజలు, రాజకీయ పక్షాల ఐక్యవేదికల నేతృత్వంలో పెద్ద ఎత్తున అభ్యంతరాలు అందజేశారు. పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో విలీనం చేయాలని, నూజివీడు, కైకలూరు నియోజకవర్గాలను కృష్ణాజిల్లాలో కలపాలన్నదే ప్రధాన డిమాండ్. పెనమలూరు, గన్నవరం మండలాల్లోని గ్రేటర్ గ్రామాలు రాజధాని అమరావతి ప్రాంత పరిధిలోనివి. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, కేసరపల్లిలో ఏస్ అర్బన్-ఏపీఐఐసీ హైటెక్ సిటీ, హెచ్‌సీఎల్ వంటి కంపెనీలు, కొండపావులూరులో ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎన్ఐడీఎం, సీపెట్ వంటి కేంద్ర సంస్థలు, వీరపనేనిగూడెం, మల్లవల్లిలో ఇండస్ట్రియల్ పార్క్, మెగా ఫుడ్‌పార్క్‌లు గన్నవరంలో ఉన్నాయి. పునర్విభజన వల్ల ఇవన్నీ కృష్ణా జిల్లాలోకి వెళ్లిపోయాయి. ఇక పెనమలూరు నియోజకవర్గం విజయవాడకు పక్కనే ఉంటుంది. అయినా 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న బందరుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మధ్యస్థంగా విజయవాడ రూరల్

విజయవాడ రూరల్ మండలం చిత్రమైన పరిస్థితికి నిదర్శనంగా నిలిచింది. ఈ మండలం పరిధిలో 16 గ్రామాలు ఉండగా, ఇవన్నీ ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉన్నాయి. కానీ, రెండు అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో అంతర్భాగంగా మారాయి. గూడవల్లి, నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు, నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాలు గన్నవరం అసెంబ్లీ, మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోకి వస్తాయి. కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షైదూరుపాడు, రాయనపాడు, గొల్లపూడి, రామరాజ్యనగర్, వైఎస్సార్ గ్రామాలు మైలవరం అసెంబ్లీ, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. కానీ, ఇవన్నీ విజయవాడ రూరల్ మండలాలు. విజయవాడ నగరానికి దగ్గరగా ఉన్నవే.

వణికిస్తున్న వాన..

(5వ పేజీ తరువాయి)

కొనుగోలును నిలిపివేశారు.

లక్ష టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ఇప్పటివరకు 26 వేల హెక్టార్లలో వరికోతలు పూర్తిచేశారు. ఇందులో యంత్రాల ద్వారా కోసిన ధాన్యమే అధికం. మూడు, నాలుగు రోజులుగా వర్షం హెచ్చరికలతో రైతులు ధాన్యాన్ని రహదారులపైకి చేర్చారు. జిల్లాలో డ్రయ్యర్ సౌకర్యం ఉన్న 70 మిల్లులకు, ఇతర మిల్లులకు 97 వేల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం ద్వారా పంపారు. ఇతర జిల్లాల్లోని మిల్లులకు 3 వేల టన్నుల ధాన్యాన్ని పంపామన్నది అధికారుల లెక్క.

రాశులుగానే ధాన్యం

జిల్లాలోని అన్ని మండలాల్లో రహదారులపై ధాన్యాన్ని రాశులుగా పోశారు. కొంతమేర సంచుల్లోకి ఎత్తి గుట్టలుగా వేయగా, అదంతా వర్షంలోనే ఉండిపోయింది. పామర్రు, కనుమూరు, అడ్డాడ, పెదమద్దాలి గ్రామాల్లోని 150 టార్పాలిన్లను మాత్రమే రైతులకు అందజేసి అధికారులు చేతులు దులుపుకొన్నారు. పామర్రు, కురుమద్దాలి, జుజ్జువరం తదితర ప్రాంతాల్లో మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై ధాన్యపు రాశులను పరదాలతో కప్పి ఉంచారు.

నేలవాలిన వరి

వరిపైరు కోతకు సిద్ధమైన దశలో మొదళ్లు బలహీనపడతాయి. వర్షం కారణంగా పైరు, కుంకులు తడిచి బరువెక్కితే పైరు నేలవాలుతుంది. బలమైన ఈదురుగాలులు వీస్తే మరింతగా కుంగుతుంది. బంటుమిల్లి మండలంలో ఆదివారం అత్యధిక వర్షపాతం నమోదైంది. బలమైన గాలులకు తోడు వర్షం కురవడంతో మండలంలోని సాతులూరు, కంచడం, బర్రిపాడు తదితర గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలవాలింది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. తుంపర్లతో కూడిన వర్షం కురవడంతో ధాన్యం అధిక సమయం పాటు తడిచి రంగు మారుతుందనే భయం రైతులను వెంటాడుతోంది. అర్తమూరు, మల్లేశ్వరం, పెందుర్రు తదితర గ్రామాల్లో రహదారులపైనే ధాన్యపు రాశులను పరదాలతో కప్పి ఉంచారు. చల్లపల్లి, మండలంలోని పురిటిగడ్డ, లక్ష్మీపురం, పాగోలు, చల్లపల్లి తదితర గ్రామాల్లో వరిపొలాలు నేలవాలాయి. మోపిదేవి మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి వర్షం అధికంగా కురిసింది. పెదప్రోలు, వెంకటాపురం గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల నుంచి సంచులు ఇవ్వకపోవడంతో రైతులు ధాన్యాన్ని విక్రయించుకునే అవకాశమే లేకుండాపోయింది. రైతుసేవా కేంద్రాల వద్ద తీసిన తేమశాతానికి, మిల్లుల వద్ద చూసే తేమశాతానికి మధ్య తేడా ఉండటంతో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు రైతుసేవా కేంద్రాల వద్ద ధాన్యంలో నమోదుచేసిన తేమశాతమే పరిగణనలోకి తీసుకుని ధర నిర్ణయిస్తామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అది అమలు కావడంలేదు. మధ్యవర్తులు నిర్ణయించిన తేమశాతం, మద్దతు ధరే అమలవుతోంది.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

మహాకాళేశ్వరుడికి ప్రత్యేక పూజలు



కృష్ణలంక, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీ మాత ఆలయంలో మహాకాళేశ్వరుడిని ఆదివారం కార్తీక మాసం అమావాస్య సందర్భంగా ప్రత్యేకమైన సుగంధ ద్రవ్యాలతో అలంకరించి, పూజలు చేశారు. 150 మంది దంపతులతో చండీ హోమం, దేవతాపూజ, విశేషంగా అర్చన జరిపారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.పుల్లయ్య, కొప్పురావూరి జగదీష్‌కుమార్ పాల్గొన్నారు.



హైటెన్షన్ తీగల రోడ్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పేదలకు సేవ చేయడమే టీడీపీ సిద్ధాంతం

● 'సభ్యత్వ నమోదు'లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, సమాజానికి, పేదలకు నిస్వార్థంగా సేవ చేయడమే పార్టీ సిద్ధాంతమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. భారతీనగర్ కాలనీ సమీపంలోని హైటెన్షన్ తీగల రోడ్డు, మూడో డివిజన్‌లోని విజయలక్ష్మి కాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదును ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఓ వైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రూ.3 వేల ఫించను 4వేలకు పెంచిందని తెలిపారు. ప్రతి మహిళకు మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తోందని తెలిపారు. పార్టీ డివిజన్ కమిటీ నేతలతో పాటు అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, సభ్యత్వ నమోదులో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ సభ్యత్వం తీసుకోడానికి చాలామంది ముందుకొస్తున్నారని అన్నారు. ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమ్‌నాథ్, నాయకులు తాడి బాబురావు, గద్దె రామేష్, వడ్లపట్ల నాని, చంద్రకిషోర్, కొరపాటి సురేంద్ర, మిక్కిలినేని బుజ్జి, జైశేఖర్, దండమూరి రామారావు పాల్గొన్నారు.



పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వాసవ్య మహిళామండలి ప్రతినిధులు

హెచ్ఐవీపై అవగాహన శిబిరాలు

పటమట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ(ఏపీ శాక్స్) ఆదేశాల మేరకు దిశ ఆధ్వర్యంలో పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో రెండు ప్రదేశాల్లో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో హెచ్ఐవీపై ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహించారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల పర్యవేక్షణాధికారి జాన్సన్ విచ్చేశారు. ఈ రెండు స్టాల్స్‌లో స్వచ్ఛంద సేవా సంస్థలు హెచ్ఐవీ, సుఖవ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తాయని జాన్సన్ తెలిపారు. వాసవ్య మహిళామండలి, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్, స్నేహ టీఐ, గైడ్ ఫౌండేషన్ ఆర్ హెడ్స్, రైడ్స్ విజయవాడ, లీడ్స్ సంస్థ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఆర్టీసీ ప్రయాణీకుల సౌకర్యార్థం హెచ్‌వీఐపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి ఆర్టీసీ సీపీఎం శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.



హెచ్ఐవీపై అవగాహన కోసం లయోలా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన పోటీల్లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

లయోలాలో ముగ్గుల పోటీలు

భారతీనగర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర లయోలా కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో ఆదివారం హెచ్ఐవీ నివారణ చర్యలపై విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. ఎయిడ్స్‌పై అపోహలను తొలిగించడానికి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ తెలిపారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రాయింగ్, ముగ్గుల పోటీలను నిర్వహించామన్నారు. పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు



డిమాండ్ల సాధన సదస్సులో మాట్లాడుతున్న బీసీ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీరాణి

వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలి

పటమట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సత్యపాల్ కమిషన్‌ను పునరుద్ధరించి ఉభయ సభల్లో ఆమోదించి వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీరాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలపై వడ్డెర, వడియరాజుల రాష్ట్రస్థాయి డిమాండ్ల సాధన సదస్సును నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, ఎన్నో ఏళ్లుగా వడ్డెరలకు రాజకీయంగా, ఆర్థికంగా చేస్తున్న అన్యాయాలపై సాధన సదస్సును నిర్వహిస్తున్నామని వేముల బేబీరాణి తెలిపారు. 'స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతిని జనవరి 11న ప్రకటించాలి. ఓబన్న విగ్రహాన్ని ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలి. స్థానిక సంస్థల్లో, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించాలి. రాజ్యసభ సీటు కేటాయించాలి. రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానాల్లో వడ్డెరలను చైర్మన్లుగా, డైరెక్టర్లుగా, బోర్డు మెంబర్లుగా నియమించాలి.' అని బేబీరాణి డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఏసురత్నం, బాలవీరస్వామి, రామారావు, నాని దేరంగుల పాల్గొన్నారు

ఆదమరిస్తే అంతే..

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్): భారతీనగర్ కాలనీలోని కేశినేని భవనం సమీపంలో గురునానక్, భారతీనగర్ కాలనీలను అనుసంధానించే భారతీనగర్‌కాలనీ 5వ రోడ్డు రోడ్డుపై ఏర్పడిన ఓ గుంత ప్రమాదకరంగా ఉంది. ఇక్కడే కేశినేని భవనం(ఎంపీ కార్యాలయం) కూడా ఉండడంతో ఈ ప్రాంతం ఎప్పుడూ నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఈ గుంతకు అడ్డుగా చెట్టుకొమ్మలు పెట్టారు. అధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



భారతీనగర్ కాలనీ 5వ రోడ్డుపై ఏర్పడిన గుంత, ప్రమాదాలు జరగకుండా గుంతలో స్థానికులు పెట్టిన చెట్టు కొమ్మలు



సత్యం హోటల్ సెంటర్ సమీపంలో లెగాసే మద్యం షాపు ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మద్యం షాపు తొలగించాలి

కృష్ణలంక, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సత్యం హోటల్ సెంటర్ ప్రాంతంలో నూతన మద్యం పాలసీలో భాగంగా ఏర్పాటు చేసిన లెగాసే మద్యం షాపును తక్షణమే తొలగించాలని స్థానిక ప్రజానీకంతో కలిసి సీపీఎం ఆదివారం ఆందోళన చేపట్టింది. షాపు తొలగించాలని మద్యం షాపు ఎదుట బైఠాయించింది. షాపు తెరవకుండా అడ్డుకుంది. ఆందోళనలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాలోనే 117 షాపులకు అనుమతులిచ్చిందన్నారు. జనసంద్రం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, నివాసాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతంలో మద్యం షాపునకు అనుమతివ్వడం దుర్మార్గమన్నారు. ఒక రాజకీయ పార్టీ ముఖ్య నేతలకు అనుచరులుగా ఉన్నవారు 25 శాతం వాటా తీసుకొని మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వారితో ఇక్కడ మద్యం షాపు పెట్టించారని ఆరోపించారు. మొదట గురునానక్ కాలనీలో ఈ మద్యం షాపును ప్రారంభిస్తే అక్కడ స్థానికుల అభ్యంతరాలతో తొలగించి ఇక్కడ ప్రారంభించారని కాశీనాథ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇక్కడి నుంచి మద్యం షాపు తీసేంతవరకు పోరాటాలు చేస్తూనే ఉంటామని కాశీనాథ్ హెచ్చరించారు. సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, బత్తుల చిన్నారావు, కోరాడ రమణ, తమ్మిన చంద్రశేఖర్, సూర్యదేవర నాగేశ్వరరావు, దామోదరరెడ్డి, ఎస్.నాగేశ్వరరావు, కాయల కుమారి, కె.శివాజీ పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంల మనసు మార్చమ్మా

● మేరీమాతను వేడుకున్న వలంటీర్లు



మోకాళ్లపై నడుస్తూ మేరీమాత వద్దకు చేరుకున్న వలంటీర్లు

గుణదల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వలంటీర్ వ్యవస్థను పునరుద్ధరించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మనసు మార్చాలని మేరీమాతను వలంటీర్లు వేడుకున్నారు. వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు, కార్యదర్శి జి.మమతలు వలంటీర్లతో కలిసి ఆదివారం మేరీమాత పుణ్యక్షేత్రానికి వచ్చారు. మోకాళ్లపై నడుస్తూ వచ్చి మేరీమాతను దర్శించుకున్నారు. మా విన్నపాన్ని ముఖ్యమంత్రి దృష్టికి నువ్వే తీసుకెళ్లాలి తల్లీ అంటూ వేడుకున్నారు. ఉగాది నాడు శుభవార్త చెబుతానని నమ్మబలికి వలంటీర్ల ఓట్లతో గెలిచిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చడం తగదన్నారు. శాసనమండలి సమావేశాల్లో వలంటీర్ వ్యవస్థ లేదని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం 2,60,000 మంది వలంటీర్లకు న్యాయంచేస్తూ ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్ వ్యవస్థను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. వలంటీర్లను కొనసాగిస్తూ వారికి ఉద్యోగభద్రత కల్పిస్తూ జీవో విడుదల చేయాలని కోరారు. రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వారినీ వలంటీర్లుగా కొనసాగించాలన్నారు. ఐదు నెలలుగా ఉన్న బకాయిలను చెల్లించాలని కోరారు. శిరీష, గౌతమి, రమ్యకృష్ణ, రాజకుమార్, రోజ్‌మేరి, దమ్ము రమేష్, అబ్దుల్లా జిలాని, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



పడిపోతున్న ఫెన్సింగ్

శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ సమీపంలో జాతీయ రహదారి వెంట గ్రీనరీకి రక్షణగా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ పడిపోకుండా సపోర్టుగా పెట్టిన కర్రలు

(ఆంధ్రజ్యోతి-భారతీనగర్): శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ సమీపంలో జాతీయ రహదారి వెంబడి ఉన్న గ్రీనరీకి రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్ ధ్వంసమై పడిపోతోంది. సర్వీస్‌రోడ్డు రమేష్ ఆస్పత్రి సెంటర్ నుంచి భారతీనగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, మహానాడు సెంటర్ మీదుగా రామవరప్పాడు సెంటరులో కలుస్తుంది. దీంతో నిత్యం ఈ సర్వీస్ రోడ్డు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. ప్రధాన రోడ్డులోని గ్రీనరీకి రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప ఫెన్సింగ్ నాణ్యత లోపించడంతో విరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. ఫెన్సింగ్‌కు సపోర్టుగా మధ్యలో వేసిన రాడ్లు తుప్పుపట్టాయి. దీంతో సపోర్టు లేకపోవడంతో సర్వీస్ రోడ్డుపై ఫెన్సింగ్ ఒరిగింది. అది ప్రమాదాలకు దారితీసేలా ఉంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా మరమ్మతులు చేయకుండా ఫెన్సింగ్ పడిపోకుండా తాత్కాలికంగా కర్రలు సపోర్టుగా పెట్టారని స్థానికులు చెబుతున్నారు. తుఫాన్ కారణంగా రెండు రోజుల నుంచి నగరంలో గాలులు వీస్తున్నాయి. కట్టిన కర్రలు ఎక్కడ విరిగిపోతాయని పాదచారులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికకులు కోరుతున్నారు.

ఫుట్‌బాల్ ట్రయల్స్‌కు అనూష, అరుణ



అనూష   అరుణ

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఏఐఎఫ్ఎఫ్) అండర్-20 మహిళా జాతీయపు ట్‌బాల్ జట్టు ట్రయల్స్‌కు అనంతపురం నుంచి మందల అనూష, కడప నుంచి తమటపు అరుణలు ఎంపికయ్యారని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డానియేల్‌ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రయల్స్ ఈనెల 10 నుంచి బెంగళూరులో జరుగుతాయని ప్రదీప్ వివరించారు. అనూష, అరుణలను ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ అభినందించారు.

నేటి నుంచి గీతా జయంతి మహోత్సవాలు

లబ్బీపేట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎన్టీఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గీతాజయంతి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 2వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సాయంత్రం 6గంటల నుంచి 8గంటల వరకు టీటీడీ కల్యాణ మండపంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గీతా పారాయణం, ప్రవచన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కోస్తా జిల్లాల సూపరింటెండెంట్ మేడవరం కాంతికుమార్ తెలిపారు. ఆదివారం ఆలయం ఆవరణలో కార్యక్రమ బ్యానర్‌ను ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీటీడీ వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లోనూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. గీతా ప్రవచకుడు పొక్కులూరి సుబ్బారావు రోజూ ఒక అధ్యాయం చొప్పున పారాయణ చేస్తారని, విశిష్టతను ప్రవచన రూపంలో అందిస్తారని తెలిపారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలిత, అర్చక స్వాములు మురళీ కృష్ణమాచార్యులు, జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు బొగ్గరపు వెంకట బాలకోటేశ్వరారావు, గీతా ప్రవచకుడు పొక్కులూరి సుబ్బారావు, సీవీకే ప్రసాద్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారులకు పెండింగ్ పారితోషికాలు ఇవ్వండి

● సీఎం చంద్రబాబుకు కేపీ రావు విన్నపం

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు క్రీడల్లో సత్తా చాటి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పతకాలను సాధించిన క్రీడాకారులకు గత ప్రభుత్వం ఐదేళ్ల నుంచి నగదు ప్రోత్సాహకాలను రూ.12 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని, వాటిని వెంటనే విడుదల చేసి క్రీడాకారుల్లో ఆత్మస్థైర్యం నింపాలని సీఎం చంద్రబాబునాయుడుకు ఏపీ ఒలింపిక్ సంఘం కార్యదర్శి కేపీ రావు ఈ మెయిల్ ద్వారా ఆదివారం విజ్ఞప్తి చేశారు. క్రీడా పాలసీలో ఒలింపిక్స్‌లో పతకం తెస్తే రూ.7 కోట్ల పారితోషికం ప్రకటించడం శుభపరిణామమని, అయితే ఆ స్థాయికి క్రీడాకారులు చేరుకోవడానికి ఎన్నో వ్యయప్రయాసలకు లోనవుతున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా సత్తా చాటే క్రీడాకారులకు మెరుగైన ఆట పరికరాలు, విదేశీ కోచ్‌లు, విదేశాల్లో శిక్షణ అవసరమని, దానికి ఏపీ ప్రభుత్వం నుంచి భరించేలా ఆదేశాలివ్వాలని కోరారు. 100 ఏళ్ల ఒలింపిక్స్ చరిత్రలో 41 పతకాలను మాత్రమే భారత్ సాధించిందని, కరణం మల్లేశ్వరి, పీవీ సింధులు రజతాలను సాధించారని, వారికి మెరుగైన శిక్షణతోనే ఒలింపిక్స్‌లో ఆ స్థాయిలో పతకాలు వచ్చాయని కేపీ రావు వివరించారు. కేంద్రం ప్రభుత్వం క్రీడాకారులకు శిక్షణకు టాప్ స్కీమ్ అమలు చేస్తోందని, ఆ పథకానికి అర్హులు కావాలంటే క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు, స్పెషల్ కోచింగ్‌లు అవసరమన్నారు.

కొబ్బరి నీళ్లు తాగేద్దాం!

కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మంచివని అందరికీ తెలుసు. వేసవికాలంలోనే కాదు చలికాలంలో కూడా తాగవచ్చు. కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరానికి ఎన్నో పోషకాలు, ఖనిజాలు, మినరల్స్ అందుతాయి. చలికాలంలో కొబ్బరి నీళ్లు అందించే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.



చర్మానికి : చలికాలంలో కొబ్బరినీళ్లు తరచూ తాగడం వల్ల శరీరంలో తేమ శాతం పెరుగుతుంది. దీనివల్ల చర్మం పొడారిపోకుండా మృదువుగా ఉంటుంది. ముఖంపై పగుళ్లు, మొటిమలు రాకుండా ఉంటాయి. రాత్రి పడుకునేముందు ముఖాన్ని కొబ్బరి నీళ్లతో కడిగితే మచ్చలు మాయమై చర్మం కాంతివంతంగా మారుతుంది.

రోగనిరోధక శక్తి: కొబ్బరి నీళ్లలో రెబోఫ్లేవిన్, నియాసిన్, థయామిన్, పిరిడాక్సిన్ విటమిన్లతోపాటు యాంటీ వైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తితోపాటు ఉత్సాహాన్ని, చురుకుదనాన్ని అందిస్తాయి. చలికాలంలో తరచూ వేధించే అనేక అనారోగ్య సమస్యలను తట్టుకునేందుకు అవసరమైన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కొబ్బరినీళ్లలో ఉండే సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు శరీరాన్ని ఉత్తేజితం చేసి చలికాలంలో వచ్చే బద్ధకాన్ని పోగొడతాయి.

బరువు : కొబ్బరి నీళ్లలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. పీచు పదార్థాలు, పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే కొబ్బరి నీళ్లు తాగిన వెంటనే చాలా సమయం వరకు కడుపు నిండిన భావన ఉంటుంది. దీనివల్ల త్వరగా ఆహారం తీసుకోవాలని అనిపించదు. క్రమంగా శరీర బరువు నియంత్రణలోకి వస్తుంది. బరువు తగ్గాలనుకునేవారు ప్రతిరోజూ కొబ్బరినీళ్లు తాగితే మంచి ఫలితం కనిపిస్తుంది.

జీర్ణక్రియ : కొబ్బరినీళ్లు తాగడం వల్ల కడుపులో ప్రేగు కదలికలు సక్రమంగా ఉంటాయి. జీర్ణక్రియ సులభంగా జరుగుతుంది. మలబద్ధకం సమస్య రాదు. కొబ్బరి నీళ్లలోని ఆల్కలీన్ గుణాలు పొట్టలో పీహెచ్ స్థాయిని తటస్థం చేస్తాయి. దీనివల్ల కడుపులో మంట, అజీర్ణం వంటి సమస్యలు రావు. కాలేయం ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం శరీరంలోని అదనపు నీటిని, ఇతర వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. రక్తపోటుని నియంత్రిస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పకుండా కాపాడుతుంది.

గుండె : తరచూ కొబ్బరి నీళ్లు తాగడం వల్ల రక్త ప్రసరణ వ్యవస్థ అదుపులో ఉంటుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలు తగ్గుతాయి. దీనివల్ల గుండె సంబంధిత సమస్యలు రాకుండా ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మెగ్నీషియం శరీరంలో ఇన్సులిన్ పనితీరుని మెరుగుపరుస్తుంది. దీనివల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

శక్తి : చలికాలంలో వ్యాయామం చేసిన తరవాత లేదంటే ఆటలు ఆడిన తరవాత శరీరానికి నిస్సత్తువ ఆవరిస్తుంది. ఇటువంటి సమయంలో వెంటనే కొబ్బరి నీళ్లు తాగితే శారీరక శ్రమ నుంచి ఉపశమనం లభిస్తుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఎలక్ట్రోలైట్లు, ఖనిజ లవణాలు తక్షణ శక్తిని అందిస్తాయి.

సి విటమిన్ లోపిస్తే...



విటమిన్ 'సి' మన ఆరోగ్యానికి అత్యవసరమైన పోషకం. రోగనిరోధక శక్తిని పెంచడంలో దీని పాత్ర కీలకం. గుండె, చర్మం, ఎముకలు, కండరాలు, దంతాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన శరీరంలో విటమిన్ 'సి' లోపిస్తే వచ్చే అనారోగ్య సమస్యల గురించి తెలుసుకుందాం.

రక్తహీనత : మనం తీసుకునే ఆహారపదార్థాల నుంచి ముఖ్యంగా శాకాహారం నుంచి ఐరన్‌ను గ్రహించడంలో శరీరానికి సి విటమిన్ సహాయం తప్పనిసరి. విటమిన్ సి తగిన పరిమాణంలో లేని పక్షంలో శరీరానికి ఐరన్ అందక రక్తం ఉత్పత్తి కాదు. దీంతో రక్తహీనత సమస్య వస్తుంది. శాకాహారుల్లో ఈ సమస్య అధికంగా ఉంటుంది.

అంటువ్యాధులు : సి విటమిన్ లోపించడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా పలు రకాల అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, న్యుమోనియా వంటివి తరచూ వేధిస్తుంటాయి.

ఎముకలు విరగడం : ఎముకలు బలంగా ఉండేందుకు కావాల్సిన కాల్షియాన్ని శరీరం సంగ్రహించేందుకు సి విటమిన్ తోడ్పడుతుంది. దీని లోపం వల్ల శరీరం కాల్షియాన్ని శోషించుకోలేదు. ఫలితంగా ఎముకలు బలహీనమై ఆస్టియోపోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. చిన్నపాటి ప్రమాద సంఘటనలకే ఎముకలు విరిగిపోతుంటాయి. గోళ్లు పెళుసుగా మారతాయి.

కండరాలు బలహీనం : సి విటమిన్ లోపిస్తే శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రొటీన్ ఉత్పత్తి కాదు. దీంతో కండరాలు, ఎముకల మధ్య అనుసంధానం దెబ్బతింటుంది. రక్తనాళాల గోడలు బలహీనమై కండరాల్లో వాపుని నొప్పిని కలిగిస్తాయి. గాయాలు తొందరగా నయం కావు.

దృష్టి దోషాలు : శరీరానికి సి విటమిన్ అందకపోతే తొందరగా వార్ధక్య లక్షణాలు ఎదురవుతాయి. కంటిచూపును అందించే రెటీనాలో ప్రధాన భాగమైన మాక్యులాలో అసాధారణ స్రావాలు విడుదలవుతాయి. దీంతో మాక్యులా పొరలు ఉబ్బి కంటి చూపు మందగిస్తుంది. రంగులను గుర్తించడం కష్టమవుతుంది.

అలసట: సి విటమిన్ లోపం కారణంగా శరీరంలో శక్తి ఉత్పత్తి వ్యవస్థ దెబ్బతింటుంది. దీంతో శరీరానికి కావాల్సిన శక్తి లభించక ఎప్పుడూ నీరసంగా, బలహీనంగా అనిపిస్తుంది. ఎంత బలమైన ఆహారం తీసుకున్నప్పటికీ అలసటగా, మత్తుగా అనిపిస్తుంది. ఏకాగ్రత కుదరక మానసిక సమస్యలు ఏర్పడతాయి.

నోటి సమస్యలు: విటమిన్ సి లోపం వల్ల దంతాలు, చిగుళ్లు బలహీనమవుతాయి. డెంటిన్ అనే పదార్థం ఏర్పడక పోవడంతో దంతాల్లోని రక్తనాళాలు పెళుసుగా మారతాయి. పళ్లు తోముతున్నపుడు కలిగే చిన్నపాటి ఒత్తిడికే రక్తనాళాలు చిట్లి చిగుళ్ల నుంచి రక్తం స్రవిస్తుంది. చిగుళ్లలో వాపు, నొప్పి కూడా బాధిస్తుంటాయి.

సుస్వర సంగీత ఝురి

సినీ కుటుంబ నేపథ్యం. కానీ పరిశ్రమ వైపు వెళ్లలేదు. సంగీత సాగరంలో తనకంటూ కొన్ని తీపి గుర్తులు ఉండాలనే తాపత్రయం. అందుకే మూడు దశాబ్దాలుగా స్వర సంగమంలో మునిగిపోయారు. వేదికలెక్కి... వేల ప్రదర్శనలు ఇచ్చి... ప్రతిష్ఠాత్మక 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం' అందుకున్నారు. అలనాటి ప్రముఖ నటుడు 'రక్తకన్నీరు' నాగభూషణం మనవరాలు... కర్ణాటక సంగీత కళాకారిణి... శ్వేతా ప్రసాద్‌తో 'నవ్య' ముచ్చట్లు.



"ఒకరి పేరు చెప్పుకొని కాదు... మనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనేది నా అభిమతం. అందుకు నేను ఎంచుకున్న మార్గం సంగీతం. మూడేళ్లప్పుడు మొదలుపెట్టాను. మూడు దశాబ్దాలుగా పాడుతూనే ఉన్నాను. సరిగమల ప్రవాహంలో సాగిపోతున్నాను. దానికి ప్రతిఫలమే ఇటీవల నేను అందుకున్న 'ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం'. నాకు 2022 సంవత్సరానికి గానూ కర్ణాటక సంగీతంలో వచ్చింది. ఢిల్లీలో 'కేంద్ర సంగీత నాటక అకాడమీ' ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ అవార్డులను ప్రదానం చేశారు. యువ కళాకారులకు ఇది 'పద్మశ్రీ'తో సమానం. స్వయంకృషితో ఎదిగి, ఇంతటి ప్రతిష్ఠాత్మక పురస్కారం తీసుకోవడం సంతోషంగా ఉంది. ఎంతో గర్వంగా అనిపిస్తోంది.

సంగీత జ్ఞానం ఉన్నవారే...

సంగీతాభిరుచి నాకు మా నాయనమ్మ శశిరేఖ నుంచి వచ్చింది. ఆవిడ కర్ణాటక సంగీతం చాలా బాగా ఆలపిస్తారు. మా తాత నాగభూషణం గారి 'రక్తకన్నీరు' నాటకానికి చాలా ఏళ్లు నాయనమ్మ పాడేవారట. నాన్న రవీంద్రనాథ్‌ది మేనరికం. మా అమ్మ ప్రసన్నకు మేనత్తే మా నాయనమ్మ. అమ్మ వైపు అందరికీ సంగీతంలో ప్రవేశం ఉంది. ఒకరు వయొలిన్ వాయించేవాళ్లు. ఒకరు హార్మోనియం... మరొకరు గాత్రం. కాకపోతే ఎవరూ ఎక్కడా నేర్చుకోలేదు. అలా నాకూ నాయనమ్మ వారసత్వం వచ్చింది. నేను పుట్టి పెరిగింది హైదరాబాద్‌లోనే. సంగీతంలో రామలక్ష్మి రంగాచారి గారు నా తొలి గురువు. ఐదారేళ్ల తరువాత నేతి శ్రీరామ్ గారి వద్ద శిష్యరికం చేశాను. మొత్తం పదహారేళ్లపాటు సంగీతం నేర్చుకున్నాను. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీకాం తరువాత ఎంఏ మ్యూజిక్ చదివాను. ప్రస్తుతం కర్ణాటక సంగీతంలో ఎంఫిల్ చేస్తున్నాను.

పిలిచి పాడించేవారు...

పదో ఏట నుంచే కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలకు పాడేదాన్ని. మా తాతగారిని కలవడానికి పెద్ద పెద్ద నటులు, నాయకులు ఇంటికి వచ్చేవారు. నన్ను పిలిచి... 'ఇది నా మనవరాలు. బ్రహ్మాండంగా పాడుతుంది... వినండి' అని నాతో వాళ్ల ముందు పాడించేవారు. ఎక్కువగా కమ్యూనిస్టు పాటలు పాడమనేవారు. నాయనమ్మకు పక్షవాతం వచ్చి పన్నెండేళ్లు మంచం మీదే ఉన్నారు. అప్పట్లో తను సొంతంగా రాసుకున్న గీతాలు నేను పాడి వినిస్తుంటే ఎంతో ఉద్వేగానికి లోనయ్యేవారు. తాత కూడా కన్నీళ్లు పెట్టుకొనేవారు.

ఆ ఇద్దరూ భలే ఇష్టం...

తాత గారికి ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఇక మా ఇంట్లో నేనే పెద్దదాన్ని. తమ్ముడు కౌశిక్ హోటల్ మేనేజ్‌మెంట్ చదివి, అదే రంగంలో స్థిరపడ్డాడు. చిన్నప్పుడు తాతయ్య మాతో చాలా సరదాగా గడిపేవారు. మా మధ్య చాలా సంభాషణలు జరిగేవి. 'రోజూ మేకప్ వేసుకొని తీయాలంటే చికాగ్గా ఉండదా' అని అడిగితే... 'అవునే..! మేకప్ కోసం తెల్లవారుజాము మూడింటికి లేచేవాడిని. మంచం మీద పడుకొంటే ముఖానికి రంగు వేసేసేవాళ్లు' అనేవారు నవ్వుతూ. నచ్చిన నటులు ఎవరని అడిగేవాళ్లం. ఆయన ఎప్పుడూ జయప్రద గారి గురించి గొప్పగా చెప్పేవారు. 'ఏంటోనే... ఆ అమ్మాయిని చూస్తుంటే అమ్మవారిలా అనిపిస్తుంది. ఏం అందం ఆ అమ్మాయిది' అనేవారు. ఆవిడ కూడా తాతయ్యను ఆప్యాయంగా 'డాడీ' అని పిలిచేవారు. అలాగే సూర్యకాంతం గారి వ్యక్తిత్వం ఆయనకు బాగా నచ్చేది. ఇద్దరూ 'ఒరేయ్ అన్నయ్యా' అంటే 'ఒరేయ్ అన్నయ్యా' అని పిలుచుకొనేవారట. ఆవిడ మహా సరదా మనిషిట. షూటింగ్‌లో కాస్త ఖాళీ దొరికితే చాలు... 'ఒరేయ్ అన్నయ్యా... రా ఆడుకొందాం' అని ఎడం చేత్తో పేక ముక్కలు అలా వేసిపడేసేవారట. ఫ్రీగా ఆడమంటే అస్సలు ఒప్పుకొనేవారు కాదుట. డబ్బులకు తప్ప ఆడేవారు కాదుట. ఇంట్లో అందరికీ వండి పెట్టడమంటే సూర్యకాంతం గారికి మహా ఇష్టమని చెప్పేవారు తాతయ్య.

ఎందుకో ఒప్పుకోలేదు...

నేను ఎనిమిదో తరగతిలో ఉండగా మా తాత చనిపోయారు. ఎందుకో తెలియదు... ఆయన తన పిల్లలు ఎవర్నీ సినిమాల్లోకి రానీయలేదు. నేను పుట్టేనాటికి... అంటే 1983కు ముందే పరిశ్రమతో సంబంధాలు తెంచుకుని హైదరాబాద్‌కు వచ్చేశారు. మా నాన్న కోసం దాసరి నారాయణరావు తదితరులు బోలెడన్ని కథలు రాసుకున్నారు. 'రవిబాబు కోసం నేను ఈ కథ రాసుకున్నా. బాబును నాకు వదిలెయ్... ఐదేళ్లలో సూపర్‌స్టార్‌ను చేస్తా' అనేవారు దాసరి. నాన్నది మంచి పర్సనాలిటీ. చూడ్డానికి చాలా బాగుంటారు. అయితే తాత గారు ససేమిరా అన్నారు. 'ఏమైనా చెప్పండి. అటువైపు నా పిల్లలను పంపించను' అని తెగేసి చెప్పేవారట. నేను కూడా కీరవాణి, కోటి, మణిశర్మ గార్ల సినిమాలకు పదేళ్లపాటు కోరస్ పాడాను. అదికూడా తాతకు నచ్చేది కాదు. 'ఎందుకు పంపిస్తున్నావురా పిల్లని' అని నాన్నపై కోప్పడేవారు. నలభై ఏళ్లకు పైగా పరిశ్రమలో ఉన్న ఆయన అంత కచ్చితంగా చెబుతున్నారంటే ఆలోచించాలి కదా!

వేల ప్రదర్శనలు...

ప్రస్తుతం నాకు, మావారు రేణుకా ప్రసాద్‌కు సంగీతమే వృత్తి. ఇదే మా జీవితం. ఆయన మృదంగం వాయిస్తారు. నట్టువాంగం చేస్తారు.



> **అమ్మవల్లే ఇక్కడివరకు...**
>
> సంగీతంలో నేను ఈ స్థాయికి రావడానికి మా అమ్మే కారణం. చిన్నప్పుడు సంగీత తరగతులకు వెళ్లనని ఏడ్చేదాన్ని. అయినా అమ్మ వినేది కాదు. 'నీకు భగవంతుడు మంచి గొంతు ఇచ్చాడు. నువ్వు ఏమైనా చెయ్యి. క్లాస్‌కు వెళ్లాల్సిందే' అనేది. ఎక్కడ పోటీలున్నా వెంటబెట్టుకుని తీసుకువెళ్లేది. నేను సంగీతం నేర్చుకోవడానికి ఏంకావాలన్నా చేసేది. పెళ్లయ్యాక మావారు, అత్తగారు కూడా అంతే ప్రోత్సహించారు. అమ్మ ప్రేరణ, అత్తింటివారి సహకారంవల్లే ఇదంతా సాధ్యమైంది.

తాతగారి కోసం రాస్తే...

'ముత్యాలముగ్గు'లో రావుగోపాలరావు గారు పోషించిన పాత్రను వాస్తవానికి బాపూ గారు తాతయ్య కోసం రాసుకున్నారు. ఎంత అడిగినా 'నేను చేయాలనుకోవడంలేదు' అని తాత చెప్పేశారు. సినిమాలు వదిలేసినప్పుడు చెన్నైలో ఆస్తులన్నీ అమ్మేసుకుని ఇక్కడ చిన్న ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డారు. ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో ఇప్పటికీ ఆయన పిల్లలు ఎవరికీ తెలియదు. ప్రస్తుతం మాకు పరిశ్రమలో ఎవరితో సంబంధాలు లేవు. అయితే జూనియర్ ఎన్టీఆర్ నాకు కజిన్ అవుతాడు. వాళ్లమ్మ శాలిని గారు, మా అమ్మ కజిన్ సిస్టర్స్ చిన్నప్పుడు తారక్ కూచిపూడి నాట్యానికి నేను గాత్ర సహకారం అందించేదాన్ని. ఇప్పుడు అతను బాగా బిజీ అయిపోయాడు. వాళ్లమ్మకు, మా అమ్మకు ఇప్పటికీ ఎంతో సాన్నిహిత్యం ఉంది. అలాగే బాలు గారితో మా నాన్నకు మంచి స్నేహం. ఇద్దరూ చెన్నైలో పక్క ఇళ్లల్లో ఉండేవారు.



మాకు ఒకతే అమ్మాయి... ప్రసిద్ధ. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. వయొలిన్ బ్రహ్మాండంగా వాయిస్తుంది. నేను, మావారు ఇప్పటికి మూడు వేల ప్రదర్శనల వరకు ఇచ్చివుంటాం. ఏటా అమెరికా వెళతాం. కచేరీలు, గెస్ట్ లెక్చరర్స్ ఇస్తాం. సంగీత తరగతులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. శోభానాయుడు గారికి పాతికేళ్లు పాడాను. ఆనంద్ శంకర్, స్వప్నసుందరి తదితర ప్రముఖ నాట్యకారులందరికీ నేనే పాడుతున్నాను. ఇవి కాకుండా ఎన్నో కచేరీలు చేశాను. తమన్ గారు అడిగితే 'సర్కారువారి పాట' చిత్రంలోని 'కళావతి' పాటలో జతులు ఆలపించాను. నాని 'అంటే సుందరానికి' చిత్రం 'పంచె కట్టు' పాట తమిళం, మళయాళం వెర్షన్లు పాడాను. ఇంతకుమించి సినిమా పాటలు పాడలేదు.

పెద్దగా కోరికలు లేవు...

కొవిడ్ సమయంలో సంపాదన లేక కొన్ని రోజులు ఇబ్బంది పడినా... అమ్మవారి దయవల్ల మా జీవితం ఇప్పుడు సంతోషంగా సాగిపోతోంది. మాది పదహారు మంది ఉన్న ఉమ్మడి కుటుంబం. కోట్లు సంపాదించాలి... బెంజిలో తిరగాలనే కోరికలేవీ మాకు లేవు. ముప్ఫై ఏళ్లుగా పాడుతున్నాం. వచ్చిన డబ్బుతో ఇల్లు కొనుక్కున్నాం. కారు ఉంది. ఇబ్బందులు లేకుండా సంసారం సాగిపోవడానికి సరిపడా సంపాదన వస్తోంది. ఒక మనిషి ఆనందంగా జీవించడానికి ఇంతకంటే ఏంకావాలి! చుట్టూ మన అనుకొనే మనుషులు... నాలుగు కచేరీలు ఉంటే చాలు మాకు."

• హనుమా

కాలేయాన్ని కాపాడుకుందాం!

కాలేయం మన శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం. శరీరంలో చేరిన విష పదార్థాలను, ఇతర వ్యర్థాలను తొలగించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏదైనా సమస్య వచ్చినపుడు కాలేయం తనంతట తాను మరమ్మతు చేసుకుంటుంది. మనం తీసుకునే కొన్ని ఆహార పదార్థాలు కూడా ఇందుకు సహకరిస్తాయి. వాటి గురించి తెలుసుకుందాం.

వెల్లుల్లి

- ఇందులో సల్ఫర్‌తోపాటు అల్లిసిన్, సిలీనియం లాంటి రసాయన సమ్మేళనాలు ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను బయటికి పంపేందుకు కాలేయంలో ఉత్పత్తయ్యే ఎంజైముల తయారీకి ఇవి తోడ్పడతాయి. వెల్లుల్లిని ఆహార పదార్థాల్లో చేర్చుకోవడం ద్వారా కాలేయం పనితీరు మెరుగుపడుతుంది.

బీట్‌రూట్

- తరచూ బీట్‌రూట్ రసం తీసుకోవడం వల్ల అందులోని బీటాలైన్ సమ్మేళనాలు కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. బీట్‌రూట్‌లో ఉండే పలు నైట్రేట్‌లు కాలేయంలో వ్యర్థాలు పేరుకోకుండా చేస్తాయి.

గ్రీన్ టీ

- తరచూ గ్రీన్ టీ తాగడం వల్ల కాలేయంలో ఎంజైమ్‌ల ఉత్పత్తి నియంత్రణలో ఉంటుంది. గ్రీన్ టీలోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలోని వ్యర్థాలను కరిగించి మూత్రం ద్వారా బయటికి వెళ్లేలా చేస్తాయి.

ఆకు కూరలు


- ఆకు కూరల్లో క్లోరోఫిల్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చేరిన భార ఖనిజాలు, పురుగు మందుల అవశేషాలు, ఇతర రసాయనాలను తొలగించడంలో కాలేయానికి సహాయం చేస్తుంది. ఆకుకూరలు, ముదురు ఆకుపచ్చ రంగులో ఉండే కూరగాయలను తరచూ తినడం వల్ల కాలేయంపై పని భారం తగ్గుతుంది.

ఆలివ్ ఆయిల్

- దీనిలో ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు ఉంటాయి. ఇవి శరీరంలో చేరిన కొన్ని రకాల విష పదార్థాలను శోషించుకుంటాయి. ప్రతిరోజూ తినే ఆహార పదార్థాల్లో ఆలివ్ ఆయిల్‌ను చేర్చుకోవడం వల్ల కాలేయంపై పని ఒత్తిడి తగ్గుతుంది.

ధనియాలు

- ఒక గ్లాసు నీటిలో ఒక చెంచా ధనియాలు వేసి రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే పరగడుపున తాగితే కాలేయంలో వ్యర్థాలు మిగలకుండా ఉంటాయి.



ధనియాల్లో ఉండే పీచు పదార్థాలు, ఫోలిక్ యాసిడ్‌లు ప్రభావవంతంగా పనిచేసి కాలేయాన్ని శుభ్రపరుస్తాయి.

వాల్‌నట్స్

- వీటిలో ఒమేగా 6, ఒమేగా 3 ఫాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వులు పేరుకోకుండా చేస్తాయి. వాల్‌నట్స్ తినడం వల్ల వాటిలోని ఆర్జినైన్ అనే అమైనో ఆమ్లం శరీరం నుంచి అమ్మోనియాను తొలగించడంలో కాలేయానికి సహకరిస్తుంది.

బాదం

- బాదం పప్పులో ఇ విటమిన్ ఉంటుంది. ఇది కాలేయంలోని ఆక్సీకరణ ఒత్తిడితో పోరాడుతుంది. కాలేయం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం అయిదు బాదం పప్పులను నీటిలో నానబెట్టి తినాలి.

పండ్లు

- నిమ్మ, నారింజ, బత్తాయి లాంటి సిట్రస్ పండ్లను తరచూ తినడం వల్ల శరీరానికి పుష్కలంగా సి విటమిన్ అందుతుంది. ఇది శరీరంలో చేరిన వ్యర్థాలను పూర్తిగా తొలగించి కాలేయానికి విశ్రాంతిని ఇస్తుంది. యాపిల్ పండ్లను తినడం వల్ల వాటిలో ఉండే పెక్టిన్ అనే పీచు పదార్థం కాలేయాన్ని పూర్తిగా శుభ్రం చేస్తుంది. నల్ల ద్రాక్షను జ్యూస్‌లా చేసుకుని తాగితే అందులోని యాంటీ ఆక్సిడెంట్లు కాలేయంలో ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గిస్తాయి.

నవ్య | చిత్రజ్యోతి


ఈ సినిమా ఆ లోటు తీరుస్తుంది

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవితం ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'ఘంటసాల ది గ్రేట్'. కృష్ణ చైతన్య టైటిల్ రోల్ పోషిస్తున్నారు. సిహెచ్. రామారావు దర్శకత్వంలో సిహెచ్.ఫణి నిర్మించారు. తాజాగా, ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు ఆవిష్కరించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ "ఈతరం ఘంటసాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అందరూ ఆయన్ని శతాబ్ది గాయకుడు అంటారు. నేను ఆయన్ని అమర గాయకుడు అంటాను. సంగీతం ఉన్నంత కాలం ఆయన ప్రజల మనసుల్లో ఉంటారు. కృషితో నాస్తి దుర్భిక్షం, వినయంతో విద్య ప్రకాశిస్తుందని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం ఆయన. దేశంలో ఇప్పటివరకూ ఏ గాయకుడి మీద పూర్తి స్థాయి సినిమా రాలేదు. ఈ సినిమా ఆ లోటును తీరుస్తుంది" అని అన్నారు.

మార్చిలో మొదలు




మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా ఓ చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. యువీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ భారీస్థాయిలో నిర్మిస్తున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై ఆదివారం మేకర్స్ నుంచి అప్డేట్ వచ్చింది. 'మేర్లపాక గాంధీ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు, వరుణ్ తేజ్ పాత్ర సరికొత్తగా ఉండబోతోంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ జరుగుతోంది, వచ్చే ఏడాది మార్చిలో చిత్రీకరణ ప్రారంభిస్తామ'ని తెలిపారు.

తుదిదశలో చిత్రీకరణ




ప్రభాస్ కథానాయకుడిగా మారుతి రూపొందిస్తున్న హారర్ థ్రిల్లర్ 'రాజా సాబ్'. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. మాళవికా మోహనన్ కథానాయికగా నటిస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో మాళవిక 'రాజాసాబ్' షూటింగ్ గురించి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. "రాజాసాబ్ షూటింగ్ తుది దశకు చేరుకుంది. మంచి ప్లానింగ్‌తో మారుతి షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఆయన త్వరలోనే ఆశ్చర్యపోయే అప్‌డేట్ ఇవ్వబోతున్నారు' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు.

మహేశ్‌బాబు ఎంజాయ్ చేశారు



2019లో వచ్చిన 'ది లయన్ కింగ్' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న చిత్రం 'ముఫాసా: ది లయన్ కింగ్'. బారీ జెన్‌కిన్స్ దర్శకత్వం వహించారు. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసా పాత్రకు హీరో మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ముఫాసా, మహేశ్‌బాబు ప్రచార చిత్రాన్ని నమ్రతా శిరోద్కర్ ఘట్టమనేని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'డిస్నీ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన చిత్రమిది. ఇలాంటి మంచి సినిమాను ఔచిత్యం చెడకుండా డబ్ చేయడం ఓ సవాల్ అనే చెప్పాలి. డిస్నీ సంస్థ చాలా శ్రమించి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. చాలా ఎంజాయ్ చేస్తూ 'ముఫాసా' పాత్రకు మహేశ్‌బాబు డబ్బింగ్ చెప్పారు. ఈ చిత్రం తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది' అన్నారు. ఈ సందర్భంగా ముఫాసా చిత్రబృందం రూపొందించిన మహేశ్‌బాబు పోస్టర్‌ను నమ్రత ఆవిష్కరించారు. సత్యదేవ్, అలీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అద్భుత ప్రయాణం ముగిసింది



మలయాళ కథానాయకుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'లూసిఫర్ 2: ఎంపురన్'. 2019లో విడుదలై ఘనవిజయం సాధించిన 'లూసిఫర్' సినిమాకు ఇది కొనసాగింపు. లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. తాజాగా, ఈ సినిమా షూట్ పూర్తైనట్లు మోహన్‌లాల్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తెలిపారు. "లూసిఫర్ సినిమా షూట్ పూర్తైంది. 14 నెలలుగా ఎనిమిది రాష్ట్రాలు.. యూఎస్‌ఏ.. యూకే.. యూఏఈలోని అద్భుతమైన లొకేషన్లలో చిత్రీకరించాం. అద్భుత ప్రయాణమిది. ప్రతి ఫ్రేమ్‌ని తన సృజనాత్మకతతో మరో స్థాయికి తీసుకెళ్లే అపార ప్రతిభ పృథ్వీరాజ్ సొంతం. తన కలం పదునుతో సినిమాకు ఎంతో ప్రత్యేకతను తెచ్చిన మురళీ గోపికి.. ఈ ప్రాజెక్ట్‌పై ఎంతో నమ్మకం పెట్టిన నిర్మాతలకు ధన్యవాదాలు. టీమ్ సమష్టి కృషి వల్లే ఈ సినిమా సాధ్యమైంది. నా సినీ ప్రయాణంలో ఈ సినిమా ఓ మైలురాయి. అభిమానులు అందించే ప్రేమే మాలో స్ఫూర్తిని పెంచింది" అని పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా విడుదలవుతోంది.

ఎక్స్ ఖాతా డిలీట్



నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతోన్న 'నయనతార: బియాండ్ ద ఫేరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో ధనుశ్, నయనతార మధ్య మొదలైన వివాదం తెలిసిందే. 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని కొన్ని సెకన్ల ఫుటేజిని వాడారని.. అందుకోసం ధనుశ్.. నయనతార, విఘ్నేష్ శివన్ కోర్టు నోటీసులు పంపారు. అయితే, ఇటీవలే 'నానుమ్ రౌడీ దాన్' సినిమాలోని క్లిప్ ఉచితంగా చూసేయ్యండి అనే వీడియోతో పాటు ధనుశ్ ఓ మీడియా ఈవెంట్‌లో మాట్లాడిన వీడియోనూ ఇన్‌స్టా స్టోరీలో పోస్ట్ చేశారు విఘ్నేశ్. ధనుశ్ అభిమానుల నుంచి ట్రోలింగ్ జరిగేసరికి ధనుశ్ వీడియోను తొలగించారు. తాజాగా, తాను అజిత్ నటించిన 'ఎన్నై అరిందాల్ (ఎంతవాడు కానీ)' సినిమా కోసం ఓ పాట రాశాననీ.. అదే టైమ్‌లో తన మొదటి మూవీ 'నానుమ్ రౌడీ దాన్'ని చూసి ఆయన మెచ్చుకున్నారని తెలిపారు. ఇవన్నీ అబద్ధాలంటూ.. అజిత్ సినిమా రిలీజైన ఏడు నెలలకు 'నానుమ్ రౌడీ దాన్' విడుదలైందని.. అసలు థియేటర్లలోకి సినిమా రాకముందే అజిత్ ఎలా చూశారని ధనుశ్ అభిమానులు విఘ్నేష్‌ను ట్రోల్ చేశారు. దీంతో విఘ్నేష్ శివన్ తన ఎక్స్ ఖాతాను డిలీట్ చేశారు.

వావ్ అర్జున్!



న్యూఢిల్లీ: దేశ చెస్ చరిత్రలో దిగ్గజ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత మరెవరికీ సాధ్యంకాని 2800 ఎలో రేటింగ్‌ను తెలంగాణ యువ జీఎం ఇరిగేసి అర్జున్ సాధించి సంచలనం సృష్టించాడు. ఆదివారం ఫిడే విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్ క్లాసికల్ విభాగంలో ప్రపంచ నాలుగో ర్యాంక్‌ను దక్కించుకున్న అర్జున్, 2801 ఎలో రేటింగ్ పాయింట్లు సొంతం చేసుకుని శభాష్ అనిపించాడు. ఐదుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన ఆనంద్ మాత్రమే భారత్ నుంచి ఇప్పటివరకు ఈ 2800 ఎలో రేటింగ్‌ను సాధించాడు. అతడి తర్వాత ఈ ఘనత సాధించిన రెండో భారతీయుడిగా, తొలి తెలుగు జీఎంగా అర్జున్ ఖ్యాతి గడించాడు. ప్రపంచం మొత్తంగా చెస్‌లో ఈ అత్యుత్తమైన ఎలో రేటింగ్‌ను అందుకున్న 16వ గ్రాండ్‌మాస్టర్‌గా అర్జున్ నిలిచాడు. వరంగల్‌కు చెందిన ఈ 21 ఏళ్ల చెస్ కుర్రాడు ఈ ఏడాది చెస్ ఒలింపియాడ్‌లో వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో పసిడి పతకాలు కొల్లగొట్టాడు. గత సెప్టెంబరులోనే భారత్ నుంచి అత్యధిక రేటింగ్ గల క్రీడాకారుడిగా నిలిచిన అర్జున్, ప్రపంచ రెండో ర్యాంక్‌కు కూడా ఎగబాకాడు. గత అక్టోబరులో జరిగిన ఐరోపా క్లబ్ చాంపియన్‌షిప్‌లో అర్జున్ కనబర్చిన అత్యుత్తమ ప్రదర్శన అతడి రేటింగ్ మెరుగవడానికి తోడ్పడింది. ప్రస్తుతం నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ 2831 ఎలో రేటింగ్‌తో అగ్రస్థానంలో స్థిరంగా కొనసాగుతుండగా, అమెరికా జీఎంలు ఫాబియానో కరువానా 2805 రేటింగ్‌తో ద్వితీయ, హికారు నకముర 2802 రేటింగ్‌తో తృతీయ స్థానంలో ఉన్నారు. అర్జున్ 2801 రేటింగ్‌తో నాలుగో స్థానంలో ఉండగా, అతడి తర్వాత భారత్ నుంచి టాప్-10లో గుకేష్ (2783) ఐదో స్థానంలో, విశ్వనాథన్ ఆనంద్ (2750) 10వ స్థానంలో నిలిచారు.

క్రికెట్ అగ్రపీఠాన జై షా



ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

చాంపియన్స్ ట్రోఫీ రూపంలో తొలి సవాల్

వ్యూహాత్మక పరిపాలనతో భారత క్రికెట్‌ను అత్యున్నత శిఖరాలకు తీసుకెళ్లిన జై షా.. ఇక అంతర్జాతీయ స్థాయిలో తన మార్క్ చూపెట్టనున్నాడు. ప్రపంచ క్రికెట్ బాస్‌గా అతడు కొత్త ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టాడు. ఐసీసీ చైర్మన్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన 36 ఏళ్ల జై షా.. ఈ పదవిని చేపట్టిన పిన్న వయస్కుడిగా రికార్డు కెక్కాడు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కుమారుడైన జైషా ఓవరాల్‌గా ఈ ఘనత వహించిన ఐదో భారతీయునిగా నిలిచాడు.

దుబాయ్: బీసీసీఐ కార్యదర్శి జై షా క్రికెట్ పరిపాలనలో అత్యున్నత పదవిని చేపట్టాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్‌గా ఆదివారం అతడు బాధ్యతలు స్వీకరించాడు. చాంపియన్స్ ట్రోఫీ వివాదం రూపంలో కొత్త బాధ్యతల్లో జై షాకు తొలి సవాలు ఎదురు కానుంది. అలాగే ఒలింపిక్ క్రీడ క్రికెట్‌ను వాణిజ్యపరంగా మరింత ఆకర్షణీయంగా తీర్చే విధానాలు రూపొందించడం షా ముందున్న మరో ప్రధాన లక్ష్యం. గత ఐదేళ్లుగా బీసీసీఐ కార్యదర్శిగా కొనసాగుతున్న షా..ఐసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన ఐదో భారత వ్యక్తి. అలాగే పిన్న వయస్సులో అంతర్జాతీయ క్రికెట్ మండలికి సారథ్యం వహిస్తున్న రికార్డును అతడు సొంతం చేసుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన గ్రెగ్ బార్క్‌లే స్థానంలో షా ఐసీసీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. ఇక..జై షాకు ముందు వ్యాపారవేత్త జగ్‌మోహన్ దాల్మియా, రాజకీయవేత్త శరద్ పవార్, న్యాయవాది శశాంక్ మనోహర్, పారిశ్రామిక వేత్త శ్రీనివాసన్ భారత్ నుంచి ఐసీసీ అధ్యక్షులుగా వ్యవహరించారు.

జిల్లా స్థాయి నుంచి ఐసీసీ దాకా..

కళాశాల విద్యార్థిగా ఉన్న సమయంలోనే గుజరాత్‌లో జిల్లా క్రికెట్ సంఘం బాధ్యతలు చేపట్టిన షా..ఆపై రాష్ట్ర క్రికెట్ సంఘానికి, అనంతరం జాతీయ క్రికెట్ నుంచి ప్రస్తుతం ఐసీసీ చీఫ్ స్థాయికి ఎదిగాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ చైర్మన్‌గా కూడా వ్యవహరించాడు. ఇంకా..ఐసీసీ ఆర్థిక, వాణిజ్య వ్యవహారాల కమిటీ చైర్మన్‌గా పని చేశాడు. జై షా గుజరాత్ క్రికెట్ సంఘం (జీసీఏ) సంయుక్త కార్యదర్శిగా ఉన్న సమయంలోనే..గుజరాత్ జట్టు రంజీ చాంపియన్‌గా నిలిచింది. అలాగే అహ్మదాబాద్‌లో ప్రపంచ అతి పెద్ద క్రికెట్ స్టేడియం కూడా అతడు జీసీఏ బాధ్యతల్లో ఉన్నప్పుడే నిర్మితమైంది. బీసీసీఐ కార్యదర్శిగా దేశవాళీ క్రికెట్ పోటీల మ్యాచ్ రుసుములు పెంచాడు. అంతేకాదు..టెస్ట్ క్రికెటర్లకు బోనస్ ఇచ్చే కీలక నిర్ణయమూ తీసుకున్నాడు. మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభించడం, జాతీయ జట్ల పురుషులు, మహిళా క్రికెటర్లకు సమాన వేతనాలు ఇవ్వడం బీసీసీఐ కార్యదర్శిగా షా తీసుకున్న అతి పెద్ద నిర్ణయాలు. చిన్న వయస్సులో బీసీసీఐ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడంతో యువ క్రికెటర్లపట్ల షా మరింత సానుకూలంగా ఉండేవాడు. అదే సమయంలో నిబంధనలను ఉల్లఘించిన ఆటగాళ్లను శిక్షించడంలోనూ వెనుకంజ వేసేవాడు కాదు. స్టార్ క్రికెటర్లు దేశవాళీ క్రికెట్ పోటీలలో ఆడడం తప్పనిసరి చేశాడు. దానిని ధిక్కరించిన శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను సెంట్రల్ కాంట్రాక్టులనుంచి తొలగించేందుకూ వెనుకాడలేదు. ఇక..ఐసీసీ బోర్డు సభ్యుల్లో తనకు మంచి మెజార్టీ ఉన్నందున విధాన నిర్ణయాలు తీసుకోవడంలో షాకు ఎలాంటి సమస్యలూ ఉండకపోవచ్చు.

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

'చాంపియన్స్ ట్రోఫీ'ని ఎలా పరిష్కరిస్తారో..!

హైబ్రిడ్ విధానంలో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు ఆమోద యోగ్య పరిష్కారాలు కనుగొనడం జై షా తక్షణ కర్తవ్యం. చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ ఆ దేశం వెళ్లేందుకు భారత్ నిరాకరించడంతో హైబ్రిడ్ పద్ధతి తెరపైకి వచ్చింది. దీనికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కూడా అంగీకారం తెలిపింది. ఈ విధానంలో భారత జట్టు తమ మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడాల్సి ఉంటుంది. మరోవైపు..2031 వరకు జరిగే ఐసీసీ ఈవెంట్లలోనూ ఇదే హైబ్రిడ్ పద్ధతిని అనుసరించాలని పీసీబీ షరతు విధించింది. ఆ టోర్నమెంట్లను భారత్ సంయుక్తంగా, ఒక్కటిగా ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. ఇక..చాంపియన్స్ ట్రోఫీకి 100 రోజులలోపే సమయం మిగిలి ఉంది. వచ్చే ఫిబ్రవరి-మార్చిలో జరిగే ఆ టోర్నీకి అటు పీసీబీ ఇటు బీసీసీఐతో షా సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. తద్వారా ఐసీసీ చీఫ్‌గా తన ఆధ్వర్యంలో మొదటి టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అతడిపై ఉంది. పాకిస్థాన్‌లో పర్యటనకు భారత జట్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అనుమతి నిరాకరించింది. అయితే చాంపియన్స్ ట్రోఫీపై జై షా ఇప్పటి వరకు ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ ప్రవేశాన్ని ఉపయోగించుకొని ఆటను మరింత విశ్వవ్యాప్తం చేయడం, మహిళల క్రికెట్‌కు ఇంకా ప్రాచుర్యం కల్పించడం తన ప్రధాన లక్ష్యాలని షా ప్రకటించాడు. '2028 లాస్‌ఏంజిల్స్ విశ్వ క్రీడల ద్వారా ప్రపంచంలో మరిన్ని ప్రదేశాలకు క్రికెట్‌ను విస్తరించేలా ప్రణాళిక రూపొందిస్తాం' అని తెలిపాడు. 'వివిధ ఫార్మాట్ల ఆటతో క్రికెట్ ప్రస్తుతం కీలక మలుపులో ఉంది. మహిళల క్రికెట్ అభివృద్ధిని వేగవంతం చేయాలి. ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్‌కు ఎంతో ఆదరణ లభిస్తోంది. ఈనేపథ్యంలో ఆటను కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఐసీసీ సభ్యులు, సభ్య దేశాలతో కలిసి పని చేసేందుకు ఎదురు చూస్తున్నా' అని షా పేర్కొన్నాడు. గత నాలుగేళ్లుగా ఐసీసీకి బార్క్‌లే అందించిన సేవలను షా కొనియాడాడు.

బీసీసీఐ ప్రతినిధి ఎవరు ?

షా ఐసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడంతో బీసీసీఐ కార్యదర్శి ఎవరన్న చర్చ మొదలైంది. ఐసీసీ బోర్డు సమావేశంలో బీసీసీఐ తరపున ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారో చూడాలి. బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాలలో ఎవరు సమావేశాలకు హాజరవుతారన్నది ప్రశ్న. బిన్నీ కనుక భారత్‌నుంచి ఐసీసీ డైరెక్టర్ అయితే శుక్లా ప్రత్యామ్నాయ డైరెక్టర్‌గా నియమితుడవుతాడని భావిస్తున్నారు. ఒకవేళ శుక్లా కనుక డైరెక్టర్ అయితే సహ డైరెక్టర్‌గా అరుణ్ ధూమల్‌ను నియమిస్తారని అంచనా వేస్తున్నారు. ఇకపోతే..వచ్చే ఏడాది బీసీసీఐకి కొత్త కార్యదర్శిని నియమిస్తే..ధూమల్‌తో పాటు ప్రస్తుత కోశాధికారి ఆశిష్ షెలార్, సంయుక్త కార్యదర్శి దేవజిత్ లోన్ సైకియా రేసులో ఉంటారని భావిస్తున్నారు.

సింధు తీన్‌మార్

మూడోసారి సయ్యద్ మోదీ టైటిల్ సొంతం





లక్ష్య సేన్

పురుషుల చాంపియన్ లక్ష్య సేన్

డబుల్స్ విజేత గాయత్రి జోడీ

లఖ్‌నవూ: ఏస్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్య సేన్‌లు సయ్యద్ మోదీ అంతర్జాతీయ టోర్నీ టైటిళ్లను సొంతం చేసుకొన్నారు. అలాగే మహిళల డబుల్స్ టైటిల్‌ను గెలిచిన తొలి భారత జంటగా పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ రికార్డులకెక్కింది. గత కొంత కాలంగా ఫామ్ కోసం తంటాలు పడుతున్న సింధు రెండేళ్ల తర్వాత టైటిల్‌తో మురిసింది. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సింధు 21-14, 21-16తో ఉ ల్యు యు (చైనా)పై వరుస గేముల్లో గెలిచింది. 2017, 2022లో ఈ టైటిల్ నెగ్గిన సింధు.. మూడోసారీ చాంపియన్‌గా నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ లక్ష్య 21-6, 21-7తో జియా హెంగ్ జాసన్ (సింగపూర్)ను చిత్తు చేశాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక పోరులో ఓటమితో డీలాపడ్డ సేన్‌కు ఈ విజయం ఆత్మవిశ్వాసాన్నిచ్చేదే. మహిళల డబుల్స్ తుది పోరులో 2022 రన్నరప్ ట్రీసా-గాయత్రి జంట 21-18, 21-11తో చైనాకు చెందిన లి కియాన్-లి జింగ్ బావోపై వరుస గేముల్లో గెలిచింది. ఈ జంటకు ఇదే తొలి సూపర్-300 టైటిల్. పురుషుల డబుల్స్ ఫైనల్లో పృథ్వీ కృష్ణమూర్తి రాయ్-సాయి ప్రతీక్ ద్వయం 14-21, 21-19, 17-21తో చైనాకు చెందిన హువాంగ్ డి-లియు యంగ్ చేతిలో, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఐదో సీడ్ తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జంట 21-19, 14-21, 8-21తో థాయ్‌లాండ్ జోడీ డెచపోల్-సుప్పిసారా చేతిలో పోరాడి ఓడారు.



గాయత్రి ట్రీసా

ప్రాక్టీస్‌లో మెరిశారు

గిల్ అర్ధసెంచరీ ● రాణించిన జైస్వాల్, నితీశ్

హర్షిత్‌కు నాలుగు వికెట్లు

ప్రైమ్ మినిస్టర్స్ లెవెన్‌పై భారత్ విజయం



గిల్ (50)

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాతో గులాబీ టెస్టుకు ముందు జరిగిన వామప్ మ్యాచ్‌లో టీమిండియాకు చక్కటి ప్రాక్టీస్ లభించింది. ముఖ్యంగా గాయం నుంచి కోలుకున్న శుభ్‌మన్ గిల్ (50) అర్ధసెంచరీతో ఫామ్ నిరూపించుకున్నాడు. అటు పేసర్ హర్షిత్ రాణా నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు. దీంతో ఆదివారం ప్రైమ్ మినిస్టర్స్ లెవన్‌తో జరిగిన వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. అయితే రెండు రోజుల ఈ మ్యాచ్ తొలి రోజు శనివారం వర్షార్పణమైంది. దీంతో ఆదివారం 50 ఓవర్ల మ్యాచ్ ఆడేందుకు ఇరు జట్ల కెప్టెన్లు అంగీకరించారు. కానీ మ్యాచ్ ఆరంభమైన కాసేపటికే వర్షం అంతరాయం కలిగించడంతో 46 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ పీఎం లెవన్ 43.2 ఓవర్లలో 240 పరుగులకు ఆలౌటైంది. 19 ఏళ్ల ఓపెనర్ సామ్ కోన్‌స్టాస్ (107) శతకంతో అదరగొట్టగా, తొమ్మిదో నెంబర్ బ్యాటర్ హన్నో జాకబ్స్ (60) అర్ధసెంచరీ సాధించాడు. జాక్ క్లేటన్ (40) పర్వాలేదనిపించాడు. ఆకాశ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బరిలోకి దిగిన భారత్ 42.5 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులతో చేదించింది. జైస్వాల్ (45), నితీశ్ (42), సుందర్ (42 నాటౌట్), జడేజా (27) రాణించారు. అయితే మ్యాచ్‌ను గెలిచినప్పటికీ మిగిలిన 3.1 ఓవర్లలోనూ భారత్ ప్రాక్టీస్ కొనసాగించింది. విరాట్, బుమ్రా, పంత్ విశ్రాంతి తీసుకున్నారు.

రోహిత్ విఫలం: ఈ మ్యాచ్‌లో ఓపెనర్లుగా జైస్వాల్, రాహుల్ బరిలోకి దిగగా, కెప్టెన్ రోహిత్ మాత్రం నాలుగో నెంబర్‌లో ఆడాడు. అయితే బ్యాటింగ్ ఆర్డర్‌లో అంతా పర్వాలేదనిపించినా.. రోహిత్ మాత్రం 3 పరుగులకే వెనుదిరిగి నిరాశపరిచాడు. ఛేదనలో ఓపెనర్ జైస్వాల్ తొమ్మిది ఫోర్లతో ఆకట్టుకున్నాడు. మరో ఓపెనర్ రాహుల్ (27) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా వన్‌డౌన్‌లో గిల్ బరిలోకి దిగాడు. స్క్వేర్ కట్ షాట్‌తో ఫోర్ ద్వారా పరుగుల ఖాతా తెరిచాడు. ఎలాంటి ఇబ్బందీ లేకుండా బ్యాటింగ్ సాగించిన తను అర్ధసెంచరీతో రెండో టెస్టుకు సిద్ధమని సంకేతాలు పంపినట్టయ్యింది. గిల్ కూడా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగ్గా అటు నితీశ్ వరుస బౌండరీలతో చెలరేగాడు. అతడికి జతగా సుందర్ సైతం స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. దీంతో జట్టు చకచకా లక్ష్యం వైపు సాగింది.



కాన్‌బెర్రా ఎంపీ చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న రోహిత్

గార్డెన్‌లో తిరుగుతున్నావా?

క్రికెట్ మైదానంలో కెప్టెన్ రోహిత్ శర్మ సహచరులతో సరదాగా ఉండడంతో పాటు, ఫీల్డింగ్ సరిగా చేయకపోతే 'గార్డెన్‌లో తిరుగుతున్నావా?' అంటూ మందలించడం పరిపాటి. తాజాగా అదే డైలాగ్‌ను పేసర్ సిరాజ్ వాడుకున్నాడు. పీఎం లెవన్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో బ్యాటర్ రెన్షా.. సిరాజ్ బంతి వేసే సమయంలో పక్కకు తప్పుకొన్నాడు. సైట్‌స్క్రీన్‌కు సెక్యూరిటీ సిబ్బంది అడ్డుగా రావడంతో రెన్షా ఇబ్బందిపడ్డాడు. దీంతో సిరాజ్ సెక్యూరిటీ గార్డు వైపు చూస్తూ 'ఏ భాయ్.. గార్డెన్‌లో తిరుగుతున్నావా?' అంటూ గట్టిగా అరిచాడు.

సంక్షిప్త స్కోర్లు

పీఎం లెవన్: 43.2 ఓవర్లలో 240 ఆలౌట్ (కాన్‌స్టస్ 107, జాకబ్స్ 61; రాణా 4/44, ఆకాశ్ 2/58).

భారత్: 46 ఓవర్లలో 257/5 (గిల్ 50 రిటైర్డ్ హర్ట్, జైస్వాల్ 45, నితీశ్ 42, సుందర్ 42 నాటౌట్; అండర్సన్ 2/30).

పదికి పది

హ్యాట్రిక్ సహా సుమన్ అరుదైన ఫీట్

కూచ్ బెహార్ ట్రోఫీ



న్యూఢిల్లీ: అండర్-19 కూచ్‌బెహార్ ట్రోఫీలో బిహార్ పేసర్ సుమన్ కుమార్ (33.5-20-53-10) సంచలన బౌలింగ్ ప్రదర్శన కనబరచాడు. రాజస్థాన్‌తో జరిగిన ఈ నాలుగు రోజుల మ్యాచ్‌లో ఒక ఇన్నింగ్స్‌లో హ్యాట్రిక్ సహా 10 వికెట్లతో అరుదైన ఘనతను సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో బిహార్ 467 పరుగులు చేసింది. బదులుగా మొదటి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన రాజస్థాన్.. సుమన్ దెబ్బకు 187 పరుగులకు ఆలౌటైంది. 36వ ఓవర్‌లో రాజస్థాన్ 4,5,6 నెంబర్ల బ్యాటర్లను సుమన్ డకౌట్ చేశాడు. రాజస్థాన్ ఫాలో ఆన్ ఆడగా.. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

బంగ్లా 122/6


విండీస్‌తో రెండో టెస్ట్

కింగ్‌స్టన్: విండీస్ పేసర్లు నిప్పులు చెరుగుతుండడంతో.. రెండో టెస్ట్‌లో బంగ్లాదేశ్ తడబడుతోంది. ఆటకు రెండో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 69/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా కడపటి వార్తలందే సమయానికి 58 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. కెప్టెన్ మెహ్దీ హసన్ మిరాజ్ (18), తైజుల్ ఇస్లాం (8) క్రీజులో ఉన్నారు. అర్ధ శతకం సాధించిన ఓవర్‌నైట్ బ్యాటర్ షాద్‌మన్ ఇస్లాం (64)ను షామర్ జోసెఫ్ క్యాచవుట్ చేశాడు. షామర్ జోసెఫ్ 3, కీమర్ రోచ్ 2 వికెట్లు పడగొట్టారు.

ఆంధ్ర కబడ్డీ గౌరవాధ్యక్షుడిగా మంత్రి కొండపల్లి



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కబడ్డీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన కబడ్డీ సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా టీడీపీ ఆంధ్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, అధ్యక్షుడిగా విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పద్మజ బాల, సీఈఓగా వీర లంకయ్య నియమితులయ్యారు. రాష్ట్రంలో కబడ్డీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని వంశీకృష్ణ అన్నారు.



సాగర తీరాన సందడిగా వైజాగ్ మారథాన్

రామ్‌నగర్ (విశాఖపట్నం): విశాఖ సాగరతీరంలో ఆదివారం వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మారథాన్‌కు విశేష స్పందన లభించింది. 21కె, 10కె, 5కె, 3కె విభాగాల్లో నిర్వహించిన మారథాన్‌లో ఔత్సాహికులు వేలాదిగా పాల్గొన్నారు. విజేతలకు వైజాగ్ రన్నర్స్ సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణారాయ్ బహుమతులు అందజేశారు.



గుకేష్

డ్రాల పరంపర


ఆరో గేమ్‌లోనూ తేలని ఫలితం

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్

సింగపూర్: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్ పోరులో డ్రాల పరంపర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన ఆరో రౌండ్‌లోనూ ఫలితం తేలలేదు. వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్, చాలెంజర్ గుకేష్ మధ్య జరుగుతున్న ఈ ఫైనల్లో ఇది వరుసగా మూడో డ్రా కావడం గమనార్హం. ఓవరాల్‌గా నాలుగో డ్రా. ఆరో రౌండ్ తర్వాత ఇద్దరు ఆటగాళ్లు చెరి మూడేసి పాయింట్లతో సమంగా ఉన్నారు. సోమవారం విశ్రాంతి దినం. ఏడో రౌండ్ మంగళవారం జరుగుతుంది. గత రౌండ్ మాదిరే ఆరో గేమ్ కూడా పోటాపోటీగా సాగింది. అయితే నల్లపావులతో ఆడిన 18 ఏళ్ల భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ప్రత్యర్థిని నిలువరించడం విశేషం. 46 ఎత్తుల తర్వాత ఇద్దరూ డ్రాకు అంగీకరించారు. తెల్లపావులతో పటిష్టమైన 'లండన్ సిస్టమ్'తో ఆడిన లిరెన్ మెరుపు వేగంతో ఏడు నిమిషాల్లోనే 20 ఎత్తులు వేశాడు. మరోవైపు ఆట ప్రథమార్థంలో ఎక్కువ సమయం తీసుకొన్న గుకేష్.. 20వ ఎత్తులో దూకుడు ప్రదర్శించి మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేశాడు. తన అదనపు సమయాన్ని వెచ్చించినా గుకేష్ ఎత్తుకు ప్రతి ఎత్తు వేయలేకపోయిన లిరెన్ డ్రాకు ప్రతిపాదించాడు.

ఇంగ్లండ్ రికార్డు విజయం

కివీస్‌తో తొలి టెస్టు



కార్స్

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో ముగిసిన తొలి టెస్టులో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో నెగ్గింది. ఫలితంగా మూడు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. ఆదివారం నాలుగో రోజు 104 పరుగుల స్వల్ప ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఇంగ్లండ్ ధనాధన్ ఆటతో అదరగొట్టింది. జేకబ్ బెథెల్ (50 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో పర్యాటక జట్టు కేవలం 12.4 ఓవర్లలోనే 104/2 స్కోరుతో గెలిచింది. దీంతో టెస్టుల్లో అత్యంత వేగంగా 100+ టార్గెట్‌ను పూర్తి చేసిన జట్టుగానూ నిలిచింది. అంతేకాకుండా టెస్టు క్రికెట్ నాలుగో ఇన్నింగ్స్‌లో ఎక్కువ పరుగులు సాధించిన బ్యాటర్‌గా జో రూట్ (1630).. సచిన్ (1625) రికార్డును అధిగమించాడు. అంతకుముందు 155/6 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన కివీస్ 254 పరుగులకు ఆలౌటైంది. డారిల్ మిచెల్ (84) అర్ధసెంచరీ సాధించాడు. పేసర్ బ్రైడన్ కార్స్‌కు 6, వోక్స్‌కు 3 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 348, ఇంగ్లండ్ 499 పరుగులు చేశాయి. ఇక ఈ టెస్టులో మొత్తంగా పది వికెట్లు తీసి కెరీర్ బెస్ట్ సాధించిన కార్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

రికీ, భరత్ ధనాధన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్ర కెప్టెన్ రికీ భుయ్ (35 బంతుల్లో 84), ఓపెనర్ శ్రీకర్ భరత్ (39 బంతుల్లో 63) ఉప్పల్ స్టేడియంలో ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆదివారం సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో భాగంగా సర్వీసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 23 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత ఆంధ్ర.. రికీ, భరత్ విజృంభణతో 20 ఓవర్లలో 8 వికెట్లకు 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో సర్వీసెస్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 199 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. మోహిత్ (74), వినీత్ (51) అర్ధ శతకాలతో రాణించినా ఫలితం లేకపోయింది. ఈ ట్రోఫీలో ఆంధ్రకు ఇది వరుసగా నాలుగో విజయం.

ఆటోకి పెళ్లి కళ

నవంబరు నెల వాహన విక్రయాల్లో వృద్ధి



న్యూఢిల్లీ: ప్రస్తుతం వివాహాల సీజన్ జరుగుతున్న నేపథ్యంలో దేశంలో కార్ల మార్కెట్ జోరందుకుంది. నవంబరులో మారుతి సుజుకీ, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్ అమ్మకాల్లో వృద్ధిని నమోదు చేశాయి. ప్రధానంగా గ్రామీణ మార్కెట్లలో ఏర్పడిన రికవరీ, ఎస్‌యూవీలకు ప్రజల నుంచి లభిస్తున్న బలమైన డిమాండ్ కూడా అమ్మకాలు పుంజుకోవడానికి దోహదపడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రధాన కంపెనీలన్నీ అమ్మకాల్లో వృద్ధి సాధించాయి. మార్కెట్ దిగ్గజమైన మారుతి సుజుకీ నవంబరులో 1,41,312 కార్లను విక్రయించింది. గత ఏడాది నవంబరులో విక్రయించిన 1,34,158 యూనిట్లతో పోల్చితే 5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ప్రధానంగా గత నెలలో గ్రామీణ మార్కెట్లలోకి తమ కంపెనీ విస్తరణ 48.7 శాతం ఉన్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ చెప్పారు. బ్రెజ్జా, ఎర్టిగా, గ్రాండ్ విటారా, ఎక్స్‌ఎల్6 వంటి యుటిలిటీ కార్ల అమ్మకాలు పెరిగాయని ఆయన అన్నారు. అయితే ఆల్టో, ఎస్-ప్రెసో వంటి మినీ కార్లు, బాలెనో, సెలేరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, వ్యాగన్ ఆర్ వంటి కాంపాక్ట్ కార్ల విక్రయాలు మాత్రం తగ్గాయని తెలిపారు.

- హ్యుండయ్ మోటార్ ఇండియా విక్రయాలు మాత్రం గత నవంబరుతో పోల్చితే 2 శాతం తగ్గి 49,451 నుంచి 48,246 యూనిట్లకు పరిమితం అయ్యాయి. ఎగుమతులు కూడా 20 శాతం తగ్గాయి. అయితే గ్రామీణ విక్రయాల వాటా మాత్రం 22.1 శాతానికి పెరిగింది.
- టాటా మోటార్స్ 2 శాతం, టయోటా కిర్లోస్కర్ మోటార్ 44 శాతం, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్స్ 20 శాతం వృద్ధిని సాధించాయి.
- ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ మోటార్ విక్రయాలు 10 శాతం పెరిగి 4,01,250 యూనిట్లకు చేరుకోగా సుజుకీ మోటార్ సైకిల్ విక్రయాలు 8 శాతం వృద్ధితో 94,370 యూనిట్లుగా నమోదయ్యాయి.

టాప్ గేర్‌లో విదేశీ పెట్టుబడులు

ఆరు నెలల్లో రూ.2.52 లక్షల కోట్లు

ఏడో స్థానంలో తెలంగాణ

న్యూఢిల్లీ: భారత్‌లోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) మళ్లీ ఊపందుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబరు) భారత్ 2,979 కోట్ల డాలర్ల (సుమారు రూ2.51 లక్షల కోట్లు) ఎఫ్‌డీఐని ఆకర్షించింది. గత ఏడాది ఇదే కాలంతో వచ్చిన 2,050 కోట్ల డాలర్లతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువ. ఈ ఆరు నెలల్లో ఎఫ్‌డీఐని ఆకర్షించడంలో మహారాష్ట్ర 1,355 కోట్ల డాలర్లు (రూ.1,14,490 కోట్లు), కర్ణాటక 354 కోట్ల డాలర్ల (రూ.29,800 కోట్లు)తో తొలి రెండు స్థానాల్లో ఉండగా తెలంగాణ 154 కోట్ల డాలర్ల (రూ.13,000 కోట్లు)తో ఏడో స్థానంలో నిలిచింది. ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో వచ్చిన 2,979 కోట్ల డాలర్ల ఎఫ్‌డీఐలో 1,360 కోట్ల డాలర్లు.. ఈ ఏడాది జూలై-సెప్టెంబరు నెలల్లో వచ్చింది.

ఆగని ఎఫ్‌పీఐల అమ్మకాలు: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరుగుతున్నా మన స్టాక్ మార్కెట్లో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) అమ్మకాలు కొనసాగుతున్నాయి. నవంబరులో కూడా ఈ సంస్థలు 256 కోట్ల డాలర్ల (సుమారు రూ.21,612 కోట్లు) విలువైన షేర్లు విక్రయించాయి. అయితే అక్టోబరులో జరిపిన 1,120 కోట్ల డాలర్లతో (సుమారు రూ.94,017 కోట్లు) పోలిస్తే ఇది చాలా తక్కువ.

జోరు తగ్గిన జీఎస్‌టీ వసూళ్లు



నవంబరులో రూ.1.82 లక్షల కోట్లు.. అక్టోబరుతో పోలిస్తే తక్కువే

న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధి రేటు తగ్గింది. గత నెల (నవంబరు) జీఎస్‌టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 8.5 శాతం ఎక్కువ. అయితే ఈ ఏడాది అక్టోబరులో వసూలైన రూ.1.87 లక్షల కోట్లతో పోలిస్తే మాత్రం ఇది రూ.5,000 కోట్లు తక్కువ. నవంబరులో వసూలైన రూ.1.82 లక్షల కోట్ల జీఎస్‌టీలో రూ.1.4 లక్షల కోట్లు దేశీయ లావాదేవీలు, రూ.42,591 కోట్లు దిగుమతి సుంకాల ద్వారా వసూలైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఏడాది నవంబరులో దేశీయ లావాదేవీల ద్వారా వసూలైన జీఎస్‌టీ 9.4 శాతం, దిగుమతి సుంకాల ద్వారా వసూలైన జీఎస్‌టీ 6 శాతం పెరిగాయి.

ఏ జీఎస్‌టీ ఎంత ?

నవంబరులో వసూలైన రూ.1.82 లక్షల కోట్ల జీఎస్‌టీలో సీజీఎస్‌టీ ద్వారా రూ.34,141 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ ద్వారా రూ.43,047 కోట్లు, ఐజీఎస్‌టీ ద్వారా రూ.91,828 కోట్లు, సెస్సుల ద్వారా రూ.13,253 కోట్లు వసూలయ్యాయి. జీఎస్‌టీ అధికారులు గత నెల రూ.19,259 కోట్ల రిఫండ్స్‌ను జీఎస్‌టీ చెల్లింపుదారుల ఖాతాల్లో జమచేశారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 8.9 శాతం తక్కువ. రిఫండ్స్ పోను గత నెల నికరంగా రూ.1.63 లక్షల కోట్ల జీఎస్‌టీ ప్రభుత్వ ఖాతాల్లో జమైంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ.

వడ్డీ రేట్లలో ఊరట లేనట్టే

4-6 తేదీల్లో ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ

ముంబై: ఈ నెల 6న ప్రకటించనున్న ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వడ్డీ రేట్ల తగ్గింపు జోలికి వెళ్లకపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దేశంలో ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధిలో గరిష్ఠ స్థాయి కన్నా పైకి దూసుకుపోయిన నేపథ్యంలో ఈ విడత కూడా యథాతథ స్థితినే కొనసాగించవచ్చని భావిస్తున్నారు. పైగా జీడీపీ గణాంకాలు కూడా నిరుత్సాహపూరితంగా ఉన్న కారణంగా ఏడాది మొత్తానికి వృద్ధి అంచనాలు కూడా తగ్గించవచ్చన్నది వారి అభిప్రాయం. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నాయకత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్యవిధాన కమిటీ (ఎంపీసీ) వచ్చే బుధవారం (4వ తేదీ) నుంచి మూడు రోజుల పాటు ఆర్థిక వ్యవస్థ తాజా స్థితిని సమగ్రంగా సమీక్షించనుంది. శుక్రవారం దాస్ ఎంపీసీ నిర్ణయాలను ప్రకటిస్తారు. ఆర్‌బీఐ చివరిగా గత ఏడాది ఫిబ్రవరిలో రెపో రేటును 6.5 శాతానికి సవరించింది.

24,400 పైన బుల్లిష్

(డిసెంబరు 2-6 తేదీల మధ్య వారాంతపు విశ్లేషణ)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్నో అనాలసిస్

నిఫ్టీ గత వారం 24,354-23,873 పాయింట్ల మధ్యన కదలాడి 224 పాయింట్ల లాభంతో 24,131 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,129, 23,980, 23,914, 24,139 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,400 బ్రేక్‌డౌన్ స్థాయి: 23,850
నిరోధ స్థాయిలు: 24,330,24,430, 23,530
(24,230 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 23,930, 23,830, 23,730
(24,030 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



2వ తేదీ			
హైదరాబాద్	610	విజయవాడ	620
వరంగల్	612	గోదావరి	608
చిత్తూరు	633	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	104
వరంగల్	90	గుంటూరు	99
కరీంనగర్	90	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	85
కర్నూలు	90	నెల్లూరు	85
విశాఖపట్నం	100	అనంతపురం	85
గోదావరి	104		

కన్సాలిడేషన్ బాటలోనే..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. ప్రస్తుతానికి అదానీపై అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు వివాద ప్రభావం తగ్గింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే మార్కెట్లు పెరిగే అవకాశం ఉంది. భారత జీడీపీ వృద్ధి రేటు మందగించటం ఈ వారం మార్కెట్లపై ప్రభావం చూపించవచ్చు.

స్టాక్ రికమండేషన్స్

భారతి ఎయిర్‌టెల్: జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 15 శాతం దిద్దుబాటుకు గురైన ఈ షేరు 20 శాతం మేర పెరిగే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీలు చెప్పటంతో ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఒడుదొడుకులు తక్కువగా ఉండటం, నిఫ్టీతో పోలిస్తే జోరు ప్రదర్శిస్తుండటం మరో విశేషం. గత శుక్రవారం ఈ షేరు 4.28 శాతం లాభంతో 1,627.15 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,680/1,710 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎల్ఐసీ: మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో 50 శాతం వాటా కొనుగోలు చేయబోతోందన్న వార్తలు, అన్ని రకాలైన బీమా సేవలు అందించేందుకు అనుమతినివ్వాలని ప్రభుత్వం యోచిస్తుండటంతో ఈ షేరుకు డిమాండ్ పెరిగింది. జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి పతనమైన తర్వాత రూ.900 స్థాయిలో కీలక మద్దతు లభించింది. గత శుక్రవారం 5 శాతం లాభంతో రూ.985 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.960 స్థాయిలో ప్రవేశించి రూ.1,050/1,100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.940 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

దివీస్ లేబొరేటరీస్: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. సెప్టెంబరులో నాలుగేళ్ల గరిష్ఠాన్ని బ్రేక్ చేసిన తర్వాత మూమెంటమ్ మరింత పెరిగింది. జీవితకాల గరిష్ఠానికి చేరిన తర్వాత ఈ షేరు సైడ్‌వేస్‌లో కదలాడుతోంది. అక్యుములేషన్ జరుగుతోంది. బ్రోకరేజీ సంస్థలు టాప్ రేటింగ్ ఇవ్వటంతో గత శుక్రవారం ఈ షేరు 3.71 శాతం లాభంతో రూ.6,172 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.6,100 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.6,250/6,300 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,050 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: సెప్టెంబరు త్రైమాసిక ఫలితాల తర్వాత 15 శాతం పతనమైన ఈ షేరుకు రూ.3,100 స్థాయిలో మద్దతు లభించింది. చివరి రెండు వారాల్లోనే 8 శాతం మేర పెరిగింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తుండటం గమనార్హం. గత శుక్రవారం 3.79 శాతం లాభంతో రూ.3,200 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.3,300 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.3,450/3,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,225 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్: బహుళ సంవత్సరాల బ్రేకౌట్ తర్వాత జీవితకాల గరిష్ఠానికి చేరిన ఈ షేరు జూలై నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. రూ.150 వద్ద కీలకమైన మద్దతు దొరకటమే కాకుండా డబుల్ బాటమ్‌ను ఏర్పాటు చేసుకుంది. గత శుక్రవారం 3.38 శాతం లాభంతో రూ.179 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.175 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.190/215 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.168 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 పైన నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో 23,000 వద్ద రికవరీ కొనసాగించి 24,350 వరకు వెళ్లినప్పటికీ బలమైన రియాక్షన్‌లో పడింది. గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడిని ఇది సూచిస్తోంది. అయినా వారం మొత్తం మీద 225 పాయింట్ల లాభంతో 24,130 వద్ద అనిశ్చిత ధోరణిలో క్లోజైంది. గతంలో సాధించిన బేరిష్ ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించినప్పటికీ ప్రధాన ట్రెండ్‌లో ఎలాంటి మార్పు లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో సానుకూలత కోసం 24,000 వద్ద కన్సాలిడేట్ కావాలి. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 1,375 పాయింట్లు , స్మాల్ క్యాప్-100 సూచీ 900 పాయింట్లు లాభపడ్డాయి. శుక్రవారం విడుదలైన జీడీపీ గణాంకాల పట్ల మార్కెట్ సోమవారం ఎలా ప్రతిస్పందిస్తుందో చూడాలి. మరింత అప్రమత్త ట్రెండ్ ఏర్పడే అవకాశం ఉన్నందు వల్ల 24,000 స్థాయిలో మరోసారి పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: సానుకూలత కోసం నిఫ్టీ రాబోయే కొద్ది రోజుల్లో బలంగా కన్సాలిడేట్ కావాలి. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 24,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 24,550.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినట్టయితే గత వారం ఏర్పడిన బాటమ్ 23,800 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,500.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం ప్రారంభంలో 920 పాయింట్లు లాభపడినా బలమైన రియాక్షన్‌లో పడి చివరికి వారం కనిష్ఠ స్థాయికి చేరువలో క్లోజైంది. సానుకూలత కోసం 52,000 వద్ద నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,550. ప్రస్తుత స్థాయి 51,700 వద్ద విఫలమైతే మరింత బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 51,000.

పాటర్న్: ట్రెండ్‌లో సానుకూలత కోసం నిఫ్టీ 25 డీఎంఏ (24,000 సమీపంలో) వద్ద నిలదొక్కుకోవాలి. 23,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతగా భావించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,230, 24,300
మద్దతు	24,000, 23,920



ఏటూరునాగారం అడవుల్లో..
ఏడుగురు నక్సల్స్ కాల్చివేత

- ఆదివారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్
- నిద్రిస్తున్న భద్రు దళంపై పోలీసుల దాడి..!?
- బూటకపు ఎన్‌కౌంటర్.. విచారణ జరిపించాలి: లక్ష్మణ్

ములుగు/ఏటూరునాగారం రూరల్, కోల్‌సిటీ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ములుగు జిల్లా ఏటూరు నాగారం అడవుల్లో మరోమారు తుపాకీ గర్జించింది. ఆదివారం ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సలైట్లు మృతిచెందారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాలకు ఒక రోజు ముందు మావోయిస్టులకు కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. మృతుల్లో ఓ మహిళ సహా.. నర్సంపేట-ఇల్లందు ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఈగోలపు మల్లయ్య అలియాస్ మధు ఉన్నారు. వీరిలో మధు స్వస్థలం పెద్దపల్లి జిల్లా రాణాపూర్ కాగా.. మిగతా ఏడుగురు నక్సల్స్ ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం అభయారణ్యాన్ని గ్రేహౌండ్స్ స్పెషల్‌పార్టీ పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఈ క్రమంలో.. ఆదివారం ఉదయం పోలకమ్మవాగు సమీపంలో నక్సల్స్ ఉన్నట్లు గుర్తించారు. ఇరువైపులా అరగంట పాటు కాల్పులు జరిగాయి. మావోయిస్టుల వైపు కాల్పులు ఆగిపోయిన కాసేపటికి.. పోలీసులు ఏడు మృతదేహాలను గుర్తించారు. మృతుల్లో భద్రు, మధుతోపాటు.. ఏరియా కమిటీ సభ్యులు ముస్సాకి దేవల్ అలియాస్ కర్ణాకర్, ముస్సాకి జమునలు ఉన్నట్లు గుర్తించారు. మిగతా ముగ్గురిని దళసభ్యులు జైసింగ్, కిశోర్, కామేశ్‌గా భావిస్తున్నారు. ఘటనాస్థలిలో రెండు ఏకే-47 తుపాకులు, జీత్రీ, 303-రైఫిల్, ఇన్సాస్ తుపాకీ, ఎస్‌బీబీఎల్ గన్, సింగిల్ షాట్ తుపాకీ, తపంచా, కిట్‌బ్యాగులు, విప్లవ సాహిత్యం, వంట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పలువురు మావోయిస్టులు తప్పించుకొని పారిపోయినట్లు భావిస్తున్న పోలీసులు.. కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ శబరీశ్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు. కవరేజీకోసం వెళ్లిన మీడియా ప్రతినిధులను అడవిలోకి రావొద్దంటూ వారించిన ఎస్పీ.. తప్పించుకున్న ఆరుగురు మావోయిస్టుల కోసం కూంబింగ్ జరుగుతోందని చెప్పారు. అంతకు ముందు అదనపు ఎస్పీ కూడా మీడియాను నిలిపివేశారు. ఈ క్రమంలో ఇరు పక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా, భద్రు దళం నిద్రలో ఉన్న సమయంలో పోలీసులు ఈ కాల్పులు జరిపారని తెలుస్తోంది. నిద్రిస్తున్నవారు కంగారులో తప్పించుకోలేని పరిస్థితుల్లో తూటాలకు బలైనట్లు సమాచారం. మృతదేహాలు పొదల్లో పడి ఉన్న తీరు.. కాళ్లకు బూట్లు/చెప్పులు లేకపోవడం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తోందని పౌరహక్కుల నేతలు చెబుతున్నారు. ఏటూరునాగారంలో జరిగింది బూటకపు ఎన్‌కౌంటర్ అని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ ఆరోపించారు. ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పీఎల్‌జీఏ వారోత్సవాలు.. ఏజెన్సీలో టెన్షన్

సోమవారం నుంచి జరగనున్న మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ) వారోత్సవాలకు దండకారణ్యం వేదిక కావడంతో.. పోలీసులు అప్రమత్తమై.. ఏజెన్సీలు, అడవుల్లో నక్సల్స్ కోసం జల్లెడపడుతున్నారు. ముందు జాగ్రత్తగా అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేయించి.. హిట్‌లిస్టులో ఉన్న నేతలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ ఏడాది జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 261 మంది నక్సల్స్ చనిపోయిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణకు మావోయిస్టులు ఈ వారోత్సవాలను వేదికగా చేసుకున్నారు.

ప్రజలు చెప్పిందే ఫైనల్..!



- పథకాల అమలుపై ప్రజాభిప్రాయ సేకరణ
- ప్రజలిచ్చే రేటింగ్‌తో మార్పులు, చేర్పులు
- ఐవీఆర్ఎస్ వాడుకోవాలని ప్రభుత్వం నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే పథకాలు, చేపట్టే కార్యక్రమాలు, తీసుకునే నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం ముందుకెళ్లాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకు వారి అభిప్రాయాల మేరకు నడుచుకోవాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఇకపై ప్రభుత్వం అమలుచేసే పథకాలపై ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్) ద్వారా ప్రజలకు ఫోన్లు చేసి ఆయా కార్యక్రమాల అమలు తీరును తెలుసుకోనుంది. లబ్ధిదారులకే నేరుగా ఫోన్ చేసి ఆ పథకం వల్ల ప్రయోజనం, అమలవుతున్న తీరు, సేవల్లో నాణ్యత వంటి అంశాలపై వారి నుంచే ఫీడ్‌బ్యాక్ తీసుకోనుంది. వాటిపై ప్రజలు ఇచ్చే రేటింగ్ ఆధారంగా ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేసుకుంటుంది. ఇంటింటికీ పెన్షన్లు, దీపం-2 కింద గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాల లబ్ధిదారుల నుంచి ఈ ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. పెన్షన్ సక్రమంగా ఇంటి వద్దనే అందుతుందా..?, లేదా..?, దీపం-2 పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పొందడంలో ఏమైనా ఇబ్బందులున్నాయా..? వంటి ప్రశ్నల ద్వారా లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు తీసుకోనున్నారు.

పౌర సేవలపైనా అభిప్రాయ సేకరణ..

పథకాలతో పాటు ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పాలసీల అమలుపైనా ప్రజాభిప్రాయం తీసుకోనున్నారు. ఉచిత ఇసుక విధానం అమలు, మద్యం కొత్త పాలసీ, అమ్మకాలపైనా ప్రజల ఫీడ్‌బ్యాక్ సేకరిస్తారు. పథకాలు, కార్యక్రమాల అమలుతో పాటు రానున్న రోజుల్లో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ వంటి పలు కీలక శాఖల్లో ప్రజలకు అందుతున్న పౌరసేవలపై కూడా ఐవీఆర్ఎస్ ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకోనున్నారు. ప్రజలు ఎక్కడైనా అసంతృప్తి వ్యక్తం చేస్తే.. దానికి గల కారణాలను విశ్లేషించి సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల్లో కూడా బాధ్యత పెంచి ప్రజలకు మెరుగైన సేవలందించేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలు చెప్పిందే ఫైనల్ అనే ప్రాతిపదికన ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. ఇలా ప్రభుత్వం నుంచి వచ్చే ఫోన్ కాల్స్ ఓపికగా తమ అభిప్రాయాలు చెప్పాలని సీఎం ప్రజలను కోరారు. వీటికోసం ప్రజలు వెచ్చించే ఒకటి రెండు నిమిషాల సమయంతో ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవలు పొందే అవకాశం ఏర్పడుతుందన్నారు. దీనికి ప్రజలు తమ వంతుగా సహకరించాలని, మెరుగైన పాలనలో భాగస్వామ్యం కావాలని సీఎం పిలుపునిచ్చారు.

గతంలోనూ అమలు..

ఐవీఆర్ఎస్ విధానంలో వచ్చే కచ్చితమైన అభిప్రాయాల ద్వారా గతంలో మంచి ఫలితాలు సాధించిన సందర్భాలున్నాయి. సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీ అభ్యర్థుల ఖరారు విషయంలో చంద్రబాబు ఈ విధానాన్ని పాటించారు.

కాకినాడ పోర్టుపై
జగన్ నోరువిప్పాలి



బియ్యం స్మగ్లింగ్ వెనుక భారీ నెట్‌వర్క్

- మాఫియా వెనుక ఎవరున్నా చర్యలు తప్పవు
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల హెచ్చరిక


తెనాలిలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

అమరావతి/తెనాలి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు ద్వారా భారీస్థాయిలో జరుగుతున్న రేషన్ బియ్యం స్మగ్లింగ్ వెనుక ఎవరున్నారో? కాకినాడ పోర్టును లాక్కోవడానికి చేసిన దౌర్జన్యాల వెనుక ఎవరున్నారో మాజీ సీఎం జగన్ నోరు విప్పాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడారు. కాకినాడ పోర్టు నుంచి జరుగుతున్న రేషన్ బియ్యం స్మగ్లింగ్ వెనుక భారీ నెట్‌వర్క్ పనిచేస్తోందని చెప్పారు. కాకినాడ సీపోర్టులోకి అరబిందో రియాలిటీ ఏవిధంగా వచ్చింది? కాకినాడ ఎస్‌ఈజడ్‌ను జీఎంఆర్ నుంచి ఎందుకు లాగేసుకున్నారు? మానస సంస్థకు కాకినాడ పోర్టులో 7 ఎకరాల భూమిని ఎందుకు కేటాయించారు? కాకినాడ సీపోర్టును బలవంతంగా లాక్కున్న అరబిందో రియాలిటీ సంస్థకు బాస్ ఎవరు? పనిగట్టుకుని కాకినాడకు చెడ్డపేరు తెచ్చిందెవరు? కాకినాడ పోర్టును స్మగ్లింగ్ డెన్‌గా మార్చిందెవరు? అని మంత్రి ప్రశ్నలు సంధించారు. రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు అడ్డాగా మారిన కాకినాడ సీపోర్టును తమ కబంధహస్తాల్లోకి లాక్కుని దందా చేయడానికి ముందస్తుగా ఒక ప్రణాళికను సిద్ధం చేసుకున్నారని తెలిపారు. కాకినాడ సీ పోర్ట్ లిమిటెడ్ యజమాని కేవీ రావు కుటుంబాన్ని బెదిరించి, వారి మెడ మీద కత్తి పెట్టి 41.12 శాతం వాటాను అరబిందో రియాలిటీకి బలవంతంగా రాయించుకున్నారని ఆరోపించారు. తాజాగా కాకినాడ పోర్టులో 640 టన్నుల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసిన షిప్‌ను పరిశీలించడానికి ఉప ముఖ్యమంత్రి పవన్ చేసిన ప్రయత్నాలకు అడ్డుపడిన వారి వెనుక ఎవరున్నారనేది కూడా ప్రజలకు అర్థం కావాలన్నారు. "గత ఐదేళ్లలో పాతుకుపోయిన బియ్యం మాఫియా పకడ్బందీ వ్యూహంతో మీడియా సహా ఎవరినీ పోర్టు లోపలకు అనుమతించలేదు. దీనికి వెనుక పెద్ద కుట్ర ఉంది. రాష్ట్రంలో రేషన్ బియ్యం సరఫరా చేయడానికి 29 వేలకుపైగా చౌక దుకాణాలు ఉండగా.. జగన్ ప్రభుత్వం డోర్ డెలివరీ పేరుతో 9,260 వ్యాన్లు కొనుగోలు చేసి రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.1,600 కోట్ల నష్టం చేకూర్చింది. ఇంటింటికీ రేషన్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ వాహనాల ద్వారానే రేషన్ బియ్యాన్ని సేకరించడం మొదలుపెట్టారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి లారీల ద్వారా అక్రమంగా తరలించిన ఉదంతాలు ఆధారాలతో సహా ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రేషన్ బియ్యం సేకరణ కోసం ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. జాతీయ రహదారులపై గ్రీన్ చానల్ ఏర్పాటు చేసుకుని నేరుగా కాకినాడ పోర్టుకు తరలించారు. కాకినాడ పోర్టు నుంచే బియ్యం ఎగుమతులు జరిగాయి. గత మూడేళ్లలో ఒక్క కాకినాడ పోర్టు నుంచి ఏకంగా కోటీ 38 లక్షల 18వేల 346 టన్నుల బియ్యం ఎగుమతి చేశారు. గత మూడేళ్లలో కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి చేసిన బియ్యం విలువ 48,537 కోట్లు. దీనిని బట్టి రేషన్ బియ్యం మాఫియా ఏస్థాయిలో దుర్మార్గాలకు పాల్పడిందో అర్థం చేసుకోవచ్చు. అరబిందో సంస్థ కాకినాడ సీపోర్టును స్వాధీనం చేసుకున్న తర్వాత నుంచే కోటీ 31 లక్షల టన్నుల బియ్యం ఎగుమతులు చేశారంటే అందరూ ఆలోచించాలి. బియ్యం స్మగ్లింగ్ మాఫియా వెనుక ఎంతటి శక్తులున్నా వదిలిపెట్టం. అన్నీ బయటకు తీస్తాం" అని మంత్రి మనోహర్ హెచ్చరించారు. ఇప్పటికి 1000 కేసులు నమోదు చేశామన్నారు.

ఆ మిల్లర్లు బ్లాక్ లిస్ట్‌లోకే!

ధాన్యం కొనుగోలు చేసే విషయంలో కొన్నిచోట్ల మిల్లర్లపై ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. తుఫాన్ కారణంగా పంట దెబ్బతిని రైతులు కష్టంలో ఉన్నారని, వారిని మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు. మిల్లర్లపై రైతుల నుంచి ఫిర్యాదు అందితే వెంటనే ఆ మిల్లర్లను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. ఆదివారం తెనాలిలో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. ధాన్యం అమ్ముకునే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? డబ్బు పడే విషయంలో సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అయితే, మిల్లర్లు కొందరు ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధాన్యం కొనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇచ్చినా మిల్లర్లు ఇంకా సాకులు చూపటం దారుణమన్నారు. 25 శాతం వరకు తేమ ఉన్నా కొనుగోలు చేయాల్సిందేనని మిల్లర్లను ఆదేశించారు.

ఉపాధి నిధులతో నర్సరీలు

- ఏడాదిలో 5 కోట్ల మొక్కల పెంపకం లక్ష్యం

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చెట్లను పెంచి పర్యావరణ సమతుల్యం చేసేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ శ్రీకారం చుట్టింది. ఇప్పటికే అటవీశాఖ వనమహోత్సవం కార్యక్రమం ద్వారా ఉపాధి నిధులతో నర్సరీల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించింది. ఈ నర్సరీలను ప్రభుత్వ, గ్రామ పంచాయతీ, ఇతర స్థానిక సంస్థల భూముల్లో ఏర్పాటు చేస్తారు. ఈ నర్సరీలను అటవీశాఖ, ఉద్యానవన శాఖతో పాటు ఇతర శాఖలు అభివృద్ధి చేస్తాయి. ఇందులో భాగంగా 2024-25లో 5 కోట్ల మొక్కలను నర్సరీల ద్వారా పెంచనున్నట్లు ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడేళ్లలో ఈ మొక్కలను నాటాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లాల కలెక్టర్లు ఆయా శాఖల అధికారులతో కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించి, అవసరమైన మొక్కలను నర్సరీ ద్వారా పెంచే ఏర్పాటు చేయాలని సూచించారు. అటవీశాఖ అధికారులు ఎస్టిమేట్లను రూపొందించి కలెక్టర్లు ఉపాధి పథకం నిధులతో ఈ నర్సరీలను మంజూరు చేస్తారంటూ ఈమేరకు మార్గదర్శకాలను విడుదల చేశారు.

ఎన్ఎంఎంఎస్ మోడల్ ప్రవేశ పరీక్ష

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ మోడల్ ప్రవేశపరీక్ష ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగింది. ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఈ పరీక్షను సుమారు 20వేల మంది విద్యార్థులు రాశారు. 2013 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మోడల్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని, దీనివల్ల ఎన్ఎంఎంఎస్ పరీక్షలో మెరుగైన మార్కులు సాధించి స్కాలర్‌షిప్ పొందే అవకాశం రాష్ట్ర విద్యార్థులకు దక్కుతుందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతల సుబ్బారావు, నరోత్తమరెడ్డి తెలిపారు.

గంధం నారాయణరావుకు మద్దతు: ఎస్టీయూ

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గంధం నారాయణరావుకు తమ మద్దతు ప్రకటిస్తున్నట్లు స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. 34 ఏళ్లపాటు ప్రభుత్వ కాలేజీలో అధ్యాపకునిగా, ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ఆయన శాసనమండలికి వెళ్తే విద్యారంగం అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

అరకొర వసతులు అద్దె భవనాలు



అనకాపల్లిలోని ఒక ప్రైవేటు దుకాణ సముదాయం మేడ మీద నడుస్తున్న జిల్లా ఖజానా అధికారి కార్యాలయం

ఇరుకు గదుల్లో...

అనకాపల్లి జిల్లాలో దాదాపు 35కు పైగా ప్రభుత్వ శాఖల జిల్లా కార్యాలయాలు అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో నడుస్తున్నాయి. సొంత భవనాల్లో నిర్వహిస్తున్న కార్యాలయాలు ఐదులోపే ఉంటాయి. అనకాపల్లి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న శంకరంలో ఒక ప్రైవేటు కళాశాల భవనాన్ని లీజుకు తీసుకొని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. బీసీ సంక్షేమ శాఖ, ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖల కార్యాలయాలు సెల్లార్లలో కొనసాగుతున్నాయి. జిల్లా ఖజానా కార్యాలయం ఒక దుకాణ సముదాయం మూడో అంతస్థులో ఉంది. గృహ నిర్మాణ సంస్థ పీడీ కార్యాలయం ఒక అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేశారు. చాలామంది ఉద్యోగులు నేటికీ విశాఖపట్నం, అల్లూరి జిల్లాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు.

పేరుకే జిల్లా కేంద్రం

పాడేరు కేంద్రంగా ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి, ముఖ్య ప్రణాళికాధికారి, డ్వామా, డీఆర్‌డీఏ, ఉద్యాన శాఖ, ఖజానాధికారి కార్యాలయాలకు మాత్రమే ఫర్నీచర్, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించారు. ఇతర కార్యాలయాలకు ప్రభుత్వం నుంచి కనీసం బెంచీ, కుర్చీ వంటివి సైతం ఇవ్వలేదు. ఆయా శాఖల అధికారులే సమకూర్చుకున్నారు. తొలుత స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవన సముదాయంలో జిల్లా సహకార సంస్థ, ఆడిట్, అగ్నిమాపక, మైనారిటీ సంక్షేమం, మైనారిటీ ఫైనాన్స్, దివ్యాంగుల సంక్షేమం, రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గదులు కేటాయించారు. తర్వాత వాటిని మినీ స్టేడియానికి మార్చారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. కలెక్టర్, ఎస్పీ కార్యకలాపాలు మాత్రమే ప్రజలకు తెలుస్తుండగా, మిగిలిన కార్యాలయాల్లో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. పాడేరు పేరుకు జిల్లా కేంద్రం అయినా డివిజన్ స్థాయి పాలన సాగుతోందనే అభిప్రాయం వినిపిస్తోంది.

అరకొర వసతులతోనే...

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో అరకొర వసతులు, చాలీచాలని సిబ్బంది, నిధుల కొరతతో పాలన సాగుతోంది. అమలాపురంలోని డీఆర్డీఏ భవన సముదాయంలో కలెక్టరేట్, జాయింట్ కలెక్టర్ చాంబర్లు, కాన్ఫరెన్సు హాళ్లు ఉన్నాయి. ఇవి మాత్రమే సర్వ హంగులతో రూపుదిద్దుకున్నాయి. అమలాపురం కేంద్రంగా పంచాయతీరాజ్, డీపీవో, డీటీవో, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కొన్ని కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో ఫర్నీచర్, ఇతర సౌకర్యాల కల్పనకు అధికారులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఇక జిల్లా కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇతర జిల్లా కార్యాలయాలు ఏర్పాటు చేశారు.

ఇన్‌చార్జిల పాలన

బాపట్ల జిల్లాలో చాలా కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. జిల్లా ఏర్పాటు సమయంలో తాత్కాలికంగా ఏపీహెచ్ఆర్డీఐ భవనంలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. త్వరలోనే సమీకృత కలెక్టరేట్ నిర్మాణం జరుపుతామని అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. ఏపీహెచ్ఆర్డీఐ భవనంలో అన్ని కార్యాలయాలకు సరిపడా గదులు లేవు. దాదాపు పన్నెండు శాఖల కార్యాలయాలను ప్రైవేటు, కళాశాల భవనాల్లో నడుపుతున్నారు. వాటిలో కీలకమైన వ్యవసాయశాఖ, మైనింగ్, ఫుడ్ అండ్ సేఫ్టీ విభాగాలు ఉన్నాయి. అనేక కీలక శాఖలకు జిల్లా స్థాయి అధికారుల నియామకం జరగలేదు. ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు.



పార్వతీపురం పట్టణంలో ఐటీడీఏకు సంబంధించిన యూత్ ట్రైనింగ్ కేంద్రంలో ఎస్పీ కార్యాలయం నిర్వహిస్తున్న దృశ్యం

నిర్వహణకు నిధుల లేమి?

పార్వతీపురం మన్యం జిల్లాలో నేటికీ పరిపాలనా పరమైన ఇబ్బందులు ఉన్నాయి. చాలా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ కోసం నిర్మించిన భవనంలో కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఎస్పీ కార్యాలయానికి సొంత భవనం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో గిరిజన యువత కోసం నిర్మించిన వైటీసీ భవనంలో నిర్వహిస్తున్నారు. చాలా వరకు అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఉద్యోగులకు అవసరమైన మౌలిక వసతులు కూడా కొరవడ్డాయి. కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక కీలక శాఖలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కు. నియామకమైన అధికారులు బదిలీలపై వెళ్లిపోవడం, కొత్తవారు జిల్లాకు రాకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. జిల్లా రెవెన్యూ అధికారి పోస్టుతో పాటు పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, గిరిజన విద్యాశాఖ, మలేరియా తదితర కీలక పోస్టులకు పూర్తిస్థాయి అధికారులు లేరు. ఇన్‌చార్జి అధికారులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలకు పూర్తిస్థాయి ప్రాజెక్టు అధికారులు లేరు. మలేరియా శాఖ, డీఆర్‌డీఏ వంటి శాఖలకు సంబంధించి పోస్టులను భర్తీ చేయలేదు. గత ప్రభుత్వం కార్యాలయాల నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో ఆయా శాఖల జిల్లా అధికారులే ఆ ఖర్చులు భరించారు.

కనీస వసతుల్లేవు

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కనీస సౌకర్యాలు లేవు. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్‌తో పాటు 90 శాతం ప్రభుత్వ కార్యాలయాలు వాటిలోనే ఉన్నాయి. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు మినహా జిల్లా కార్యాలయాల్లో కనీస వసతుల్లేవు. ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. ఆయా శాఖల్లో ఉన్నతాధికారులను నియమించకపోవడంతో ద్వితీయ శ్రేణి అధికారులు, అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. చాలా శాఖల పాలన నేటికీ అనంతపురం నుంచే కొనసాగుతోంది. జిల్లా కేంద్రం పుట్టపర్తికి ఇతర ప్రాంతాలతో తగిన స్థాయిలో రవాణా సదుపాయం లేదు. రాత్రి 8.30 దాటిందంటే పలు ప్రధాన పట్టణాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేవు.



పుట్టపర్తిలో చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో ఇదీ పరిస్థితి

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ, స్వార్థ ప్రయోజనాల కోసం జిల్లాలను ఇష్టానుసారం విభజించి వదిలేశారు. జిల్లా కార్యాలయాలకు కనీసం సొంత భవనాలు సమకూర్చే ప్రయత్నం కూడా చేయలేదు. కొత్త జిల్లాల కేంద్రాలలో ఒకటీ అరా తప్ప చాలా ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోనే ఏర్పాటు చేశారు. నిర్మాణానికి కనీసం భూసేకరణ కూడా చేయలేదు. నాడు కార్యాలయాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పి మరీ జగన్ ప్రభుత్వం మాట తప్పింది. కనీస మౌలిక వసతులు కల్పించలేదు. కొన్ని చోట్ల మరుగుదొడ్లు కూడా లేవు. కార్యాలయాల నిర్వహణకు అవసరమైన నిధులూ మంజూరు చేయలేదు. దీంతో పలు కార్యాలయాల్లో అధికారులు సొంత ఖర్చుతో కుర్చీలు, బెంచీలు సమకూర్చుకోవాల్సిన దుస్థితి. జిల్లాల విభజన సమయంలో ఆయా శాఖలకు అవసరమైనంత మంది సిబ్బందిని నియమించలేదు. జిల్లా స్థాయి అధికారుల నియామకం కూడా చేపట్టలేదు. దీంతో ఇన్‌చార్జి అధికారులతో పాలన నెట్టుకొస్తున్నారు. పలు జిల్లాల కేంద్రాల్లో ఉన్నతాధికారులు స్థానికంగా అందుబాటులో ఉండటం లేదు. ఇలా చెబుతూపోతే ఎన్నో సమస్యలు. జగన్ నిర్వాకం కారణంగా ఇప్పటికీ ఆ సమస్యలు వెంటాడుతున్నాయి.



పుట్టపర్తిలో జిల్లాస్థాయి కార్యాలయాలు



క్రిష్ణా జిల్లా అద్దెభవనంలో ఎక్సైజ్‌శాఖసూపరింటెండ్ కార్యాలయం

స్థానికంగా ఉండని అధికారులు

కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో అధికశాతం ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు పాతవి కావడంతో వాటిలోనే కొనసాగుతున్నాయి. సర్వశిక్ష అభియాన్, గృహ నిర్మాణ, పౌరసరఫరాలు, బీసీ కార్పొరేషన్, అటవీ, పరిశ్రమలు, దేవదాయ, మార్కెటింగ్, భూగర్భ, గనుల శాఖ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. వ్యవసాయ ఆధారితమైన కృష్ణా జిల్లాలో కీలకమైన నీటిపారుదల శాఖ ఎస్ఈ పోస్టును ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే ఉంచారు. అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండటం లేదు. కృష్ణా ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో విజయవాడలో ఉన్న అధికారులు జిల్లాల విభజన తర్వాత కూడా అక్కడే నివాసం ఉంటున్నారు. చుట్టం చూపుగా మచిలీపట్నం వచ్చి వెళుతున్నారు.

ఫర్నిచర్ కూడా ఇవ్వలేదు

నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన పల్నాడు జిల్లాలో ఇప్పటికీ పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. ఆఫీసుల్లో కనీస వసతులు లేక ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాలలో కొన్ని కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ నిర్ణయించిన అద్దె సరిపోక అధికారులు సొంతంగా చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు, వారి నివాసాలకు వసతులు ఏర్పాటు చేశారు. ఇతర కార్యాలయాలకు కనీసం ఫర్నీచర్ కూడా సరఫరా చేయలేదు. జిల్లా అధికారుల నియామకాలు జరగలేదు. ఒక్కో అధికారి రెండు పోస్టులు నిర్వహిస్తున్నారు. దీంతో వారిపై పని భారం పెరిగింది. ఇంజనీరింగ్‌కు సంబంధించిన శాఖల్లో ఈఈ స్థాయి అధికారే ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్నారు. ఏపీడీలే పీడీలుగా పనిచేస్తున్నారు. చివరకు డీఎల్‌పీవోనే డీపీవోగా విధులు నిర్వహిస్తున్నారు.

అరకొర సిబ్బంది

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో పూర్తి స్థాయిలో వసతులు ఏర్పాటు చేయలేదు. పలు శాఖలు కార్యాలయాలు అద్దెభవనాల్లోనే నడుస్తున్నాయి. కీలక శాఖల్లో అవసరమైనంతమంది ఉద్యోగులు లేరు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తెరుచుకోలేదు. దీంతో ప్రజలు సరైన సేవలు అందక ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ఖజానా కార్యాలయంలో ఏటీవోను రాజంపేటకు బదిలీ చేశారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ముఖ్య ప్రణాళికా కార్యాలయ అధికారి ఐదు నెలల కిందట పదవీ విరమణ చేశారు. ఇంకా ఆ స్థానాన్ని భర్తీ చేయలేదు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఇద్దరే ఉద్యోగులు ఉన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఒకే గదిలో 10 సెక్షన్ల ఉద్యోగులు కూర్చొని పని చేయాల్సిన పరిస్థితి.



అన్నమయ్య జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలోని 10 సెక్షన్ల ఉద్యోగులు ఈ గదిలోనే కూర్చోవాలి

అద్దె భవనాల్లో...

విజయవాడ నగరంలో సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని మాంటిస్సోరి మహిళా కళాశాలకు మార్చారు. కలెక్టరేట్‌లో సర్వే అండ్ సెటిల్‌మెంట్, డీఆర్‌ఓ, జేసీ క్యాంపు కార్యాలయం, ప్లానింగ్ విభాగంతో పాటు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్లు మాత్రమే నడుస్తున్నాయి. మిగిలిన జిల్లా స్థాయి కార్యాలయాలన్నీ సింగ్‌నగర్‌లో ఎక్కువగా అద్దె భవనాలలో ఏర్పాటు చేశారు.



విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నడుస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం

అధికారులకు చాంబర్లే లేవు

రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన తూర్పుగోదావరి జిల్లాలో ఇప్పటికీ పాలనా పరంగా అనేక సమస్యలు ఉన్నాయి. కలెక్టరేట్‌కు సొంత భవనాలు లేవు. రాజమహేంద్రవరం, వేమగిరి హైవేలో బొమ్మూరులో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన నేక్ భవనంలో కలెక్టర్ కార్యాలయంతో పాటు జేసీ, అగ్రికల్చరల్, సర్వే, ఎలక్షన్ సెల్, డీఎస్‌ఓ, పౌర సరఫరా, సీపీఓ తదితర కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ మరుగుదొడ్ల సమస్య ఉంది. ఇక ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. గిరిజన యువజన పారిశ్రామిక శిక్షణ సంస్థ (డీటీసీ)ను ఖాళీ చేయించి అక్కడ కొన్ని కార్యాలయాలు పెట్టారు. కానీ ఇక్కడ గదులు సరిగ్గాలేవు. పరిశ్రమల శాఖలో జిల్లా అధికారి కూర్చోవడానికి ప్రత్యేక చాంబర్ లేదు. డ్వామా పీడీ ఆఫీసు పరిస్థితీ అంతే. సమాచార శాఖ కార్యాలయంలో డీపీఆర్‌ఓ, ఇద్దరు డీఎల్‌పీఆర్వోలు ఉన్నప్పటికీ వారు కూర్చోవడానికి చాంబర్లు లేవు. కొన్ని కార్యాలయాలలో ద్వారాలు చిన్నవి కావడంతో టేబుళ్లు కూడా పట్టని పరిస్థితి. ఎస్పీ కార్యాలయం, ఇరిగేషన్‌కు మాత్రం కొత్త జిల్లాల ఏర్పాటుకు ముందు నుంచే సొంత భవనాలు ఉన్నాయి. కలెక్టర్‌కు నివాస భవనం లేకపోవడంతో గతంలో సబ్ కలెక్టర్ ఉన్న భవనాన్ని కేటాయించారు. ఇక పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ వంటి ఇంజనీరింగ్ విభాగాల్లో ఎస్ఈ కేడర్ అధికారులు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారు. బలహీనవర్గాల కార్పొరేషన్లు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి.


ఇంకా అవస్థలే



నంద్యాలలో పాడుబడిన బీఎస్ఎన్ఎల్ భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు

నంద్యాల జిల్లాలో కలెక్టర్ కార్యాలయం సహా ఇతర అన్ని శాఖల కార్యాలయాలు తాత్కాలిక, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఫర్నీచర్‌ను కూడా పూర్తిస్థాయిలో సమకూర్చలేదు. నంద్యాలలోని బీఎస్ఎన్ఎల్ భవనంలో ఏడెనిమిది శాఖలకు కార్యాలయాలను కేటాయించారు. సరైన వసతులు లేకపోవటంతో ఐసీడీఎస్ మహిళా అధికారుల అభ్యర్థన మేరకు ఆ ఒక్క శాఖ కార్యాలయాన్ని ఇటీవలే వేరే చోటుకు తరలించారు. ఆ భవనానికి వాచ్‌మన్ కూడా లేకపోవడంతో రాత్రి 7 దాటితే చాలు ఆకతాయిలు, మందుబాబులు వచ్చి చేరుతున్నారు. జిల్లా పంచాయతీ కార్యాలయం, భూగర్భ, జలవనరుల శాఖ, డ్వామా, డీఆర్‌డీఏ వంటి కార్యాలయాలకు కేటాయించిన అద్దె భవనాలు ఉద్యోగుల అవసరానికి సరిపోయే విధంగా లేవు. ఇరుకైన గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా విభజన సమయంలో ఆయా శాఖలకు తగినంత మంది సిబ్బందిని కేటాయించలేదన్న వాదన వినిపిస్తోంది. దీంతో పని ఒత్తిడి పెరిగిపోతోందని ఉద్యోగులు వాపోతున్నారు. ఏ కార్యాలయం ఎక్కడ ఉందో ఇప్పటికీ జిల్లా ప్రజలకు తెలియని పరిస్థితి.

ఇంటర్ ఉత్తీర్ణత పెంచేందుకు 'సంకల్ప్'



అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచేందుకు 'సంకల్ప్-2025' అనే వినూత్న కార్యక్రమాన్ని ఇంటర్ విద్యామండలి రూపొందించింది. 2023-24లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో తక్కువ మంది విద్యార్థులే ఉత్తీర్ణులు కావడంతో ఈ విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణతను పెంచడమే లక్ష్యంగా దీనిని అమలు చేస్తోంది. ఇప్పటి వరకు ఉన్న విధానంలో విద్యార్థులు ఎవరికివారుగా చదువుకుంటున్నారు. ఇక నుంచి వారి సామర్థ్యాలను అంచనా వేసి, దానికి అనుగుణంగా విద్యార్థులను వర్గీకరించనుంది. చదువులో వెనుకబడిన విద్యార్థులను మెరుగుపరిచేందుకు జూనియర్ లెక్చరర్లు, ఇతర సిబ్బందిని 'కేర్ టేకర్లు'గా నియమించనుంది. ఈ మేరకు డిసెంబరు 1 నుంచి ఈ కార్యక్రమం అమలుకు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి కృతికా శుక్లా మార్గదర్శకాలు జారీ చేశారు. అయితే 1న సెలవు కావడంతో సోమవారం నుంచి సంకల్ప్-2025 అమల్లోకి రానుంది.

విద్యార్థుల విభజన

ప్రతి కాలేజీలో విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. అక్టోబరులో జరిగిన క్వార్టర్లీ పరీక్షల ఆధారంగా ఈ వర్గీకరణ ఉంటుంది. చదువులో మెరుగ్గా ఉన్నవారిని గ్రూప్ ఏ, అంతంతమాత్రంగా ఉన్నవారిని గ్రూప్ బీ, ఫెయిల్ అయినవారిని గ్రూప్ సీగా వర్గీకరిస్తారు. హాఫ్‌యర్లీ, ప్రీ ఫైనల్ పరీక్షల్లో వచ్చే మార్కుల ఆధారంగా విద్యార్థుల కేటగిరీలు మారుతూ ఉంటాయి. సీ-గ్రూపు విద్యార్థులకు క్వశ్చన్ బ్యాంక్‌లు ఇస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు వారికి స్టడీ అవర్లు నిర్వహిస్తారు. అవసరమైతే 5 తర్వాత కూడా స్టడీ అవర్లు ఉంటాయి.

కేర్‌టేకర్లదే బాధ్యత

విద్యార్థుల అభ్యసన స్థాయిని గుర్తించేందుకు, వారు పుంజుకునేలా చేసేందుకు బోధనా సిబ్బంది, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లను కేటాయిస్తారు. బోధనా సిబ్బంది తక్కువగా ఉంటే పీజీ అర్హత కలిగిన బోధనేతర సిబ్బందిని కూడా కేటాయిస్తారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులను సైన్స్, గణితం జూనియర్ లెక్చరర్లకు కేటాయించి వారిని గ్రూపులుగా వర్గీకరిస్తారు. బాగా వెనుకబడిన విద్యార్థులను ఐదారు మందిని ఒక గ్రూపుగా ఏర్పాటుచేసి బోధన, బోధనేతర సిబ్బందిని కేర్‌టేకర్లగా నియమిస్తారు. విద్యార్థులను మెరుగుపరిచి వారు ఉత్తీర్ణులయ్యేలా చూడటం వారి బాధ్యతగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టైమ్‌టేబుల్ సర్దుబాటు

విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా ప్రతి కాలేజీలో ప్రిన్సిపాళ్లు టైమ్‌టేబుల్‌ను సర్దుబాటు చేస్తారు. విద్యార్థులు ఎక్కువగా వెనుకబడిన సబ్జెక్టులకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఒకవేళ భాషా సబ్జెక్టుల సిలబస్ పూర్తయి.. వాటిలో విద్యార్థులు మెరుగ్గా ఉంటే, ఆ సమయాన్ని ఇతర సబ్జెక్టులకు కేటాయిస్తారు. దీని ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను కేర్ టేకర్లు ఎప్పటికప్పుడు అంచనా వేస్తారు. సోమవారం నుంచి మొదలయ్యే సంకల్ప్-2025 ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ముగిసే వరకు అమల్లో ఉంటుంది.

నమ్మకం పెంచేలా చర్యలు

ప్రభుత్వ జూనియర్ కాలేజీలు గత కొన్నేళ్లుగా అతి తక్కువ ఉత్తీర్ణతతో నెట్టుకొస్తున్నాయి. ఇంటర్ విద్యలో ప్రైవేటు విద్యా సంస్థలు ఉత్తమ ఫలితాలు సాధిస్తుంటే, ప్రభుత్వ కాలేజీలు మాత్రం వెనుకబడిపోతున్నాయి. దీంతో తల్లిదండ్రులు వీలైనంతమేరకు పిల్లలను ప్రైవేటు కాలేజీలకు పంపేందుకే మొగ్గు చూపుతున్నారు. అందులోనూ గత ప్రభుత్వంలో కొత్తగా ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లలో దారుణమైన ఉత్తీర్ణత నమోదైంది. ఎలాంటి సన్నద్ధత లేకుండా హైస్కూల్ ప్లస్ పేరుతో ఉన్నత పాఠశాలల్లో ఇంటర్ విద్యను ప్రారంభించడంతో ఈ దుస్థితి తలెత్తింది. ఈ సమస్యలను అధిగమించి ఉత్తీర్ణత పెంచేందుకు ఇంటర్ విద్యామండలి నడుం బిగించింది. ఈ నేపథ్యంలోనే అనేక చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాది నుంచి ఇంటర్ కరిక్యులమ్ కూడా మార్చి, ప్రైవేటు కాలేజీల తరహాలో జేఈఈ, నీట్‌కు కోచింగ్ కూడా ఇవ్వనుంది.

మహిళల్లోనూ పెరుగుతున్న బట్టతల

- తొలి దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమే
- జడ గట్టిగా వేసుకోవడం వల్ల ఇబ్బందే
- ఐఏ డీవీఎల్ సదస్సులో వక్తల వెల్లడి

గుంటూరు మెడికల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బట్టతల అనగానే మొదట పురుషులే గుర్తొస్తారు. మహిళల్లో ఇది చాలా అరుదు. అయితే నేటి ఒత్తిళ్లతో కూడిన జీవన శైలిలో యువతులు, మహిళల్లోనూ బట్టతల సమస్య పెరుగుతున్నట్లు ముంబైకి చెందిన హెయిర్ స్పెషలిస్ట్ డాక్టర్ రచితా దురత్ తెలిపారు. గుంటూరులో జరుగుతున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) ఆంధ్రప్రదేశ్ శాఖ 43వ వార్షిక వైద్య సదస్సులో భాగంగా ఆదివారం జరిగిన 'ఏపీ క్యుటికాన్ 2024'లో ఆమె పాల్గొన్నారు. 'బట్టతల సమస్య పరిష్కారానికి ఆధునిక చికిత్సలు.. వాటి సామర్థ్యం' అనే అంశంపై డాక్టర్ రచితా మాట్లాడుతూ.. పురుషులతో పోలిస్తే మహిళలకు జుత్తు రాలడం వంటి సమస్య తీవ్ర ఆందోళన కగిలిస్తుందన్నారు. తీవ్రమైన మానసిక ఒత్తిళ్లు, పౌష్టికాహార లోపం, జన్యుపరమైన కారణాలతో మహిళల్లోనూ ఫీమేల్ ప్యాటర్న్ బాల్డ్‌హెడ్ (బట్టతల) సమస్య ఏర్పడుతుందని తెలిపారు. టైట్‌గా లాగి జడ వేసుకోవడం వల్ల ట్రాక్షన్ ఎలఫేషియా అనే సమస్యతో తల ముందు భాగంలో జుత్తు రాలిపోయే ప్రమాదం ఉంటుందని ఆమె హెచ్చరించారు. మహిళల్లో బట్టతల సమస్యను తొలి దశలో గుర్తిస్తే కొంత వరకు నివారించ వచ్చని చెప్పారు. గతంలో ట్రాపికల్ స్టెరాయిడ్స్ మందులు దీనికి వాడే వారని, మినాక్సిడిల్ ఔషధం తక్కువ మోతాదులో ఇవ్వడం ద్వారా బట్టతల, జుత్తు ఊడటం వంటి సమస్యలను నియంత్రించే అవకాశం ఉందని ఆమె వివరించారు. ఇంట్రా డెర్మల్ ఇంజెక్షన్స్, ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా (పీఆర్‌పీ) విధానాల్లో కూడా బట్టతలపై జుత్తు మొలిపించే అవకాశం ఉందని డాక్టర్ రచితా వెల్లడించారు. కాగా, సోరియాసిస్ రోగుల్లో కీళ్ల నొప్పులు (సోరియాటిక్ ఆర్థరైటిస్) బారిన పడే అవకాశం ఉందో లేదో కొన్నేళ్ల ముందుగానే తెలుసుకొనేందుకు స్పెషల్ అల్ట్రాసౌండ్ పరీక్ష అందుబాటులోకి వచ్చిందని గుంటూరుకు చెందిన సీనియర్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ కేఏ సీతారామ్ తెలిపారు. ఒకవేళ ఆర్థరైటిస్ వచ్చే అవకాశం ఉందని ఈ పరీక్షలో నిర్ధారణ అయితే ముందస్తు చికిత్సలతో కీళ్లనొప్పులు రాకుండా నివారించవచ్చని వివరించారు. డాక్టర్ మాధవ రెడ్డి మాట్లాడుతూ చర్మంపై వేయించుకొనే పచ్చబొట్టులను లేజర్ చికిత్సతో తొలగించవచ్చన్నారు. ఆర్ జీరో, ఆర్ 20 టెక్నిక్స్‌తో పచ్చబొట్టును చెరిపేయవచ్చన్నారు. డాక్టర్ బీఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళల్లో అవాంఛిత రోమాలను, కాలిన మచ్చలను లేజర్‌తో తొలగించవచ్చన్నారు. అనంతరం సదస్సులో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించే కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కాగా సదస్సులో ఐఏ డీవీఎల్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీకి చెందిన డీవీఎల్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. 2025లో సంఘం రాష్ట్ర సదస్సు తిరుపతిలో జరుగుతుందని ఆయన ప్రకటించారు.

హమ్మయ్య.. ముప్పు తప్పింది

(మొదటి పేజీ తరువాయి)

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల్లో అనేకచోట్ల భారీ నుంచి అతిభారీగా, అక్కడక్కడ కుంభ వృష్టిగా వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంతాలు నీట మునిగాయి. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కోస్తా, రాయలసీమల్లోని మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. వరి, పత్తి, మరికొన్ని పంటలకు నష్టం వాటిల్లింది. కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. సోమవారం దక్షిణ కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. దక్షిణ కోస్తాలో మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించింది. తుపాన్ తీరం దాటడంతో అన్ని ఓడరేవుల్లో హెచ్చరికలను ఉపసంహరించారు.

ఆవర్తనంగా మొదలై 11 రోజులు..

సాధారణంగా తుఫాను తీరం దాటిన తరువాత క్రమేపీ భూ ఉపరితలంపై పయనించి బలహీనపడుతుంది. అయితే మయన్మార్ పరిసరాల్లో కొనసాగుతున్న రిడ్జ్ ప్రభావంతో ఫెంగల్ తుఫాన్ తీరందాటిన తరువాత కూడా అక్కడే ఉండిపోయిందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఆ రిడ్జ్ వల్లే ఉత్తర తమిళనాడు తీరానికి వచ్చిన తుఫాన్ పశ్చిమంగా దిశ మార్చుకుందన్నారు. గత నెల 21న ఏర్పడిన ఉపరితల ఆవర్తనం పలు దశల్లో బలపడి శనివారం రాత్రి తీరం దాటే వరకు మొత్తం 11 రోజులు కొనసాగిందని, ఇన్ని రోజులు సముద్రంలో కొనసాగడంతో పెనుతుఫాన్‌గా మారాల్సి ఉందని, అయితే, శ్రీలంక, తమిళనాడులో భూ ఉపరితలం నుంచి పొడిగాలులు వీయడంతో ఫెంగల్ తుఫాన్ బలపడలేదని విశ్లేషించారు. లేకుంటే ఏపీలో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లేదని వివరించారు.

మూడు జిల్లాల్లో భారీ వర్షాలు..

తుఫాన్ ప్రభావంతో 24 గంటల్లో తిరుపతి జిల్లా పుత్తూరులో రికార్డు స్థాయిలో 187 మిల్లీమీటర్ల వాన పడింది. మనుబోలులో 153.2, రాచపాలెంలో 152.5, సూళ్లూరుపేట మండలం మన్నార్పోడులో 149.25, తడ మండలం భీములవారిపాలెంలో 137, చిటమూరు మండలం మల్లాంలో 134.5, నెల్లూరు జిల్లా మనుబోలులో 133.5, దొరవారిసత్రం మండలం పూలతోటలో 124, నగరిలో 120.75, సూళ్లూరుపేటలో 118 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నెల్లూరు జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో వాగు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఇతర జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన పడింది. రానున్న 48గంటల్లో కోస్తా, రాయలసీమలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.



నెల్లూరు తల్పగిరి కాలనీలో నిలిచిన వర్షం నీరు, అల్లూరులో నీట మునిగిన వరినాట్లు

4,463 హెక్టార్లలో పంటల మునక

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు రాష్ట్రంలోని 4,463 హెక్టార్లలో పంటలు ముంపునకు గురైనట్లు వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. తిరుపతి, చిత్తూరు, కోనసీమ, నెల్లూరు జిల్లాల్లో ప్రధానంగా వరి 4,171, వేరుశనగ 202, మినుము, పెసర, కంది, మొక్కజొన్న పంటలు 90 హెక్టార్లలో ముంపు బారిన పడగా, తిరుపతి జిల్లాలో 3,845 హెక్టార్లలో వరి నీట మునిగినట్లు అధికారులు గుర్తించారు. ఈ నాలుగు జిల్లాల్లోని 42 మండలాల్లో 393 గ్రామాలు ప్రభావితమయ్యాయని, 4,663 మంది రైతుల కు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు.

తిరుమలను కప్పేసిన పొగమంచు

తిరుమలలో వరుసగా మూడవరోజైన ఆదివారం కూడా వర్షం కురిసింది. చలి కూడా బాగా పెరగడంతో చాలామంది భక్తులు దర్శనం పూర్తికాగానే తిరుగు ప్రయాణమయ్యారు. దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేసింది. రెండవ ఘాట్‌రోడ్డులో 14, 15 కిలోమీటర్ల వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు బండరాళ్లు, మట్టిని ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. తిరుమల ప్రెస్‌క్లబ్, ఆదిశేష విశ్రాంతి భవనం వద్ద చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వర్షాలకు తిరుమల కొండపై ఉన్న ఐదు డ్యామ్‌లు నిండుతున్నాయి.



పొగమంచులో తిరుమల శ్రీవారి ఆలయం

అదుపు తప్పిన ఇండిగో విమానం

- తుఫానులో ల్యాండింగ్ ప్రయత్నం
- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

చెన్నై, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను వల్ల ఏర్పడిన ప్రతికూల వాతావరణంలో విమానం ల్యాండింగ్‌కు ప్రయత్నించి అదుపు తప్పింది. అయితే, పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. శనివారం సాయంత్రం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఏ320 నియో విమానానికి ఎదురైన పరిస్థితి ఇది. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'విమానం రన్‌వేపై దిగేందుకు ప్రయత్నించడం ఆ వీడియోలో కనిపించింది. దాని చక్రాలు నేలకు అంగుళాల దూరంలో ఉండగా విమానం కుదుపులకు లోనవడంతో పైలట్ ల్యాండింగ్ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. వెంటనే విమానం తిరిగి గాల్లోకి లేచింది.



తుఫానులో ల్యాండింగ్‌కు ప్రయత్నించి కుదుపులకు గురవుతున్న విమానం



పుదుచ్చేరి నగరం నడిబొడ్డున వరదలా ప్రవహిస్తున్న వర్షం నీరు

పుదుచ్చేరిలో తుఫాన్ బీభత్సం

కుండపోత వర్షాలతో అతలాకుతలం

- 24 గంటల్లో 51 సెం.మీ. వాన.. నీటమునిగిన గ్రామాలు
- విద్యాసంస్థలకు నేడు సెలవు.. తేరుకుంటున్న చెన్నై

చెన్నై, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో కురిసిన కుండపోత వర్షాలకు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అతలాకుతలమైంది. శనివారం పుదుచ్చేరి వద్ద తుఫాను తీరం దాటడంతో పెనుగాలులతో భారీగా వర్షాలు కురిసి జలదిగ్బంధంలో చిక్కుకుంది. శనివారం ఉదయం నుంచి ఆదివారం వేకువజాము 5.30 గంటల వరకు 51 సెం.మీ. వర్షపాతం నమోదైంది. పుదుచ్చేరి నగరంతోపాటు చుట్టూ ఉన్న గ్రామాలు సైతం నీటమునిగాయి. దీంతో పాఠశాలలు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం తెలిపారు. పలు ప్రాంతాల్లో ఇళ్ల చుట్టూ రెండడుగుల ఎత్తున నీరు నిలిచి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉప్పారు వాగు సమీపంలోని గోవిందారోడ్డు, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. వాహనాల రాకపోకలకూ అంతరాయం ఏర్పడింది. ముఖ్యమంత్రి రంగసామి అధికారులతో కలిసి పర్యటించి సహాయక చర్యలను ముమ్మరం చేశారు. తమిళనాడు రాజధాని చెన్నైలోనూ సుమారు 350 ప్రాంతాలు జలమయమై వాహనాల రాకపోకలు స్తంభించాయి. విల్లుపురం, కడలూరు జిల్లాలపై తుఫాను తీవ్ర ప్రభావం చూపింది. ఆ రెండు జిల్లాల్లో జనావాస ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పంటపొలాలు నీట మునిగాయి. రాష్ట్రమంత్రులు ఆ జిల్లాల్లో అధికారులతో కలిసి సహాయక చర్యలు చేపడుతున్నారు. ఫెంగల్ తుఫాను నత్తనడకన ఆదివారం మధ్యాహ్నానికి పూర్తిగా తీరాన్ని దాటిందని భారత వాతావరణ పరిశోధన సంస్థ దక్షిణ మండల అధికారి బాలచంద్రన్ తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో తీరం దాటే ప్రక్రియ మొదలైందని పుదుచ్చేరి వద్దే ఆరుగంటలపాటు స్థిరంగా నిలిచి, తర్వాత గంటకు 7 కి.మీల వేగంతో విల్లుపురం, కడలూరు జిల్లాల వైపు కదిలిందని, దీంతో ఆ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయన్నారు.



ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

2030 నాటికి ఎయిడ్స్ నివారణే లక్ష్యం: సీఎం

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎయిడ్స్ నివారణే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆదివారం 'అంతర్జాతీయ ఎయిడ్స్ డే' సందర్భంగా ఆయన 'ఎక్స్'లో స్పందించారు. ఎయిడ్స్ నివారణ దినోత్సవంలో భాగంగా 'బ్రేకింగ్ ది సైలెన్స్' నినాదంతో 2030 నాటికి ఎయిడ్స్‌ను అంతం చేయడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని తెలిపారు. అందరికీ ఆరోగ్యం, గౌరవాన్ని భరోసా ఇద్దామన్నారు. రాష్ట్రంలో దాదాపు 3.25 లక్షల మంది హెచ్‌ఐవీతో బాధపడుతున్నారని.. యువతలో అత్యధికంగా కొత్త కేసులు నమోదవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వారిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి 50 కిలోమీటర్ల లోపు లింక్ ఏఆర్‌టీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు.

నేనెవరిపైనా కేసు పెట్టలేదు

- ఎర్రావారిపాలెం బాలిక కేసుపై తండ్రి ప్రకటన
- చెవిరెడ్డిపై పోక్సో కేసులో సంచలన మలుపు

తిరుపతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తామెవరి మీదా కేసు పెట్టలేదని, తన కూతురిపై దాడి జరిగితే చెవిరెడ్డి భాస్కరరెడ్డిని తామే పిలిచామని లైంగికదాడి ఘటనపై బాలిక తండ్రి స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలంలో ఓ మైనర్ బాలికపై అత్యాచారం జరిగినట్లు అవాస్తవ ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేశారంటూ బాధితురాలి తండ్రి ఫిర్యాదుపై మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డిపై పోక్సో కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. అయితే వారం రోజుల తర్వాత బాధిత బాలిక తల్లిదండ్రులు వైసీపీ నేతలతో కలసి మీడియా ముందుకొచ్చి చెవిరెడ్డిపై తాము కేసు పెట్టలేదని ప్రకటించారు. బాలిక తండ్రి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. తాను చదువుకోలేదని, పోలీసులు సంతకం పెట్టమని చెబితే పెట్టానని చెప్పారు. తన బిడ్డకు అన్యాయం జరిగిందని సహాయం చేయడానికి వచ్చినవారిపై కేసు ఎలా పెడతానని ప్రశ్నించారు. భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ ఈ విషయంలో పోలీసులు తప్పు చేశారని తేలిపోయిందని అన్నారు.

రాష్ట్ర కేబినెట్ భేటీ రేపే

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని ఒక రోజు ముందే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4న ఈ భేటీ జరగాలి. తాజాగా మంగళవారం జరపాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 3వ తేదీ ఉదయం 11 గంటలకు సచివాలయంలో కేబినెట్ సమావేశం జరుగుతుందని.. అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి.. జీఏడీకి పంపించాలని ఆదేశించారు.

గరుగుబిల్లిలో అక్రమ మైనింగ్ ఆపండి: సీపీఐ రామకృష్ణ

అమరావతి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలో ఆత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సాగిస్తున్న అక్రమ మైనింగ్‌ను ఆపాలని కోరుతూ సీపీఐ నేత రామకృష్ణ ఆదివారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖ రాశారు. ఇప్పటికే 12 మంది కిడ్నీ వ్యాధులతో చనిపోగా.. అనేక మంది అనారోగ్యం పాలయ్యారని వివరించారు. కాగా, అదానీకి, బీజేపీకి సంబంధం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు.

భూమి కోసం.. విముక్తి కోసం!

(మొదటి పేజీ తరువాయి)

చేసిన ఫిర్యాదులు ఇందులో ఉన్నాయి. అంటే, మొత్తం ఫిర్యాదుల్లో ఇవి 38.88 శాతం. అధికశాతం ఫిర్యాదులు ఉన్న విభాగం కూడా రెవెన్యూశాఖదే కావడం గమనార్హం. గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి (వీఆర్‌వో), సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, తహసీల్దార్, ఆర్‌డీవో..చివరకు భూముల వ్యవహారాలు చూసే జాయింట్ కలెక్టర్‌లపై కూడా ఫిర్యాదులు వచ్చాయి. రెవెన్యూశాఖపై వచ్చిన ఫిర్యాదుల్లో అధికారులపై వచ్చినవే 9.87 శాతం ఉన్నాయి.

ఇవీ రెవెన్యూ విన్నపాలు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో కొందరు దుండగులు మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రికార్డుల రూమ్‌ను తగలబెట్టిన సంగతి తెలిసిందే. ఈ పరిణామం తర్వాత భూములు కోల్పోయిన పేదలు, సామాన్యులు పెద్ద ఎత్తున ముందుకొచ్చి మదనపల్లిలోనే ఉన్న రెవెన్యూ స్పెషల్ సీఎస్ ఆర్.పి.సిసోడియాకు వ్యక్తిగతంగా వినతి పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమం కోసమే ఆయన మూడురోజుల పాటు అక్కడే మకాం వేశారు. పరిస్థితిని గమనించిన ప్రభుత్వం, జిల్లా కలెక్టరేట్‌తోపాటు పలు చోట్ల ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించింది. ఇప్పటికీ తెలుగుదేశం పార్టీ, జనసేన కార్యాలయాల్లో ప్రజాదర్బార్‌లు నిర్వహిస్తూ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్నారు. రెవెన్యూ విన్నపాల్లో ప్రధానంగా ఏడు కేటగిరీలు ఉన్నాయి. అవీ...

కేసులపై పునర్విచారణ

ప్రభుత్వానికి అందిన ప్రజల విన్నపాలను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్‌ను(పీజీఆర్ఎస్) అందుబాటులోకి తీసుకొచ్చారు. రెవెన్యూశాఖపై వచ్చిన ఫిర్యాదుల్లో 16వేలు పరిష్కరించామని జిల్లాల అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే, తమ సమస్య పరిష్కారం కాలేదని బాధితులు మరోసారి ప్రభుత్వాన్ని ఆశ్రయించడంతో అనుమానం వచ్చి అన్నింటినీ తిరిగి తెరిపించి పునర్విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆ 16 వేల దరఖాస్తులపై జిల్లాలవారీగా కార్యాచరణ నివేదిక ఇవ్వాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

కేటగిరీ	ఫిర్యాదులు
ఆర్‌వోఆర్, పాస్‌పుస్తకాల్లో సమస్యలు	20,840
భూకబ్జా (ల్యాండ్ గ్రాబింగ్)	20,811
అసైన్డ్ ఇంటిస్థలాలు	7,393
రెవెన్యూ ఉద్యోగులు, అధికారులపై ఫిర్యాదులు	6,571
భూముల దురాక్రమణ	5,606
ఉద్యోగులు, సర్వీసు సమస్యలు	4,016
భూ సేకరణ సమస్యలు	2,245
మొత్తం	**67,928**

గ్రామసభల్లో రీ సర్వే గందరగోళం...

జగన్ పాలనలో భూసర్వే చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా ఈ ప్రక్రియను కొనసాగిస్తోంది. ఇప్పటి వరకు 6,688 గ్రామాల్లో సర్వే పూర్తిచేసినట్లు రెవెన్యూశాఖ చెబుతోంది. అయితే, అందులో పాసుపుస్తకాలు జారీ చేసిన రెండు వేల గ్రామాల పరిధిలో ఇప్పటిదాకా గ్రామసభలు జరిగాయి. ఈ గ్రామాల పరిధిలో రీసర్వేకు సంబంధించి.. 2,79,148 వినతులు రెవెన్యూ శాఖకు చేరాయి. ఇందులోనూ.. భూమి విస్తీర్ణం, సరిహద్దుల కొలతల్లో భారీ తేడాలు వచ్చాయంటూ 92,551 మంది ప్రజలు ఫిర్యాదు చేశారు. వెంటనే వాటిని సరిచేసి, తమ పాత రికార్డులను పునరుద్ధరించాలని రెవెన్యూ అధికారులకు పిటిషన్లు ఇచ్చారు.

రెవెన్యూ సదస్సుల వేదికగా పరిష్కారం...ప్రభుత్వానికి ఇప్పటిదాకా వ్యక్తిగతంగా వచ్చిన ఫిర్యాదులు, విన్నపాలూ; అలాగే రీ సర్వే జరిగిన గ్రామసభల్లో ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరలో జరిగే రెవెన్యూ సదస్సుల వేదికగా పరిష్కరించాలని సీఎం చంద్రబాబు రెవెన్యూశాఖను ఆదేశించారు. ఈ నెలలోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని సీఎం ఆదేశించారు. త్వరలో షెడ్యూల్ విడుదల కానుంది. ప్రజల నుంచి ప్రభుత్వానికి వచ్చిన ప్రతి వినతికీ రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం చూపాలని ఇప్పటికే చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. దరఖాస్తుల పరిష్కారంపై థర్డ్‌పార్టీతో తనిఖీ (ఆడిట్)కూడా చేయించాలని ఆదేశించారు. అంటే, ప్రభుత్వానికి తాము ఇచ్చిన వినతులను ప్రభుత్వం సరిగ్గా పరిష్కరించిందా? లేదా? అనేది ప్రజలకు తెలిసేలా థర్డ్‌పార్టీ ఆడిటింగ్ చేయించనున్నారు.

రీ సర్వేగ్రామాల్లో వచ్చిన ఫిర్యాదుల వరుస ఇదీ	
అంశం	వినతులు
విస్తీర్ణం, సరిహద్దు తేడాలు	92,551
పాసుపుస్తకాల్లో పేరు తప్పులు	50,641
సర్వేనంబర్ తప్పులు	7,675
ఆధార్ నంబర్ తప్పుగా నమోదు	4,488
మొబైల్ నంబర్ తప్పుగా నమోదు	4,336
భూమి స్వభావం తప్పుగా నమోదు	4,156
రికార్డుల్లో భూమి విస్తీర్ణం తప్పుగా నమోదు	13,162
ఇతర అంశాలు	38,667
ఉమ్మడి ఎల్‌పీఎమ్‌ల్లో తప్పులు	63,472
మొత్తం	**2,79,148**

టాప్ 10 జిల్లాలివే..

రెవెన్యూ విన్నపాల్లో ఎక్కువగా ఎన్టీఆర్, అన్నమయ్య, చిత్తూరు, అనంతపురం, అనకాపల్లి, ప్రకాశం, నెల్లూరు, కడప, సత్యసాయి, ఏలూరు జిల్లా ల నుంచి వచ్చాయి. ప్రభుత్వ స్థాయిలో, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, విభాగాధిపతుల స్థాయిలో 51 విన్నపాలను స్వీకరించి పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌లకు పంపించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో అనకాపల్లి, బాపట్ల, ప్రకాశం, పల్నాడు, నెల్లూరు, ఏలూరు, విశాఖ, తిరుపతి, సత్యసాయి జిల్లాలు బాగా వెనుకబడి ఉన్నాయని ప్రభుత్వం గుర్తించింది, ఈ నేపథ్యంలో ఈ జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీసీఎల్ఏను ప్రభుత్వం ఆదేశించింది. దరఖాస్తుల పెండింగ్ భారీగా ఉన్న మండలాలకు డిప్యూటీ కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్‌డీవోలను పంపి పర్యవేక్షించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రతి మంగళవారం సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించింది.

త్వరలోనే కొత్త వక్ఫ్‌బోర్డు

- వక్ఫ్ ఆస్తులను రక్షించలేకపోయిన పాత బోర్డు
- అందుకే రద్దుచేశాం: రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వారం, పది రోజుల్లో నూతన వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు కూటమి ప్రభుత్వం తెలిపింది. ముందుగా అర్హులైన సభ్యులతో కొత్త బోర్డును ఏర్పాటు చేస్తామని, అనంతరం సమర్థుడైన వ్యక్తిని చైర్మన్‌గా సభ్యులు ఎన్నుకొంటారని పేర్కొంటూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. "గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన వక్ఫ్ బోర్డు, వక్ఫ్ ఆస్తుల పరిరక్షించడంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించింది. పాలనా కార్యకలాపాలను కూడా విస్మరించింది. పైగా న్యాయ వివాదాల్లో చిక్కుకుంది. దీనిపై దాఖలైన పెండింగ్ వ్యాజ్యాలలో హైకోర్టు సూచనల మేరకు చర్యలు తీసుకున్నాం. వక్ఫ్‌బోర్డును రద్దు చేశాం. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నం.47కు ఉపసంహరించాం" అని ఆ ప్రకటనలో తెలిపింది.

జీవో నం.47 ఉపసంహరణకు కారణాలివే...

గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా విడుదల చేసిన జీవోల్లో జీవో నం.47 ఒకటి. ఈ జీవోకు వ్యతిరేకంగా కోర్టుల్లో 13 రిట్ పిటిషన్లు దాఖలయ్యాయి. ముస్లిం మైనారిటీల్లో ప్రధాన సమూహాలైన సున్నీలు, షియాలకు వక్ఫ్‌బోర్డులో ప్రాతినిధ్యం లేకుండాపోయింది. మాజీ ఎంపీలను బోర్డులో చేర్చుకోలేదు. జూనియర్ న్యాయవాదులను ఎంపిక చేయడం సీనియర్ న్యాయవాదులతో వివాదాలకు దారి తీసింది. వివిధ కోర్టుల్లో కేసుల కారణంగా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎన్నిక జరగలేదు. మార్చి 2003 నుంచి బోర్డు కార్యకలాపాలు స్తంభించాయి. వక్ఫ్‌బోర్డు దీర్ఘకాలికంగా పని చేయకపోవడం, దాని చట్టబద్ధతను ప్రశ్నిస్తూ రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జీవో నం.47ను రద్దుచేసింది.

దుష్ప్రచారం తగదు: ఫారూఖ్ షిబ్లీ

కూటమి ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు వ్యవస్థనే పూర్తిగా రద్దు చేసినట్టు కొన్ని సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ తెలిపారు. సీఎం చంద్రబాబు, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్.. మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారికి అండగా ఉంటున్నారని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.